www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
హైదరాబాద్ సిటీ*

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 273

గురువారం | 18-1-2024

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి రా. 8.46 తదుపరి నవమి; నక్షత్రం: అశ్వని రా. 2.59 తదుపరి భరణి; వర్జ్యం: రా.11.05-12.38; దుర్ముహూర్తం: ఉ.10.35-11.19, మ.3.01-4.36; అమృతఘడియలు: రా.7.57-9.31; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 5.59

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఒప్పంద పత్రాలతో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, జయేశ్ రంజన్

₹37,870 కోట్లు

తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు పలు కంపెనీల సంసిద్ధత

- దావోస్‌లో ఒకేరోజు రికార్డు స్థాయి ఒప్పందాలు
- అదానీ గ్రూప్ పెట్టుబడి రూ.12,400 కోట్లు
- 9వేల కోట్లతో జిందాల్ పంప్ట్ స్టోరేజీ ప్రాజెక్టు
- రూ.8వేల కోట్లతో 'గోదీ' లిథియం గిగా ఫ్యాక్టరీ
- రూ.5200 కోట్లతో వెబ్‌వెర్క్స్ డేటా సెంటర్
- రూ.2 వేల కోట్లతో ఆరాజెన్ లైఫ్ సైన్సెస్ విస్తరణ
- రూ.వెయ్యి కోట్లతో గోద్రెజ్ కెమికల్ ప్లాంట్
- 270కోట్లతో ఖమ్మంలో పామాయిల్ సీడ్ గార్డెన్


హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కొత్త పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ అదరగొడుతోంది. ప్రపంచ ఆర్థిక సదస్సు (డబ్ల్యూఈఎఫ్) జరుగుతున్న స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం భారీ పెట్టుబడులు సాధిస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా.. బుధవారం ఒకేరోజు రికార్డు స్థాయిలో రూ.37,870 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇందులో ఒక్క అదానీ గ్రూప్ వాటానే రూ.12,400 కోట్లుగా ఉంది. విద్యుత్తు, డేటా సెంటర్, ఏరోస్పేస్, డిఫెన్స్, సిమెంట్ తయారీ పరిశ్రమ రంగాల్లో అదానీ గ్రూప్ ఈ పెట్టుబడులు పెట్టనుంది. దీనికి సంబంధించి బుధవారం అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒప్పందం కుదుర్చుకున్నారు. అలాగే జల విద్యుత్తు రంగంలో జిందాల్ (జేఎస్‌డబ్ల్యూ) సంస్థ 9 వేల కోట్లతో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు

మిగతా 14వ పేజీలో...


'టాటా' చంద్రశేఖరన్‌తో సీఎం రేవంత్

దావోస్‌లో విజయవంతంగా
రేవంత్ పర్యటన

- పరిశ్రమలతో 30 వేల పైగా ఉద్యోగాలు
- రాష్ట్రానికి రానున్న టాటా, విప్రో సంస్థలు



డీఎస్సీకి అనుబంధ
నోటిఫికేషన్
మరో 7వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

- 12 వేల కొలువులతో మెగా డీఎస్సీ!
- జిల్లాల వారీగా ఖాళీ పోస్టుల గుర్తింపు
- ఈ నెలాఖరులోగా నోటిఫికేషన్ జారీ
- కసరత్తు పూర్తి చేసిన అధికారులు
- 5వేల పోస్టులతో గతంలో నోటిఫికేషన్
- అప్పుడు దరఖాస్తు చేసిన అభ్యర్థులు మళ్లీ చేయాల్సిన అవసరం ఉండదు
- కొత్త పోస్టులకు కొత్తగా దరఖాస్తు
- ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ: కోమటిరెడ్డి

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయ ఖాళీల భర్తీ కోసం మెగా డీఎస్సీ నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. గతంలో ప్రకటించిన కొలువులకు అదనంగా మరిన్ని పోస్టులను చేర్చనుంది. ఇందుకోసం అనుబంధ నోటిఫికేషన్ జారీ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ నెలాఖరులోగా ఈ నోటిఫికేషన్ జారీ చేసేందుకు వీలుగా అధికారులు కసరత్తు పూర్తి చేశారు. ప్రభుత్వం అనుమతించిన వెంటనే ఈ ప్రక్రియ చేపట్టాలని భావిస్తున్నారు. ఈ మేరకు ఆయా జిల్లాల వారీగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులపై విద్యాశాఖ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు సమాచారం. రాష్ట్రంలో 5,089 టీచర్ పోస్టుల భర్తీ కోసం గత ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా, వీటికి అదనంగా మరో 7వేల దాకా పోస్టులను చేర్చి.. మొత్తం సుమారు 12 వేల పోస్టులతో మెగా

మిగతా 12వ పేజీలో...

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో
భీకర యుద్ధం

- పామేడులో సీఆర్‌పీఎఫ్ క్యాంపులను చుట్టుముట్టిన 3 వేల మంది మావోయిస్టులు
- మంగళవారం రాత్రి నుంచి కాల్పులు.. గెరిల్లా దాడులు
- 9 మంది పోలీసులకు గాయాలు.. తప్పించుకున్న ఏపీ కూలీలు
- చెట్లు నరికి.. ల్యాండ్ మైన్స్ పేల్చి దిల్పాపురం రోడ్డు బ్లాక్
- అదనపు బలగాలు చేరుకోకుండా ప్లాన్.. హిడ్మా వ్యూహం?



చర్ల, జనవరి 17: రాకెట్ లాంచర్లతో దాడులు.. తుపాకీ తూటాల మోతలతో ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులు మంగళవారం రాత్రంతా దద్దరిల్లాయి. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పామేడు గ్రామంలోని మూడు సీఆర్పీఎఫ్ క్యాంపులతో పాటు.. కొత్తగా నిర్మిస్తున్న ధర్మారం శిబిరాన్ని సుమారు 3 వేల మంది మావోయిస్టులు చుట్టుముట్టి.. రాకెట్ లాంచర్లతో దాడులకు

మిగతా 14వ పేజీలో...



మృత్యువుతో చైనా చెలగాటం

- 100 శాతం ప్రాణాంతక కరోనా సృష్టి
- పాంగోలిన్ రకం కరోనా ఉత్పరివర్తనం నుంచి సరికొత్త వైరస్ రూపకల్పన
- 4 ఎలుకలకు ఎక్కించగా 8 రోజుల్లో మృతి
- మనుషులకు సోకితే మనుగడ కష్టం
- మెదడుపై తీవ్ర ప్రభావం: శాస్త్రవేత్తలు

2

Pradhan Mantri Jan Arogya Yojana
Ayushman Bharat
PM-JAY

ఆయుష్మాన్ భారత్ కవరేజీ రెట్టింపు?

- రూ.10 లక్షలకు పెంచే యోచన
- 1న బడ్జెట్‌లో ప్రకటించే అవకాశం

2



విమానం ఆగింది

- పొగమంచు కారణంగా ఒక్కరోజే 120 సర్వీసులకు అంతరాయం
- ఢిల్లీలో 53 రద్దు.. పలు రైలు సర్వీసులూ..
- పలు విమానయాన సంస్థలకు జరిమానా

ప్రాణహితకు భూములెలా?

- మందమర్రిలో 71 ఎకరాల కేటాయింపు
- ఆయిల్‌పామ్ సంస్థకు ఇచ్చిన గత ప్రభుత్వం
- రూ.10 కోట్లు చెల్లించని 'మ్యాట్రిక్స్'
- ప్రస్తుత సర్కారు దృష్టితో గందరగోళం

13

కబ్జాపై కదిలారు

'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించిన మంత్రి కోమటిరెడ్డి.. కబ్జాదారులు, అధికార్లపై ఆగ్రహం

- తెల్లవారుజామున ఐదున్నరకే అధికారులకు ఆదేశం.. ఉదయం పది గంటల కల్లా ప్రాథమిక నివేదిక
- ఖాజాగూడ పెద్దచెరువు కబ్జాను అడ్డుకుని.. రోడ్డు పనులు ఆపాలని సీఎస్, రంగారెడ్డి కలెక్టర్‌కు ఆదేశం
- ఆక్రమణదారులు జైలుకే.. వారిపై మూడు నెలల్లో చర్యలు తీసుకుంటామని వెల్లడించిన మంత్రి
- ఆక్రమిత ప్రాంతాన్ని పరిశీలించిన యంత్రాంగం.. అది ప్రభుత్వ భూమి అంటూ బోర్డుల ఏర్పాటు
- ఎట్టకేలకు పోలీసులకు ఫిర్యాదు.. కబ్జా చేసి రోడ్డు వేస్తున్నది 'గుర్తు తెలియని వ్యక్తులట'



హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు కబ్జాపై 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని చూపుతున్న రోడ్లు భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్ సిటీ, రాయదుర్గం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్‌లో రూ.450 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసి కొండలు, గుట్టలు తొలిచేస్తూ రోడ్డు నిర్మాణం చేపట్టడాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఖాజాగూడ పెద్ద చెరువును ఆనుకొని ఉన్న ప్రముఖ నిర్మాణ సంస్థ విల్లా ప్రాజెక్టుకు అనువుగా ఈ రోడ్డును నిర్మిస్తుండడాన్ని 'కూల్‌గా కబ్జా' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' బుధవారం నాటి ప్రధాన సంచికలో కథనం ప్రచురించింది. తెల్లవారుజామున 5.30 గంటలకే ఈ కథనాన్ని చదివిన ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

మిగతా 12వ పేజీలో...

ధరణి సమస్యలపై 15 రోజుల్లో
తొలి నివేదిక

ధరణి
తెలంగాణ ప్రభుత్వం

- సచివాలయంలో ధరణి కమిటీ రెండో భేటీ
- దరఖాస్తుల పరిష్కారం తేలిగ్గా, లావాదేవీలు సులభతరంగా అయ్యేందుకు సూచనలు
- 35 సమస్యల గుర్తింపు.. 22న మరో భేటీ
- ఆ రోజునుంచీ నేరుగా సూచనల స్వీకరణ
- అందుకోసం టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు
- ఫీజు లేకుండా ధరణి సమస్యలపై ఫిర్యాదు!
- చట్టంలోనూ మార్పుల దిశగా కసరత్తు

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ధరణిపై ప్రభుత్వం వేసిన కమిటీ 15 రోజుల్లో తొలి నివేదికను ఇవ్వనుంది. ధరణిలో ఉన్న సమస్యలను తొలగించేలా, మాడ్యూల్స్‌లో ఉన్న దరఖాస్తులు తేలికగా పరిష్కారం అయ్యేలా, ధరణిలో ఇకపై ఏ లావాదేవీ అయినా సులభతరంగా మారేలా ఆ నివేదికలు పలు సిఫారసులు చేయనున్నట్టు సమాచారం. అదే సమయంలో ధరణి చట్టంలో చేయాల్సిన మార్పుల పైనా కమిటీ సిఫారసులు చేయనుంది. ధరణిపై ప్రభుత్వం నియమించిన కమిటీ మలి సమావేశం బుధవారం సచివాలయంలో జరిగింది. కమిటీ కన్వీనర్, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిత్తల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ్యులు ఎం.సునీల్ కుమార్, మాజీ సీసీఎల్‌ఏ రేమండ్ పీటర్, ఎం.కోదండ రెడ్డి, మధుసూదన్‌తో పాటు సీఎంఆర్వో

మిగతా 13వ పేజీలో...

అభివృద్ధి కోసం తండ్లాడి
ఎన్నికల్లో తడబడ్డాం

- ఇకపై కార్యకర్తలు కోరుకున్నట్లే పార్టీ పనిచేస్తుంది
- కాంగ్రెస్ ప్రభుత్వాలను కూల్చిన చరిత్ర బీజేపీదే
- వందరోజులు కాలేదని ఆగాం.. లేకుంటే చెండాడేవాళ్లం: హరీశ్
- సొంత పార్టీ వారే ముంచారు: నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ శ్రేణులు

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణను పోరాడి తెచ్చుకున్నాం. అభివృద్ధి చేసేందుకు పదేండ్లు తన్లాడినం. అసెంబ్లీ ఎన్నికల్లో తడబడ్డాం" అని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. రాజకీయాలకు అతీతంగా కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన విషయాన్ని ఎవరూ కాదనలేరన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలతో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సంప్రదాయ రాజకీయ పద్ధతులకు కేసీఆర్ దూరంగా ఉన్నారని, అది కొంత నష్టం చేసిందన్న భావన కార్యకర్తల్లో ఉందన్నారు. "మన పార్టీ

మిగతా 12వ పేజీలో...



12

అడుగేసిన కేసీఆర్
వీడియో పోస్టు చేసిన సంతోష్



సాగర్, శ్రీశైలం
చేజారినట్లే!

- కృష్ణా బోర్డుకు అప్పగించనున్న ఇరు రాష్ట్రాలు!.. జలశక్తి శాఖ భేటీలో నిర్ణయం!
- లాంఛనాలపై వారంలో ఆర్‌ఎంసీ విధివిధానాలు.. నెలలో అప్పగించాలన్న కేంద్రం
- జీవో జారీ చేశామన్న ఏపీ.. చర్చించి చెబుతామన్న తెలంగాణ అధికారులు

హైదరాబాద్/న్యూఢిల్లీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల వరప్రదాయినులుగా పేరున్న నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు ఇక ప్రభుత్వాల చేజారనున్నాయి. ఆ ప్రాజెక్టులతోపాటు వాటి పరిధిలోని 15 కాంపోనెంట్లను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ)కు అప్పగించాలని కేంద్రం చేసిన ప్రతిపాదనకు సూత్రప్రాయంగా తలూపాయి. బుధవారం కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేవశ్రీ ముఖర్జీ అధ్యక్షతన తెలుగు రాష్ట్రాల అధికారులతో జరిగిన సమావేశంలో ఈ మేరకు అంగీకారం తెలిపినట్లు సమాచారం. అయితే ప్రాజెక్టుల అప్పగింతకు తాము ఇప్పటికే జీవో జారీ చేశామని ఏపీ గుర్తు చేయగా.. తెలంగాణ అధికారులు మాత్రం ప్రభుత్వంతో చర్చించాకే తదుపరి నిర్ణయం చెబుతామని చెప్పినట్లు

మిగతా 13వ పేజీలో...

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీపై
పీటముడి!

- హైకోర్టులో కేసులు తేలాకే నిర్ణయమన్న గవర్నర్
- ఈ నెల 24న హైకోర్టులో మరోసారి విచారణ
- తిరస్కరణపై కోర్టుకెళ్లిన దాసోజు, సత్యనారాయణ
- ప్రభుత్వం, గవర్నర్ కార్యదర్శికి కోర్టు ఆదేశాలు
- తుది తీర్పు వచ్చేదాక నిర్ణయం ఉండదన్న గవర్నర్

హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): గవర్నర్ కోటాలో రెండు ఎమ్మెల్సీ పదవుల భర్తీపై పీటముడి పడింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నామినేషన్ల తిరస్కరణపై హైకోర్టులో ఉన్న రెండు రిట్ పిటిషన్లకు సంబంధించి తుది తీర్పు వెలువడే వరకు ఎమ్మెల్సీలపై ఎలాంటి నిర్ణయం ఉండదని గవర్నర్ తమిళిసై స్పష్టం చేశారు. ఈ మేరకు గవర్నర్ కార్యాలయం నుంచి బుధవారం ప్రకటన వెలువడింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు గవర్నర్ కోటాలో దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణలను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేయాలని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం గవర్నర్‌కు

మిగతా 14వ పేజీలో...

మహేశ్‌గౌడ్, బల్మూరికి ఎమ్మెల్సీ సీట్లు

- ఎమ్మెల్యే కోటా అభ్యర్థులుగా ఖరారు చేసిన కాంగ్రెస్
- ఉప ఎన్నికల్లో నామినేషన్ దాఖలుకు నేడే తుదిగడువు

గర్భిణికి అరుదైన బాంబే రక్తం దానం

» తెలంగాణ నుంచి ముందుకొచ్చిన యువకుడు

నరసాపురం, జనవరి 17: దేశంలో వందల సంఖ్యలో అత్యంత అరుదుగా మాత్రమే దొరికే బాంబే గ్రూప్ రక్తాన్ని అందించిన తెలంగాణ యువకుడు ఓ తల్లీబిడ్డ ప్రాణాలు కాపాడారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. మొగల్తూరు మండలానికి చెందిన సుమకు పురిటినొప్పులు రావడంతో నరసాపురంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. డెలివరీ చేయాలంటే ఆమెకు రక్తం ఎక్కించాలని వైద్యులు చెప్పారు. పరీక్షల్లో ఆమెది అరుదైన బాంబే బ్లడ్ గ్రూప్ అని తేలింది. దీంతో దాతల కోసం ఆన్‌లైన్‌లో విన్నవించారు. ఎవరూ స్పందించకపోవడంతో నరసాపురం రెడ్‌క్రాస్‌ను సంప్రదించారు. అక్కడి సిబ్బంది అరుదైన ఈ బ్లడ్ గ్రూప్ గురించి స్థానిక ఎమ్మెల్యే, చీఫ్ విప్ ముదునూరికి వివరించి ప్రభుత్వం ద్వారా దాతల వివరాలు సేకరించాలని కోరారు. స్పందించిన ముదునూరి ఇదే బ్లడ్ గ్రూప్ కలిగిన తెలంగాణ వ్యక్తిని సంప్రదించారు. ఆయన రక్తం ఇచ్చేందుకు అంగీకరించి కారులో నరసాపురం వచ్చి రక్తదానం చేశారు.

ధనిక రైతులపై పన్ను.. కేంద్రం యోచన

న్యూఢిల్లీ, జనవరి 17: కేంద్రప్రభుత్వం దేశంలోని ధనిక రైతులకు పన్ను విధించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. పేద రైతులను ఆదుకునేందుకు వారి ఖాతాలకు నేరుగా నగదు బదిలీ చేస్తున్న ప్రభుత్వం, సంపన్న రైతుల నుంచి పన్నులు వసూలు చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రకటన సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ దీనిని ప్రకటించే అవకాశముంది. రైతుల ఖాతాలకు నగదు జమ చేయడం రుణాత్మక వ్యయం అని రిజర్వ్ బ్యాంకు మానిటరీ పాలసీ కమిటీ మెంబర్ ఆషిమా గోయల్ అన్నారు. సంపన్న రైతుల నుంచి పన్నులు వసూలు చేసి, పన్నుల పద్ధతిలో పారదర్శకత తీసుకువచ్చేందుకు కేంద్రం అడుగులు వేస్తోందని ఆమె పేర్కొన్నారు.

ఎరువులపై సబ్సిడీని తగ్గించిన కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 17: ఎరువులపై రైతులకు కేంద్రప్రభుత్వం అందించే సబ్సిడీ ఈ ఏడాది భారీగా తగ్గనుంది. సబ్సిడీలను గత ఏడాది కంటే 30 నుంచి 34 శాతం మేర తగ్గిస్తున్నట్లు కేంద్ర రసాయన, ఎరువులశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ప్రకటించారు. పోయిన సంవత్సరం రూ. 2.56 లక్షల కోట్ల సబ్సిడీలు ఇవ్వగా, ఈ ఏడాది రూ. 1.7 నుంచి 1.8 లక్షల కోట్లు మాత్రమే ఇస్తామని చెప్పారు. బుధవారం న్యూఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అంతర్జాతీయంగా ఎరువుల ధరలు తగ్గడం, భారతదేశంలో ప్రస్తుతం ఎరువుల కొరత లేకపోవడంతో సబ్సిడీ రేట్లను తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. ఎర్రసముద్రంలో విపత్కర పరిస్థితులు ఉన్నప్పటికీ ఎరువుల దిగుమతుల్లో ఏ మాత్రం తగ్గుదల లేదని, ఈ ఏడాది 40 నుంచి 50 లక్షల టన్నుల మేర దిగుమతులుంటాయని ఆశిస్తున్నట్లు చెప్పారు.

ఆయుష్మాన్ భారత్ కవరేజీ రెట్టింపు?

న్యూఢిల్లీ, జనవరి 17: ఆయుష్మాన్ భారత్ కార్డుపై కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా 10 లక్షల రూపాయల వ్యయం వరకు వైద్యం పొందే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. ప్రస్తుతం ఆయుష్మాన్ భారత్ కార్డుపై కుటుంబానికి 5 లక్షల రూపాయల ఆరోగ్య బీమా సదుపాయం కల్పిస్తున్నారు. కేన్సర్ చికిత్స, అవయవ మార్పిడి తదితరాలకు మరింత వ్యయం అవుతున్న దృష్ట్యా 2024-25 సంవత్సరం నుంచి ఈ కార్డుపై ఆరోగ్య బీమా కవరేజీని రెట్టింపు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు అధికార వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఫిబ్రవరి 1వ తేదీన పార్లమెంటులో ప్రవేశపెట్టే మధ్యంతర బడ్జెట్‌లో దీనిపై ప్రకటన వెలువడే అవకాశం ఉందని ఆ వర్గాలు తెలిపాయి.

భారత సైన్యం భేష్!

న్యూఢిల్లీ, జనవరి 17: ప్రపంచంలోని అత్యంత శక్తిమంతమైన సాయుధ దళం కలిగిన దేశాల్లో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. సైనిక శక్తిని వెల్లడించే 'గ్లోబల్ ఫైర్‌పవర్' సంస్థ ప్రపంచ దేశాల మిలటరీకి సంబంధించిన తాజా ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. ఈ జాబితాలో అగ్రరాజ్యం అమెరికా టాప్‌లో కొనసాగుతుండగా.. రష్యా, చైనా ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. భారత్ నాలుగో స్థానంలోనూ, దక్షిణ కొరియా ఐదో స్థానంలోనూ ఉన్నాయి. గతేడాది ఐదో స్థానంలో ఉన్న బ్రిటన్ ఒక స్థానం దిగజారి ఆరో స్థానానికి పరిమితమైంది. గ్లోబల్ ఫైర్‌పవర్.. ప్రపంచవ్యాప్తంగా 145 దేశాల సైనిక బలం ఆధారంగా ఈ ర్యాంకింగ్స్ ఇచ్చింది. దళాల సంఖ్య, యుద్ధ పరికరాలు, ఆర్థిక స్థిరత్వం, భౌగోళిక పరిస్థితుల్లాంటి 60కిపైగా అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ర్యాంకులను ఇచ్చింది.

14-18 వయసు విద్యార్థుల్లో నాలుగోవంతు మంది 2వ తరగతి పుస్తకాన్నే చదవలేకపోతున్నారు!

న్యూఢిల్లీ, జనవరి 17: దేశంలో 14-18 సంవత్సరాల వయసు పిల్లల్లో 86.8% మంది విద్యాసంస్థలకు వెళ్తున్నారని, అయితే, వారిలో నాలుగోవంతు(25 శాతం) మంది తమ ప్రాంతీయ భాషల్లో 2వ తరగతి పాఠ్య పుస్తకాలనే అనర్గళంగా చదవలేకపోతున్నారని బుధవారం విడుదలైన వార్షిక విద్యా స్థితి నివేదిక(అసర్) వెల్లడించింది. గ్రామీణ భారతంలోని పిల్లల విద్య, అభ్యాసన స్థితిపై ఇంటింటి సర్వే చేసి ఈ నివేదిక రూపొందించారు. 26 రాష్ట్రాల్లోని 28 జిల్లాల్లో 14-18 సంవత్సరాల వయసున్న మొత్తం 34,745 మందిని ఈ సర్వేలో సంప్రదించారు. విద్యాసంస్థల్లో ప్రవేశాలలో లింగ వ్యత్యాసం కూడా స్వల్పంగా ఉందని నివేదిక పేర్కొంది. 11వ తరగతి, ఆపై తరగతుల్లో సగం మందికిపైగా(55.7 శాతం) ఆర్ట్స్, హ్యూమానిటీస్ కోర్సులు ఎంచుకుంటున్నట్టు పేర్కొంది. బాలురలో 36.3 శాతం మంది స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం) కోర్సుల్లో చేరుతుండగా, బాలికల్లో 28.1 శాతం మంది మాత్రమే ఆ కోర్సుల్లో చేరుతున్నట్టు తెలిపింది.

పొగమంచుతో 120 విమానాలకు అంతరాయం

న్యూఢిల్లీ, జనవరి 17: దట్టమైన పొగమంచు కారణంగా దేశవ్యాప్తంగా బుధవారం ఒక్కరోజే 120 సర్వీసులు రద్దవ్వడం లేదా ఆలస్యమవ్వడం జరిగిందని ఢిల్లీ విమానాశ్రయం వెల్లడించింది. ఒక్క ఢిల్లీలోనే పొగమంచు కారణంగా 53 విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. పలు రైలు సర్వీసులకు అంతరాయం కలిగింది. మరో నాలుగైదు రోజులు పాటు ఢిల్లీ సహా ఉత్తరాదిలో దట్టమైన పొగమంచు కొనసాగే అవకాశం భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. చలిగాలులు వీస్తాయని, చలి తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేసింది. ఇదిలా ఉండగా, ప్రామాణిక విధానాలు, సెక్యూరిటీ ప్రోటోకాల్ పాటించనందుకు మూడు విమానయాన సంస్థలతో పాటు ఓ ఎయిర్‌పోర్టుకు డీజీసీఏ బుధవారం భారీ జరిమానాలు విధించింది. ఇటీవల ప్రయాణికులు రన్‌వే పై భోజనం చేసిన ఘటనకు సంబంధించి ముంబై ఎయిర్‌పోర్ట్‌కు రూ.60 లక్షల ఫైన్ వేసింది. ఎయిర్ ఇండియా, ఇండిగో సంస్థలకు ఒక్కోదానికి రూ.1.2 కోట్ల ఫైన్ విధించింది.

అమెరికా ఉపాధ్యక్ష అభ్యర్థి రేసులో వివేక్..?

న్యూహ్యాంప్‌షైర్, జనవరి 17: అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వపు రేసు నుంచి వైదొలిగిన వివేక్ రామస్వామి బుధవారం ట్రంప్‌తో కలిసి న్యూహ్యాంప్‌షైర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతుండగా అక్కడి జనం వీపీ-వీపీ (వైస్ ప్రెసిడెంట్) అని నినాదాలు చేశారు. ట్రంప్, వివేక్ వారిని చూసి చిరునవ్వులు చిందించారు. తాను గెలిస్తే వివేక్ ఉపాధ్యక్ష సహచరుడిగా ఉంటారని ట్రంప్ సూచనప్రాయంగా వెల్లడించారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ, వివేక్ చాలా ప్రత్యేకమైన వ్యక్తి అని, ఆయన చాలా కాలంపాటు రిపబ్లికన్ పార్టీతో కలిసి ముందుకు సాగుతారని ప్రకటించారు.

అక్కడ ఉండొద్దు.. స్వదేశానికి వచ్చెయ్

» ఇరాన్‌లో తమ రాయబారికి పాక్ ఆదేశం

న్యూఢిల్లీ, జనవరి 17 : బలూచిస్థాన్‌లో ఉగ్రవాద సంస్థ జైష్-అల్-ఆదిల్‌కు చెందిన రెండు కీలక స్థావరాలపై ఇరాన్ మంగళవారం చేసిన దాడులను పాకిస్థాన్ తీవ్రంగా ఖండించింది. తమ గగనతలంలోకి అనుమతి లేకుండా ప్రవేశించడమే కాకుండా తమ సార్వభౌమ అధికారాన్ని ధిక్కరించిన ఇరాన్‌పై బుధవారం మండిపడింది. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్‌ను హెచ్చరించింది. అంతేకాక, ఇరాన్‌లోని తమ రాయబారిని వెంటనే స్వదేశానికి రమ్మని ఆదేశించింది. అలాగే, ప్రస్తుతం స్వదేశంలో ఉన్న ఇరాన్ రాయబారి కొంతకాలం పాక్‌కు రాకపోవడం మంచిదని పేర్కొంది. బలూచిస్థాన్‌లోని జైష్- అల్- అదిల్‌కు చెందిన రెండు స్థావరాలను ఇరాన్ ధ్వంసం చేసిందని ఆ దేశ అధికారిక మీడియా మంగళవారం రాత్రి ప్రకటించింది. ఇరాన్ చేసిన క్షిపణి దాడిలో ఇద్దరు చిన్నారులు మరణించారని, మరో ముగ్గురు గాయపడ్డారని పాక్ ప్రకటించింది.

అయోధ్యలో మోదీ..

వేరే ఆలయాల్లో విపక్షాలు

22న దేశంలోని ప్రధాన రాజకీయనేతలంతా భగవన్నామ స్మరణలోనే!

» అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠకు 10వేల మందికి పైగా ఆహ్వానం
» తిరస్కరించిన ఖర్గే, లాలూ, పవార్
» బీజేపీ ఎన్నికల స్టంట్ అని ఆరోపణలు
» అదే రోజున సొంత కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లే యోచన



అయోధ్యలోని గర్భగుడిలో ప్రతిష్ఠించనున్న బాలరాముడి విగ్రహాన్ని జైశ్రీరామ్ నినాదాల మధ్య బుధవారం నాడు ఆలయ ఆవరణలోకి తీసుకువచ్చారు. 22న గర్భగుడిలో ప్రాణప్రతిష్ఠ చేశాకే విగ్రహాన్ని దర్శించుకోవడానికి అవకాశం ఉంటుంది. మైసూరు శిల్పి అరుణ్ యోగిరాజ్ రూపొందించిన ఈ విగ్రహాన్ని అత్యంత భద్రత నడుమ ఓ ట్రక్కులో ఆలయానికి తరలించారు.

న్యూఢిల్లీ/అయోధ్య, జనవరి 17: అయోధ్య రామాలయంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉంది. ఈ నెల 22న అత్యంత వైభవోపేతంగా జరుగనున్న ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరు కానున్నారు. ఆలయ ప్రతిష్ఠను పురస్కరించుకొని అయోధ్యలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని, ఆధునిక వసతులతో పునరుద్ధరించిన రైల్వేస్టేషన్‌ను ఇప్పటికే ప్రారంభించారు. దేశ ప్రజల శతాబ్దాల నాటి దివ్య స్వప్నాన్ని తాము నెరవేర్చామని అధికార బీజేపీ నేతలు చెబుతుండగా, ఇదంతా మోదీ సర్కారు చేస్తున్న ఎన్నికల స్టంట్ అని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. మరోవైపు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కావాలంటూ 10వేల మందికి పైగా ప్రముఖులు, మఠాధిపతులు, మతపెద్దలకు ఆహ్వానాలు పంపారు. కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, సోనియా, రాహుల్‌గాంధీ, మమతా బెనర్జీ, లాలూప్రసాద్ సహా సీనియర్ ప్రతిపక్ష నేతలందరూ ఆహ్వానాలు అందుకున్నారు. అయితే వీరెవరూ 22న అయోధ్యకు రావడం లేదు. మతపరమైన కార్యక్రమాన్ని బీజేపీ రాజకీయం చేస్తోందని ఇండియా కూటమి నేతలు విమర్శిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని 'నరేంద్ర మోదీ ఫంక్షన్'గా రాహుల్‌గాంధీ అభివర్ణించారు. ఇంకా నిర్మాణమే పూర్తికాని ఆలయంలో ప్రాణ ప్రతిష్ఠ జరిపి, బీజేపీ తన ఓటు బ్యాంకును పెంచుకోవాలని చూస్తోందని ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, లాలూప్రసాద్, ఉద్ధవ్ ఠాక్రే ఆరోపించారు. వీరు కూడా ఆహ్వానాలను తిరస్కరించారు. అయితే, ఆయా పార్టీల నేతలు 22న తమ సొంత కార్యక్రమాల్లో పాల్గొని, ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నాల్లో బిజీగా ఉన్నారు.

కాళీ ఘాట్ సందర్శనకు మమత

కోల్‌కతాలో అన్ని మతాల ప్రజలతో కలసి 22న 'సామరస్య ర్యాలీ' నిర్వహిస్తామని మమతా బెనర్జీ ప్రకటించారు. 22న కాళీ ఘాట్‌లో కాళీమాత ఆలయాన్ని సందర్శించిన తర్వాత అన్ని మతాల ప్రజలతో కలసి తాను కూడా ర్యాలీలో పాల్గొంటానని తెలిపారు. టీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ర్యాలీ.. మసీదులు, చర్చిలు, గురుద్వారాలు సహా వివిధ మతాల ప్రార్థనాలయాలను స్పృశించి పార్క్ సర్కస్ మైదాన్ వద్ద ముగుస్తుందని మమత పేర్కొన్నారు.

అసోంలో ఆలయానికి రాహుల్

భారత్ జోడో న్యాయ యాత్రను కొనసాగిస్తున్న రాహుల్ గాంధీ 22న అసోంలో ఉంటారు. ఆ రోజు కార్యక్రమాల్లో భాగంగా అక్కడున్న ఒక ఆలయాన్ని ఆయన సందర్శిస్తారు. కాగా, తనకు ఆహ్వానం పంపినందుకు ట్రస్ట్ అధికారులకు శరద్ పవార్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రాణ ప్రతిష్ఠ పూర్తయిన తర్వాత దర్శనం సులువు అవుతుంది కాబట్టి, ఈ కార్యక్రమానికి తాను హాజరు కాబోవడం లేదని ప్రకటించారు. పైగా అప్పటికి రామమందిరం నిర్మాణం కూడా పూర్తవుతుందని పేర్కొన్నారు. మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే జనవరి 22న నాసిక్‌లోని కాలారామ్ ఆలయంలో జరిపే మహా హారతిలో పాల్గొంటానని తెలిపారు. రామమందిర ప్రతిష్ఠకు హాజరు కాబోనని లాలూప్రసాద్ బుధవారమే ప్రకటించారు.

దావో‌స్‌లో రామమందిరం సందడి

అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠ అంశం దావోస్ లోనూ సందడి చేస్తోంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సమావేశానికి హాజరైన కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని పలువురు స్థానిక భక్తులు కలిశారు. 22న సోమవారం నగర వ్యాప్తంగా రామ భజనలు చేయడంతో పాటు, సాయంత్రం వేళ దీపాలు వెలిగించేలా తమకు సందేశం ఇవ్వాలని ఆమెను కోరారు.

ధర్మవరం పట్టుచీర డిజైనర్‌కు రాని ఆహ్వానం

అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణపతిష్ఠ నేపథ్యంలో సీతమ్మవారికి పట్టుచీరను నేసిన కార్మికుడికి ఆహ్వానం అందలేదు. రామ జన్మభూమి ట్రస్ట్ కోరిక మేరకు నాలుగు నెలల పాటు రాత్రింబవళ్లు శ్రమించి సీతమ్మకు పట్టుచీరను తయారు చేశానని శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన డిజైనర్ నాగరాజు తెలిపారు. దాన్ని అమ్మవారికి సమర్పించడానికి అయోధ్యకు వెళ్లేందుకు సిద్ధమయ్యానని, అయితే ఇప్పటివరకూ తనకు ఆహ్వానం అందలేదని బుధవారం ఆయన కన్నీటిపర్యంతమయ్యారు.

పూరీలో 'జగన్నాథ్ కారిడార్' ప్రారంభం

ఒడిశాలో ప్రముఖ పుణ్యక్షేత్రం పూరీలోని జగన్నాథ ఆలయం చుట్టూ రూ.800 కోట్లతో నిర్మించిన హెరిటేజ్ కారిడార్ ప్రాజెక్టును సీఎం నవీన్ పట్నాయక్ బుధవారం ప్రారంభించారు. పూరీ గజపతి మహారాజు దివ్యసింగ్ దేవ్, నేపాల్ పశుపతినాథ్ ఆలయం, ఉజ్జయిని మహాకాల్ ఆలయం, కాశీ విశ్వనాథ ఆలయం, దుబాయ్, ఆస్ట్రేలియా, యూకేలలో ఉన్న జగన్నాథ ఆలయాలు సహా 90 దేవాలయాల ప్రతినిధులు, వేలాది మంది భక్తుల సమక్షంలో 'శ్రీమందిర్ పరిక్రమ ప్రకల్ప'ను పట్నాయక్ అధికారికంగా ఆవిష్కరించారు.

అయోధ్యకు 200 ప్రత్యేక రైళ్లు

● హైదరాబాద్, సికింద్రాబాద్, కాజీపేట నుంచి అవకాశం..ఐఆర్‌సీటీసీలోనే బుకింగ్

న్యూఢిల్లీ, జనవరి 17: అయోధ్యలోని బాల రాముడ్ని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం భారతీయ రైల్వే సుమారు 200 ప్రత్యేక రైళ్లను నడపనుంది. దేశంలోని 66 పట్టణాల నుంచి 'ఆస్థా స్పెషల్' పేరుతో వీటిని నిర్వహించనుంది. తెలంగాణలోని హైదరాబాద్, సికింద్రాబాద్, కాజీపేట జంక్షన్‌ల నుంచి ఇవి బయలుదేరనున్నాయి. ఈ నెల 22న ఆలయ ప్రాణ ప్రతిష్ఠ జరిగిన అనంతరం 100 రోజుల పాటు వీటిని నడపనుంది. ఆయా రైళ్లు.. ప్రారంభమైన స్టేషన్ నుంచి నేరుగా గమ్యస్థానమైన అయోధ్యధామ్‌కు చేరుకుంటాయి. టిక్కెట్లను కేవలం ఐఆర్‌సీటీసీ పోర్టల్‌లోనే బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రయాణికుల నుంచి రిజర్వేషన్ చార్జీలు, సూపర్‌ఫాస్ట్, కేటరింగ్ రుసుములు, జీఎస్టీలు వసూలు చేస్తారు. రైలులో శాకాహార భోజనం అందజేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏ స్టేషన్ల నుంచి ఈ రైళ్లు బయల్దేరుతాయన్న అంశంపై ఇంకా నిర్ణయం వెలువడాల్సి ఉంది.

లోకం తీరు



ప్రజల నుంచి సూచనలెందుకు అడిగారయ్యా!

రాముడితో రాజకీయమేంటి?

» మందిర నిర్మాణం పూర్తయింది
» మండపాల పనులే మిగిలాయి
» ఆలయ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా

న్యూఢిల్లీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాముడు రాజకీయం చేశాడా, లేక భక్తులే ఆయనతో రాజకీయం చేస్తున్నారో తనకు అర్థం కావడం లేదని అయోధ్య రామాలయ నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా వ్యాఖ్యానించారు. బుధవారం ఒక మీడియా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. రామ మందిరంలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో రాజకీయాలను చూడటం మన దృష్టిని బట్టి ఉంటుందన్నారు. ఆలయం పూర్తిగా నిర్మాణమైందని నృపేంద్ర స్పష్టం చేశారు. బాల రాముడు గర్భగృహంలో ఉంటారని తెలిపారు. అయిదు మండపాలు, ఆలయం కింది అంతస్తులో ఉంటాయని అన్నారు. మొదటి అంతస్తు మాత్రమే ఇంకా నిర్మాణం పూర్తి కావాల్సి ఉన్నదని చెప్పారు. అందులో రామ దర్బార్ ఉంటుందని తెలిపారు. ఆ తర్వాత నిర్మించే రెండో అంతస్తులో అనుష్ఠానం, యజ్ఞాలు జరుగుతాయని వివరించారు.

ప్రాణప్రతిష్ఠ తర్వాతా గుడి నిర్మాణం

బెంగళూరు, జనవరి 17: అయోధ్యలో రామ మందిర ప్రతిష్ఠపై జ్యోతిర్మఠం శంకరాచార్య అభ్యంతరం వ్యక్తం చేయడంపై ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్ స్పందించారు. ప్రాణప్రతిష్ఠ తర్వాత కూడా ఆలయాల నిర్మాణం కొనసాగిన సందర్భాలున్నాయని, దీనికి నిబంధనలు కూడా ఉన్నాయని తెలిపారు. "తమిళనాడులోని రామేశ్వరంలో శ్రీరాముడు స్వయంగా శివలింగానికి ప్రాణప్రతిష్ఠ చేశాడు. ఆ సమయంలో అక్కడ ఆలయమే లేదు. తర్వాతే ఆలయం నిర్మించారు" అని రవిశంకర్ చెప్పారు. మదురై ఆలయం, తిరుమల బాలాజీ ఆలయం కూడా మొదట్లో చిన్నవిగా ఉండేవని, తర్వాత కాలంలో రాజులు వాటిని నిర్మించారని గుర్తుచేశారు.

వేగంగా దేశాభివృద్ధి బీజేపీకే సాధ్యం

తొమ్మిదేళ్లలో 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి: మోదీ



గురువాయూర్ శ్రీకృష్ణుడి ఆలయంలో మోదీ

కొచ్చి/త్రిసూర్, జనవరి 17: దేశాన్ని వేగంగా అభివృద్ధి చేయగల ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని, దేశ భవిష్యత్తుపై బీజేపీకి స్పష్టమైన దృక్పథం ఉందని ప్రధాని మోదీ అన్నారు. గత తొమ్మిదేళ్లలో దేశంలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని చెప్పారు. బుధవారం కేరళలోని కొచ్చిలో సుమారు 6 వేల మంది పోలింగ్ బూత్‌ల ఇన్‌చార్జిల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేరళలో ఎల్డీఎఫ్, యూడీఎఫ్‌ల చరిత్ర అవినీతిమయమని ఓటర్లకు వివరించాలని చెప్పారు. కాగా, కొచ్చిలో రూ.4 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు. వీటిలో కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో దేశంలో అతి పెద్దదైన 'డ్రై డాక్' ఒకటి. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ డ్రై డాక్‌తో పాటు పాటు ప్రారంభించిన ఓడల నిర్మాణం, మరమ్మతుల యూనిట్, ఎల్పీజీ దిగుమతి టెర్మినల్ దక్షిణాదిలో అభివృద్ధిని వేగవంతం చేస్తాయన్నారు. మోదీ కేరళలో రెండో రోజు పర్యటనలో భాగంగా బుధవారం గురువాయూర్ శ్రీకృష్ణుడి ఆలయం, త్రిప్రయార్ శ్రీరామస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. గురువాయూర్ ఆలయంలో మలయాళ నటుడు, బీజేపీ నేత సురేశ్ గోపి కుమార్తె వివాహానికి మోదీ హాజరయ్యారు. కొత్త జంటను ఆశీర్వదించి వరమాలలు అందించారు. వారితో మాట్లాడి ఫొటోలు దిగారు. ఈ వేడుకకు మోహన్‌లాల్, మమ్ముట్టి, జయరాం, ఖుష్బూ తదితర నటులు కూడా హాజరయ్యారు.

అజ్ఞానంతో విమర్శించొద్దు: జ్యోతిరాదిత్య

న్యూఢిల్లీ, జనవరి 17: దేశవ్యాప్తంగా విమాన సర్వీసుల్లో ఆలస్యం, విమానాశ్రయాల్లో ప్రయాణికుల ఆగ్రహావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ నేత శశి థరూర్ చేసిన విమర్శలకు కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా గట్టి కౌంటర్ ఇచ్చారు. అజ్ఞానంతో, అవగాహన లేకుండా స్పందించడం మీలాంటి మేధావులకు తగదంటూ చురకేశారు. ఇంటర్నెట్ నుంచి ఎంపిక చేసి సేకరించిన సమాచారాన్ని షేర్ చేయడం పరిశోధన కిందకు రాదంటూ ఎద్దేవా చేశారు. ఇటీవలి వరుస ఘటనలపై పత్రికల కథనాలను ప్రస్తావిస్తూ థరూర్ ఎక్స్‌లో పోస్టు చేయగా.. థరూర్‌ను ఒక విషయం గురించి వినడం ద్వారా మాత్రమే తెలుసుకునే, కనీస పరిశీలన, పరిజ్ఞానం లేని వ్యక్తిగా సింధియా అభివర్ణించారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అందులో ప్రస్తావించారు.

ఈశాన్యంపై మోదీ నిర్లక్ష్యం

'న్యాయ్ యాత్ర'లో రాహుల్ గాంధీ ధ్వజం

మణిపూర్ ఘర్షణల్లో ఇద్దరు కమెండోల మృతి



న్యూఢిల్లీ/కోహిమా, జనవరి 17: ఈశాన్య భారతాన్ని ఏదో ఉద్ధరిస్తున్నట్లు ప్రధాని మోదీ గొప్పలు చెబుతుంటారని.. నిజానికి ఈ ప్రాంతాన్ని ఆయన పూర్తిగా నిర్లక్ష్యం చేశారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రధానంగా నాగాలాండ్‌లో మౌలిక వసతుల అభివృద్ధే లేదని ఆక్షేపించారు. ఒకసారి వచ్చి ఈ రోడ్లపై తిరగాలని సవాల్ విసిరారు. 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో భాగంగా బుధవారం ఆయన ఓ సభలో ప్రసంగించారు. గతుకుల రోడ్లు, అరకొరగా కరెంటు సదుపాయం, వైద్య వసతులు లేమిని విమర్శించారు. 'నాగాలాండ్ ప్రజలను ఈ చెత్త రోడ్లపై తిరగమనడం అన్యాయం. వారిని మోసగించడమే! ఇలాంటి రోడ్లపై యువతకు సానుకూల భవిష్యత్ అందించగలమని ఎలా ఆశిస్తాం? నాగాలాండ్, మణిపూర్, అసోం ప్రజలపై యావద్దేశం దృష్టి సారించేలా చేసేందుకే భారత్ జోడో న్యాయ్ యాత్ర చేపట్టాను' అని ధ్వజమెత్తారు.

మణిపూర్‌లో చల్లారని జ్వాలలు

మణిపూర్‌లో వర్గవైషమ్యాలు ఇంకా చల్లారలేదు. ప్రతి రోజూ ఘర్షణలు జరుగుతున్నాయి. బుధవారం సరిహద్దు పట్టణం మోరేహ్‌లో అల్లర్లు చెలరేగాయి. ఈ అల్లర్లలో ఇద్దరు కమెండోలు చనిపోయారు. హింసాత్మక ప్రాంతాల్లోకి అదనపు బలగాలను తరలించడం కష్టంగా మారింది. ఆందోళనకారులు వాటిపై దాడులకు దిగుతున్నారు. దీంతో హెలికాప్టర్ల ద్వారా వారిని తరలించాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది. రాజధాని ఇంఫాల్‌కు హెలికాప్టర్లు పంపాలని కేంద్ర హోం శాఖకు లేఖ రాసింది. నిరుడు అక్టోబరు 31న సీనియర్ పోలీసు అధికారి హత్యకు సంబంధించి ఇద్దరు కుకీలను పోలీసులు అరెస్టు చేశారు. వారిని విడుదల చేయాలని బుధవారం కుకీలు ఆందోళనకు దిగారు. ఇదిలా ఉండగా, మణిపూర్ ఘర్షణల్లో పోలీసు ఆయుధాలను లూటీ చేశారన్న ఆరోపణలతో అయిదుగురిపై సీబీఐ చార్జిషీటు దాఖలు చేసింది.

మేనిఫెస్టోకు సూచనలు పంపండి: కాంగ్రెస్

రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి తమ పార్టీ మేనిఫెస్టోలో చేర్చాల్సిన అంశాలను సూచించాల్సిందిగా ప్రజలను కాంగ్రెస్ కోరింది. ప్రజల నుంచి వచ్చే సూచనల్లో సాధ్యమైనన్ని ఎక్కువ అంశాల్ని చేర్చడం ద్వారా తమ పార్టీ మేనిఫెస్టోను ప్రజల మేనిఫెస్టోగా రూపొందించనున్నామని కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సారథి చిదంబరం తెలిపారు. మేనిఫెస్టో కమిటీ సభ్యులు ప్రతి రాష్ట్రంలో ప్రజలతో విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరుపుతారని, సూచనల కోసం ఈ-మెయిల్ అకౌంట్‌ను వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభిస్తామన్నారు. ప్రజలు తమ సూచనలను ఎౖీ్ఙఱ్టఱ్‌జుజీః జీఓ.జీ లేదా ఠీఠీఠీ.ఎౖీ్ఙఱ్టఱ్‌జుజీ.జీ కు

సీపీఆర్‌పై కేంద్రం కన్నెర్ర

ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రద్దు చేసిన హోం శాఖ

న్యూఢిల్లీ, జనవరి 17: ప్రముఖ స్వచ్ఛంద సంస్థ(ఎన్‌జీఓ) సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్(సీపీఆర్)పై కేంద్ర ప్రభుత్వం కన్నెర్ర చేసింది. 1973లో స్థాపించిన ఈ సంస్థ దేశంలోనే అత్యంత పురాతనమైన పరిశోధనా కేంద్రం, మేధోసంపత్తికి నిలయం. ఈ సంస్థ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందంటూ విదేశీ విరాళాల నియంత్రణ చట్టం(ఎఫ్‌సీఆర్‌ఏ) లైసెన్స్‌ను కేంద్ర హోం శాఖ రద్దు చేసింది. సీపీఆర్ లైసెన్స్ వాస్తవానికి 11 నెలల క్రితమే రద్దయింది. అయితే తాజా ఉత్తర్వులు జనవరి 10న వెలువడినట్లు సమాచారం. దీనిపై సీపీఆర్ అధ్యక్షురాలు యామినీ అయ్యర్ మీడియాతో మాట్లాడుతూ, 'మేం చట్టం పరిధిలోనే పనిచేస్తున్నాం. ఎఫ్‌సీఆర్‌ఏ రద్దు చేయడం బాధాకరం. మా వాదనను వినడానికి ఏ మాత్రం అవకాశం లేకుండా ఏకపక్షగా నిర్ణయం తీసుకున్నారు. న్యాయం కోసం అన్ని మార్గాలను వెతుకుతాం. మేం మా లక్ష్యాలకు కట్టుబడి ఉన్నాం. సమస్య రాజ్యాంగ విలువలకు లోబడి పరిష్కారమవుతుందన్న నమ్మకం మాకు ఉంది' అని అన్నారు.

మత్స్యకారుల భద్రతకు ఇస్రో 'డీఏటీ-ఎస్‌జీ'

రెండో తరం 'డిస్ట్రెస్ అలర్ట్ ట్రాన్స్‌మిటర్' అభివృద్ధి

బెంగళూరు, జనవరి 17: సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు తమ బోట్ల నుంచి అత్యవసర సందేశాలు పంపించడానికి, వారు సముద్రంలో ఎక్కడ ఉన్నారో రియల్ టైమ్‌లో గుర్తించడానికి వీలుగా అధునాతన సాంకేతిక వ్యవస్థను ఇస్రో అభివృద్ధి చేసింది. శాటిలైట్ కమ్యూనికేషన్, నావిగేషన్ సామర్థ్యం కలిగిన రెండో తరం 'డిస్ట్రెస్ అలర్ట్ ట్రాన్స్‌మిటర్' (డీఏటీ-ఎస్‌జీ)ని రూపొందించింది. శాటిలైట్ కమ్యూనికేషన్ ద్వారా మత్స్యకారులు అత్యవసర సందేశాలు పంపితే, సెంట్రల్ కంట్రోల్ స్టేషన్ వాటిని అందుకుని డీకోడ్ చేస్తుందని.. తద్వారా ఆయా బోట్లు ఎక్కడున్నాయో గుర్తించవచ్చని ఇస్రో పేర్కొంది. అలా సేకరించిన సమాచారాన్ని కోస్టు గార్డు టీమ్‌లకు పంపిస్తే ఆపదలో ఉన్న మత్స్యకారులను కాపాడడం తేలికవుతుందని వెల్లడించింది. డీఏటీ పరికరాలు 2010 నుంచే అందుబాటులో ఉన్నప్పటికీ.. శాటిలైట్ కమ్యూనికేషన్, నావిగేషన్‌లో అందుబాటులోకొచ్చిన అధునాతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకున్న ఇస్రో.. రెండో తరం డీఏటీ-ఎస్‌జీని అభివృద్ధి చేసింది. సముద్రం నుంచి హెచ్చరిక సందేశాలు పంపే మత్స్యకారులకు తిరిగి జవాబు పంపే సదుపాయం డీఏటీ-ఎస్‌జీలో ఉంటుంది.

మృత్యువుతో చైనా చెలగాటం

100 శాతం ప్రాణాంతకమైన కరోనా సృష్టి



న్యూఢిల్లీ, జనవరి 17: ప్రపంచం మొత్తాన్నీ రెండేళ్లపాటు గడగడలాడించి, కోట్లాది మంది ప్రాణాలు పోవడానికి కారణమైన కరోనా మహమ్మారిని చైనా పరిశోధకులే ల్యాబ్‌లో సృష్టించారన్న వాదనలో నిజం ఎంతుందో తెలియదుగానీ.. ఇప్పుడు వారో కొత్త వైరస్‌ను సృష్టించినట్టు సమాచారం. చైనా పీపుల్ లిబరేషన్ ఆర్మీకి చెందిన వైద్యులు తయారుచేసిన ఆ పాంగోలిన్ కరోనా వైరస్ పేరు.. 'జీఎక్స్-పీ2వీ'. సాధారణంగా పాంగోలిన్ల శరీరాల్లో కరోనా వైరస్ ఉంటుంది. అలా 2017లో మలేసియన్ పాంగోలిన్లలో గుర్తించిన 'జీఎక్స్/2017' ఉత్పరివర్తనం నుంచి ఈ కొత్త రకాన్ని చైనా పరిశోధకులు తయారుచేశారు. అది ఎంత ప్రమాదకరమైన వైరస్ అంటే.. ప్రయోగశాలలోని ఎలుకలకు 100% ప్రాణాంతకంగా పరిణమిస్తున్నట్టు బయో ఆర్కైవ్‌లో ఇటీవల ఒక రిపోర్ట్ ప్రచురితమైంది. ఆ నివేదిక ప్రకారం.. ప్రయోగశాలలోని నాలుగు ఎలుకలకు ఈ వైరస్‌ను ఎక్కించిన ఐదు రోజుల్లో వాటిలో వేగంగా బరువుతగ్గిపోవడం, కళ్లు తెల్లగా మారిపోవడం వంటి లక్షణాలు కనిపించాయి. నాలుగు ఎలుకలూ ఆ వైరస్‌ను ఎక్కించిన 8 రోజుల్లోగా చనిపోయాయి. వైరస్ వాటి మెదడుకు, కళ్లకు, ఊపిరితిత్తులకూ చాలా వేగంగా వ్యాపించినట్టు.. చివరి రెండురోజుల్లో మెదడులో వైరల్ లోడ్ విపరీతంగా పెరిగినట్టు పరిశోధకులు గుర్తించారు. ఆ వైరస్ మనుషులకూ అంతే ప్రమాదకరమని.. దురదృష్టవశాత్తూ ఆ వైరస్ ల్యాబ్ నుంచి బయటపడి మనుషులకు సోకడం మొదలైతే మానవ జాతి మనుగడే ప్రమాదంలో పడుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

కెనడాకు తగ్గిన భారతీయ విద్యార్థులు

ఒట్టావా, జనవరి 17: కెనడాలో ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు సంబంధించి ఆ దేశంతో ఏర్పడిన దౌత్య విభేదాలు భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావమే చూపాయి. ఈ విభేదాల అనంతరం భారత విద్యార్థులకిచ్చే స్టడీ పర్మిట్ల సంఖ్యను కెనడా భారీగా తగ్గించేసింది. కెనడాలో చదువుకోవడానికి వచ్చే విదేశీయుల్లో భారతీయ విద్యార్థులే అధికం. 2022లో కెనడా మొత్తం 2,25,835 మంది విదేశీ విద్యార్థులకు స్టడీ పర్మిట్లు జారీ చేయగా.. వారిలో 41 శాతం భారతీయులే ఉన్నారు. అయితే.. గతేడాది డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో 14,910మంది భారతీయ విద్యార్థులకు మాత్రమే స్టడీ పర్మిట్లు జారీ చేసింది. అంతకు ముందు మూడు నెలల వ్యవధిలో ఈ సంఖ్య 1,08,940గా ఉండేది. అంటే ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన విభేదాలు తలెత్తిన తర్వాత ఈ సంఖ్యలో దాదాపు 86 శాతం తగ్గుదల నమోదవడం గమనార్హం. గతేడాది చివర్లో భారతీయ విద్యార్థులకు జారీచేసిన స్టడీ పర్మిట్ల సంఖ్య గణనీయంగా పడిపోయిందని కెనడా ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. సమీప భవిష్యత్తులోనూ ఈ సంఖ్య పెరిగే అవకాశం లేదని ఆయన చెప్పారు. ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు భారతీయ ఏజెంట్లే కారణం అంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో నిరాధార ఆరోపణలు చేయడంతో ఇరు దేశాల మధ్య విభేదాలు తలెత్తిన సంగతి తెలిసిందే.

ఒక సెక్షన్..అనేక ప్రశ్నలు!

'17ఏ'పై సుప్రీం జడ్జీల్లో భిన్నాభిప్రాయాలు.. చంద్రబాబుకు 17ఏ వర్తిస్తుందన్న జస్టిస్ బోస్

» పాత 'నేరానికి' వర్తించదన్న జస్టిస్ త్రివేదీ



న్యూఢిల్లీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఒకే కేసు... ఒకటే చట్టం.. ఒకే కోర్టు.. ఇద్దరు న్యాయమూర్తులు! వారిద్దరి అభిప్రాయాలు, తీర్పులు వేర్వేరు! స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు '17ఏ' వర్తిస్తుందా, లేదా అనే అంశంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా త్రివేదీ భిన్నమైన తీర్పులు వెలువరించిన సంగతి తెలిసిందే. 2018లో సవరించిన అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం 'కంపీటెంట్ అథారిటీ' నుంచి అనుమతి తీసుకోనందున చంద్రబాబుపై కేసు అక్రమమే అని జస్టిస్ బోస్ అభిప్రాయపడగా.. సవరణకంటే ముందుగానే జరిగిందంటున్న నేరానికి ఈ సెక్షన్ వర్తించదని జస్టిస్ బేలా త్రివేదీ పేర్కొన్నారు. వీరి తీర్పులు బుధవారం అందుబాటులోకి వచ్చాయి. దీనిపై న్యాయ నిపుణుల్లో జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోంది.

జస్టిస్ బోస్ ఇలా...

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో దర్యాప్తు ఎప్పుడు ప్రారంభమైనదన్న విషయానికి జస్టిస్ అనిరుద్ధ బోస్ ప్రాధాన్యమివ్వగా... జస్టిస్ బేలా త్రివేదీ దానికి అంత ప్రాధాన్యం ఇవ్వలేదు. 2021కు ముందు స్కిల్ కేసులో అసలు దర్యాప్తు ప్రారంభం కానే కాలేదని జస్టిస్ బోస్ స్పష్టం చేశారు. "2018 జూన్ 5న దర్యాప్తు జరిపించమని విజయవాడలోని ఏసీబీ ఒక అభ్యర్థన చేసింది. ఆ తర్వాత మూడేళ్ల వరకూ ఎలాంటి దర్యాప్తు ప్రారంభమైన సంకేతాలు లేవు. 2021 ఫిబ్రవరి, మార్చి, జూన్, ఆగస్టులో పలు లేఖలు రాసినప్పటికీ దర్యాప్తు జరిగినట్లు ఆధారాలు చూపలేదు. అందువల్ల 2018 జూన్ 5 లేఖతో దర్యాప్తు జరిగినట్లు భావించలేం. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏను నిరాకరించేందుకు ఈ లేఖను సాకుగా చూపలేం. 2018 మే 14న జీఎస్టీ అధికారులు రాసిన లేఖను కూడా దర్యాప్తుగా భావించలేం. 2021 సెప్టెంబరు 9న దాఖలైన ఎఫ్ఐఆర్‌లో కూడా 2018 జూన్ 5వ తేదీ నాటి లేఖ గురించి ప్రస్తావన లేదు" అని జస్టిస్ బోస్ తన తీర్పులో వివరించారు. ఇంకా... విచారణ దశలోనే సెక్షన్ 17ఏ పోలీసు అధికారిపై ఆంక్షలు విధిస్తుందని, సంబంధిత అథారిటీ అనుమతి లేకుండా ఆ అధికారి ముందుకు కదలడానికి వీల్లేదని స్పష్టం చేశారు. చంద్రబాబు తన అధికార విధుల్లో భాగంగా నిర్ణయం తీసుకున్నారా, సిఫారసులు చేశారా అన్న విషయంలో సంబంధిత పోలీసు అధికారి ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన దాఖలాలు లభించలేదని ఆయన అన్నారు.

జస్టిస్ త్రివేదీ అలా...

అవినీతి నిరోధక చట్టం ప్రధాన లక్ష్యం పాలనలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంపొందించి అవినీతిని నిరోధించడమే అని జస్టిస్ బేలా త్రివేదీ అన్నారు. నిజాయితీపరులైన 'పబ్లిక్ సర్వెంట్స్' తాము అధికారంలో ఉన్నకాలంలో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించి దర్యాప్తు పేరుతో వేధించకుండా ఉండేందుకే సెక్షన్ 17ఏ ప్రవేశపెట్టారని ఆమె కూడా అభిప్రాయపడ్డారు. సెక్షన్ 17ఏ కొత్తగా వచ్చిందని, దాన్ని ప్రవేశపెట్టిన నాటి నుంచే అది అమలులోకి వస్తుందికాని మొత్తంగా పాత నేరాలకు కూడా వర్తింపజేయరాదన్నది తన అభిప్రాయమని తీర్పులో చెప్పారు. సెక్షన్ 17ఏ 2018 చట్టం తర్వాత జరిగిన నేరాలకే వర్తిస్తుందని, అంతకు ముందు జరిగిన నేరాలకు కాదని చెప్పారు. ముందస్తు అనుమతి లేనంత మాత్రాన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయలేమని ఆమె అన్నారు.

అభయహస్తం దరఖాస్తుల కంప్యూటరీకరణ పూర్తి

హైదరాబాద్ సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో భాగంగా స్వీకరించిన అభయహస్తం దరఖాస్తుల కంప్యూటరీకరణ పూర్తయినట్టు జీహెచ్ఎంసీ ప్రకటించింది. రేషన్‌కార్డు, ఇతర అంశాలకు సంబంధించిన దరఖాస్తుల డేటా ఎంట్రీ చేపట్టనున్నట్టు పేర్కొంది. ఉచిత విద్యుత్, మహిళలకు నెలకు రూ.2500, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత తదితర పథకాల కోసం 19.01 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. రేషన్‌కార్డులు, తదితర దరఖాస్తులు 5.73 లక్షలు వచ్చాయి.

పద్ధతి మార్చుకోవాలని చెబితే..
అక్రమ కేసులు పెట్టి వేధించేది

» అందుకే భార్య తల నరికేశా
» పోలీసుల ఎదుట వెల్లడించిన భర్త!



విజయ్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పద్ధతి మార్చుకోవాలని తన భార్యకు ఎంత చెప్పినా వినకపోయేదని, పైగా తననే వేధింపులకు గురిచేస్తూ14 ఏళ్లగా నరకం చూపిస్తోందని, ఆ బాధ భరించలేకనే భార్యను హత్య చేసినట్లు నిందితుడు విజయ్‌కుమార్ పోలీసుల ఎదుట చెప్పినట్లు తెలిసింది. నిందితున్ని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్ శివారు అబ్దుల్లాపూర్‌మెట్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో మంగళవారం భార్య తల నరికి హత్య చేసిన ఘటన వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించిన పోలీసులు.. పథకం ప్రకారమే భార్యను హత్య చేసినట్లు నిర్ధారించారు. నిందితుడు కేదాల విజయ్‌కుమార్ 2009లో పుష్పలతను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు పుట్టిన తర్వాత భార్యాభర్తల మధ్య గొడవలు మొదలైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇంట్లో చెప్పాపెట్టకుండా పుష్పవతి రెండుమూడు రోజులు బయటకువెళ్లి వచ్చేదని, ఎందుకిలా చేస్తున్నావని ప్రశ్నిస్తే.. ఎదురు మాట్లాడేదని, తన ఇష్టం ఉన్నట్లు చేస్తానని చెప్పేదని నిందితుడు వెల్లడించినట్లు సమాచారం. పద్ధతి మార్చుకోవాలని చెబితే వినకుండా తనపైనే గృహహింస కేసులు పెట్టి వేధించేదని, ఆ బాధలు భరించలేక పథకం ప్రకారమే భార్యను హత్య చేసినట్లు పోలీసుల ఎదుట నిందితుడు అంగీకరించినట్లు తెలిసింది.

చెంగిచెర్ల కబేలాను
అక్రమంగా అప్పగించారు!

» విచారణ కోరుతూ సీఎంకు సీపీఎం లేఖ

హైదరాబాద్,జనవరి17(ఆంధ్రజ్యోతి): ఎలాంటి టెండర్లు లేకుండా చెంగిచెర్ల కబేలాను ఐదున్నర ఏళ్లుగా బీఆర్ఎస్ నేతకు కట్టబెట్టడంపై విచారణ కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఎం పార్టీ లేఖ రాసింది. మేడ్చల్ జిల్లా చెంగిచెర్లలో సుమారు 70 ఎకరాల్లో ఆధునిక వసతులతో నిర్మించిన కబేలాను 2018లో తాత్కాలిక లీజు మీద వక్ఫ్‌బోర్డు మాజీ ఛైర్మన్, బీఆర్ఎస్ నేత సలీంకు అప్పగించారని , దీని వల్ల ప్రభుత్వానికి ఆర్థిక నష్టం వాటిల్లుతుందని సీపీఎం పార్టీ తరపున గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ లేఖలో ప్రస్తావించారు. ఇదే ఆరోపణలపై 2021లో విజిలెన్స్ విచారణ జరిపి సలీం అండ్ కంపెనీ ప్రభుత్వానికి రూ.10 కోట్ల బకాయిలు ఉన్నట్లు నివేదిక ఇచ్చిందని, కానీ గత ప్రభుత్వం స్పందించలేదని, మార్కెట్ ఫీజు రూపంలో ఏటా ప్రభుత్వానికి రావాల్సిన రూ.7 కోట్లు ఆ కంపెని చెల్లించడంలేదని విజిలెన్స్ చెప్పినా బీఆర్ఎస్ ప్రభుత్వం లీజు రద్దు చేయకుండా సలీం దోపిడీకి అండగా నిలిచిందని పేర్కొన్నారు. మాంసం వ్యాపారంలో గుత్తాధిపత్యం చేస్తున్న సలీం అండ్ కంపెనీ మీద ప్రభుత్వం విచారణ చేసి లీజు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కల్తీ కల్లు తాగి
ఇద్దరు కూలీల మృతి

గోదావరిఖనిలో ఘటన

కోల్‌సిటీ, జనవరి 17: పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో కల్తీ కల్లుకు ఇద్దరు కూలీలు బలయ్యారు. స్థానిక అడ్డగుంటపల్లిలోని కల్లు కాంపౌండ్‌లో కల్లు తాగి ఇంటికి నడుచుకుంటూ వెళుతూ కుప్పకూలిపోయారు. స్థానికులు వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే వారు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతులను హుజూరాబాద్‌కు చెందిన మావిడి రమేశ్ (50), కాగజ్‌నగర్‌కు చెందిన నాంపల్లి నవీన్ (22)గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ మెషీన్ కూలీలుగా పనిచేస్తున్నారు. పోలీసులు మృతదేహాలను మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పది రోజుల క్రితం మల్లికార్జున్ అనే కూలీ కూడా కల్తీ కల్లు తాగి డ్రైన్‌లో పడి మృతి చెందాడు. కల్తీ కల్లు నిర్మూలనకు అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హిందువుల ఓట్ల కోసమే రామ భజన

వి.హన్మంతరావు

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాముడు మీద భక్తి కన్నా హిందువుల ఓట్ల మీదనే బీజేపీకి ప్రేమ ఎక్కువని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి.హన్మంతరావు ఆరోపించారు. రాముడిని కూడా రాజకీయాల్లో లాగి ఓట్లు సంపాదించాలని బీజేపీ చూస్తోందని ఆయన విమర్శించారు. బుధవారం గాంధీ భవన్‌లో హన్మంతరావు విలేకరులతో మాట్లాడారు. అయోధ్యలో రాముని దర్శించుకోవడానికి అందరూ వెళతారని కాని తాను పిలిచినప్పుడే రావాలన్నట్లుగా ప్రధాని మోదీ వ్యవహారం ఉందని హన్మంతరావు విమర్శించారు. దేశంలో తాను అధికారంలోకి వచ్చాక 25 కోట్ల పేదలను ధనికులుగా చేశానని ప్రధాని మోదీ చెబుతుంటే నవ్వాలో, ఏడవాలో అర్థం కావడం లేదన్నారు. కార్పొరేట్ రంగానికే మోదీ సర్కార్ లాభం చేస్తోందని విమర్శించారు. రైతులకు మద్దతు ధర పెంచమని అని అడిగితే స్పందనలేదన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అయోవా హెచ్చరిక

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్‌పార్టీ అభ్యర్థిగా నిలవాలనుకున్న వివేక్ రామస్వామి పోటీనుంచి తప్పుకొన్నారు. అయోవా ప్రైమరీలో వివేక్‌కు పెద్ద ఎదురుదెబ్బతగలడంతో ఆయన యుద్ధరంగంనుంచి నిష్క్రమించి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. భారత సంతతికి చెందిన ఈ బయోటెక్ వ్యాపారి మూడునెలలకాలంలో రెండువందల మిలియన్ డాలర్లు వ్యాపారంలో నష్టపోయి, చివరకు రాజకీయంలోనూ నిలబడలేకపోయారని, ఇలా మెరిసి అలా మాయమైపోయారని అమెరికా పత్రిక ఒకటి ఓ వెటకారపు వ్యాఖ్యచేసింది. కానీ, న్యూహ్యాంప్‌షైర్ ప్రచారంలో తనతో వేదిక పంచుకున్న వివేక్‌ను ఉద్దేశించి డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు విన్న చాలామందికి వివేక్ రాజకీయభవిష్యత్తు ముగిసిపోలేదని అనిపించింది. వివేక్‌ను ట్రంప్ ప్రశంసలతో ముంచెత్తుతూ వేదికమీదకు ఆహ్వానించినప్పుడు కార్యకర్తలు వీపీ (వైస్‌ప్రెసిడెంట్) అంటూ నినాదాలు చేశారు. వివేక్ మాతోనే ఉంటారు, భవిష్యత్తులో సుదీర్ఘకాలం మాతో కలిసిసాగుతారు అన్న ట్రంప్ మాటల్లో తాను దేశాధ్యక్షుడు, వివేక్ ఉపాధ్యక్షుడు అన్న అర్థం రాజకీయ విశ్లేషకులకు కూడా గోచరించింది.

వివేక్ తన ప్రచారంలో ట్రంప్‌మీద పెద్దగా నోరుపారేసుకోలేదు. 21వ శతాబ్దపు గొప్ప అధ్యక్షుడుగా ఆయనను అభివర్ణించడంతో పాటు, ప్రచారంలో దాదాపుగా ఆయననే అనుకరించారు. ట్రంప్ నినాదాన్ని మరింత విస్తరించి అమెరికాను అగ్రస్థానంలో నిలబెట్టడం తనతోనే సాధ్యమని చెప్పుకున్నారు. తనది రాజకీయప్రచారం కాదని, భావితరాల కలలను సాకారం చేయడానికి ఉద్దేశించిన సాంస్కృతిక ఉద్యమం అన్నారాయన. చైనా, వలసల నియంత్రణ, స్థానిక ఉపాధి, అడ్డుగోడలు కట్టడం ఇత్యాది అనేకానేక అంశాల్లో ట్రంప్‌ను ఆవాహన చేసుకొని, ఆయననే అనుకరిస్తూ, మిగతా పోటీదారులను అవమానిస్తూ వివేక్ ప్రచారం సాగింది. రిపబ్లికన్ పార్టీలో ముందువరుసలో నిలవాలంటే అనుకరణ కంటే, ఇతరత్రా అంశాలు చాలా పనిచేస్తాయి. పుట్టుపూర్వోత్తరాలను దాటి మరింత నికార్సయిన అమెరికన్‌గా నిరూపించుకోవడానికి వివేక్ చేసిన ప్రయత్నం పెద్దగా ఫలించలేదు. భారత సంతతికి చెందిన నిక్కీహాలీ విషయంలో ప్రదర్శించిన కాఠిన్యం కూడా తగినంత గుర్తింపు తెచ్చినట్టు లేదు. వివేక్ అంత దూకుడుగా, వేగంగా ఎదిగిపోవడం తోటి రిపబ్లికన్ నేతలకే రుచించలేదనడానికి పాస్టర్లు చేసిన ప్రకటనలే నిదర్శనం. ఆ తరువాత ఎవ్వరు ఎన్ని ఖండనమండనలు చేసినా పార్టీలోని అత్యధికుల మనోభిప్రాయానికి అనుగుణంగానే వివేక్ మూలాలకూ, మతానికీ సంబంధించిన ప్రస్తావనలు ముందుకు వచ్చాయన్నది వాస్తవం. అయోవా ప్రైమరీకి రెండురోజుల ముందే వివేక్‌ను అవినీతిపరుడనీ, ఆర్థిక నేరగాడని, 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' లక్ష్యానికి ప్రమాదకారి అనీ ట్రంప్ అభివర్ణించారు. ఆ నినాదం లక్ష్యాలు, ఉద్దేశాలు ఏమిటో, అది ఎవరిని శత్రువులుగా చూపుతున్నదో అందరికీ తెలిసిందే కనుక, ట్రంప్ వ్యాఖ్యలో అంతర్లీనంగా ఉన్న సందేశాన్నే అయోవా ప్రైమరీ ప్రతిఫలించింది. ట్రంప్‌కూ తనకు మధ్య పోలికకంటే తేడాలే ఎక్కువన్న విషయం రామస్వామికి అర్థమై ఉంటుంది. ఇటీవలే, 'సేవ్ ట్రంప్, ఓట్ వివేక్' ప్రచారంతో ట్రంప్ ఆగ్రహానికి గురై, ఉపాధ్యక్షుడిగా వివేక్ పేరు ఆలోచనలోనే లేదని ట్రంప్ ప్రతినిధులు వెన్వెంటనే ప్రకటించిన తరువాత కూడా వివేక్ రేపు దేశ ఉపాధ్యక్షుడవుతారా?

అయోవాలో ట్రంప్ విజయం అమెరికాకు, ప్రజాస్వామ్యానికి ప్రమాద సంకేతంగా చాలామంది భయపడుతున్నారు. 88శాతం శ్వేతజాతీయులున్న అయోవా ఫలితాలు దేశమంతా ప్రతిఫలించవని మరికొందరు సర్దిచెప్పుకుంటున్నారు. ట్రంప్‌ను ఇక్కడ అడ్డుకుంటే తన భవిష్యత్తు బాగుంటుందన్న డిశాంటిస్ అంచనాలు కూడా తారుమారైనాయి. ట్రంప్ మీద ఉన్న కేసులు, నీలిచిత్రాల నటికి ఇచ్చిన ముడుపులు, తన మద్దతుదారులను రెచ్చగొట్టి కేపిటల్‌పై జరిపిన దాడులు, చట్టసభలో ఎదుర్కొన్న అభిశంసనలు ఇత్యాదివి రిపబ్లికన్ పార్టీ ఓటర్లను ప్రభావితం చేయలేదని ఈ ఎన్నిక చెబుతోంది. ప్రైమరీల్లో పోటీ చేయకుండా రెండు రాష్ట్రాల న్యాయస్థానాలు ట్రంప్‌ను అనర్హుడుగా ప్రకటించిన నేపథ్యంలో సుప్రీంకోర్టు ఏమి చెబుతుందన్నది అటుంచితే, ఆయన మీద పెట్టిన కేసులన్నీ బోగస్‌వేనని పార్టీ ఓటర్లు నమ్ముతున్నట్టుంది. రేపు మిగతా రాష్ట్రాల్లోనూ ఇదే ధోరణి కొనసాగుతుందా అన్నది అటుంచితే, ట్రంప్ ఆదరణ తగ్గలేదని చెబుతున్న అయోవా నిజంగానే ఒక ప్రమాద హెచ్చరిక.

అయోధ్య రాముడితో రాజకీయాలా?

'రామో విగ్రహవాన్ ధర్మః' అని వశిష్ఠ మహర్షి రాముడి గురించి ఒక్క వాక్యంలో చెప్పారు. ధర్మానికి ప్రతీక శ్రీరాముడు అని దాని అర్థం. అలాంటి ధర్మబద్ధుడైన రాముడి విషయంలోనే కొన్ని శక్తులు అధర్మంతో వ్యవహరించే ప్రయత్నం చేస్తున్నాయి. ఐదు వందల ఏళ్ల తర్వాత మర్యాద పురుషోత్తముడికి ఒక కోవెలను హిందువులు వారి స్వంత డబ్బులతో నిర్మించి ప్రారంభించుకుంటున్న తరుణంలో ఎక్కడ లేని రాజకీయాలు, శాస్త్రాల పేరుతో కొందరు అపప్రథను మూటగట్టుకుంటున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఏ రోజూ హిందుత్వం, హిందువుల గురించి ఆలోచించని కాంగ్రెస్, కమ్యూనిస్ట్, బీఆర్ఎస్ తదితర రాజకీయ పార్టీలు, కుహనా మేధావులు, కొందరు స్వామీజీలు సైతం ఈ రోజు రాముడి పేరుతో ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న ఆదరణను చూసి సహించలేకపోతున్నారు.

కాంగ్రెస్ తదితర విపక్షాలు చెబుతున్నట్లుగా నలుగురు శంకరాచార్యులు అయోధ్యలో రామ్ లల్లా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని వ్యతిరేకిస్తున్నారన్నది వాస్తవం కాదు. ద్వారకా, శృంగేరీ పీఠాధిపతులు తమపై వస్తున్న వార్తలను తీవ్రంగా ఖండించారు. దేశ ప్రజల ప్రతినిధిగా, దేశ ప్రధాని మోదీ అక్కడి అన్ని కార్యక్రమాలు నిర్వహించడానికి అన్ని విధాలా అర్హులని శృంగేరి పీఠాధిపతి భారతీ తీర్థ స్వామి మద్దతిచ్చారు. పూరీ శంకరాచార్యులు తాము తర్వాత వెళ్ళి రామ్ లల్లాను దర్శించుకుంటామన్నారు. ఇక మిగిలిన ఒక శంకరాచార్యులు అవిముక్తేశ్వరానంద సరస్వతి 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో టికెట్ నిరాకరించడంతో మోదీకి వ్యతిరేకంగా రామ రాజ్య పరిషత్ తరఫున పోటీచేసిన అభ్యర్థికి మద్దతిచ్చారు. వాస్తవాలు ఇలా ఉంటే కాంగ్రెస్, కమ్యూనిస్ట్ తదితర పక్షాలు బీజేపీ, వీహెచ్‌పీ, ఆరెస్సెస్‌లను నిందించడం ఎంతవరకు సమంజసం.



సోనియా గాంధీ క్రిస్టియన్ కాబట్టి అయోధ్య రామాలయ ప్రారంభోత్సవంలో పాల్గొనడంలేదనే వాస్తవం చెబితే సరిపోతుంది. కాని అది బీజేపీ, ఆరెస్సెస్ కార్యక్రమం అంటూ ఒక విమర్శ చేసి కాంగ్రెస్ పార్టీ ట్రస్ట్ ఆహ్వానాన్ని తిరస్కరించి, హాజరుకాబోవడంలేదని తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ నిర్ణయాన్ని ఆ పార్టీ నాయకులే తప్పుపడుతున్నారు.

వాస్తవానికి అయోధ్యలో రామాలయం నిర్మిస్తోంది బీజేపీ, వీహెచ్‌పీ, ఆరెస్సెస్‌లు కాదు. అయోధ్య రామజన్మభూమి ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నాయి కాబట్టి ఈ సంస్థలు దేవాలయ నిర్మాణానికి సహకరిస్తున్నాయి. ఒక ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్యలో రామాలయ నిర్మాణ ప్రక్రియ జరగాలన్న సుప్రీంకోర్టు సూచన మేరకు అయోధ్య శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఏర్పాటైంది. ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలోనే ఆలయ నిర్మాణం జరుగుతోంది. అందుకే ఆ ట్రస్ట్ స్వామీజీలకు, శంకరాచార్యులందరికీ, దేశంలోని వివిధ రంగాల ప్రముఖులకు, రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలకు చెందిన ప్రముఖ నాయకులకు గౌరవ పూర్వకంగా ఆహ్వానాలను అందించింది. ఇంత పెద్ద కార్యక్రమానికి ఒక ముఖ్య అతిథి ఉండాలనే ఉద్దేశంతో దశాబ్దాలుగా రామాలయ ఉద్యమానికి మద్దతిస్తున్న బీజేపీ అగ్రనాయకుడు, దేశ ప్రధాని నరేంద్ర మోదీని ఈ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించింది శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్ట్. దీనిని చిలువలు, పలువలు చేసి రాద్ధాంతం చేసి రాజకీయం చేయాలనుకుంటున్నట్లుంది రాజకీయ పార్టీల వ్యవహార శైలి.

సోనియా గాంధీ క్రిస్టియన్ కాబట్టి అయోధ్య రామాలయ ప్రారంభోత్సవంలో పాల్గొనడంలేదనే వాస్తవం చెబితే సరిపోతుంది. కాని అది బీజేపీ, ఆరెస్సెస్ కార్యక్రమం అంటూ ఒక విమర్శ చేసి కాంగ్రెస్ పార్టీ ట్రస్ట్ ఆహ్వానాన్ని తిరస్కరించి, హాజరుకాబోవడంలేదని తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ నిర్ణయాన్ని ఆ పార్టీ నాయకులే తప్పుపడుతున్నారు. రాముడు ప్రజలందరి దేవుడని, ఆరాధ్య దైవమని వారు పార్టీ అధినాయకత్వానికి స్పష్టం చేస్తున్నారు. పార్టీ బహిష్కరించినా తాము పాల్గొంటామని ఇప్పటికే గుజరాత్‌తోపాటు హిమాచల్ ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు. రామమందిరం, బాబ్రీ మసీదు వివాదంపై సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన ఇక్బాల్ అన్సారీ సైతం ఈ ఉత్సవానికి హాజరవుతుంటే కాంగ్రెస్ బహిష్కరించడం సమంజసం కాదని బీజేపీ తప్పు పడుతోంది.

ఆది నుంచి కాంగ్రెస్ పార్టీ హిందూ వ్యతిరేక పార్టీగా రుజువు చేసుకుంటూనే ఉంది. అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కూడా సోమనాథ్ దేవాలయ ప్రారంభోత్సవానికి హాజరు కాలేదు. కశ్మీర్‌కు 370 ఆర్టికల్‌తో ప్రత్యేక ప్రతిపత్తి కల్పించి ముస్లింల దాడులతో అక్కడి నుంచి హిందువులు పారిపోయేలాగా చేసింది కాంగ్రెస్ పార్టీ. దేశంలో హిందువులకు నష్టం కలిగేలాగా హిందూ వ్యతిరేక చట్టాలు, వక్ఫ్ చట్టం లాంటివి చేయడంతో కాంగ్రెస్ హిందూ వ్యతిరేక ధోరణి బహిర్గతమైంది. ఇక కమ్యూనిస్టులు, హేతువాదులు, కుహనా మేధావులు సైతం పక్కా సెక్యులర్ వాదులమంటూ హిందువులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుంటారు. ట్రస్ట్ ఆహ్వానాన్ని అందుకున్న కమ్యూనిస్టు నాయకుడు సీతారామ్ ఏచూరి మాట్లాడుతూ మతం వ్యక్తిగతం కాబట్టి హాజరు కాలేనని ప్రకటించడం శోచనీయం. కమ్యూనిస్ట్ ప్రభుత్వాలు అధికారికంగా ఇఫ్తార్ విందులిచ్చినపుడు, క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలకు హాజరైనప్పుడు మతం వ్యక్తిగతం అనే విషయం ఆయనకు ఎందుకు గుర్తుకు రాలేదన్నది ప్రశ్న. అలాగే తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఆ రాష్ట్రంలోని ముస్లింల ఓట్ల కోసమే రామాలయ ప్రారంభోత్సవ ఆహ్వానాన్ని వ్యతిరేకిస్తున్నారనే విషయం గ్రహించలేనంత అమాయకులా హిందువులు? ఇక రాష్ట్రంలోని బీఆర్ఎస్ పార్టీ రామాలయ ప్రారంభోత్సవం విషయంలో తమ వైఖరి ప్రకటించకుండా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ యాదాద్రి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా తాము అక్షింతలు పంచి ఉంటే గెలిచేవారమని మాట్లాడడం శోచనీయం. గతంలో బీఆర్ఎస్ అధినాయకుడు కేసీఆర్ హిందుగాళ్లు, బొందుగాళ్లు అని; రామ జన్మభూమి, రావణ జన్మభూమి, కృష్ణ జన్మభూమి అంటూ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ మాట్లాడిన విషయం అందరికీ గుర్తుంటుంది.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ రక్షణ రంగంలోనే కాకుండా ఆర్థిక, సామాజిక అంశాలపైనా, దేశ ప్రజలందరి అభివృద్ధి కోసం సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా ప్రయాస్ ధ్యేయంగా కృషి చేస్తోందన్న వాస్తవాన్ని గ్రహించకపోతే రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షాల అడ్రెస్ గల్లంతు కావడం ఖాయం.

○ శ్యామ్ సుందర్ వరయోగి

వల విసురుతున్న కృత్రిమమేధ

ఒక కొత్త యంత్రమో పరికరమో రంగ ప్రవేశం చేసినపుడు దాని మంచీ చెడుల గురించి సమాజంలో చర్చ జరగడం సహజం. ఇటీవల ప్రాచుర్యంలోనికి వచ్చిన కృత్రిమ మేధ – ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) మీద అలాంటి చర్చ ఒకటి ప్రపంచవ్యాప్తంగా సాగుతోంది. తాము సేకరించి ప్రచురించిన సమాచార భాండాగారాన్ని 'చాట్ జీపిటి' తదితర ఏఐ వేదికల ప్రమోటర్లయిన ఓపెన్ ఏఐ, మైక్రోసాఫ్ట్ సంస్థలు తమ అనుమతి లేకుండా వినియోగించుకుంటున్నాయని విఖ్యాత మీడియా సంస్థ 'న్యూయార్క్ టైమ్స్' ఆరోపించింది. నష్టపరిహారంగా ఆ సంస్థలు తమకు భారీ మూల్యం చెల్లించాలని ఆ పత్రిక కోర్టులో దావా వేసింది. 'న్యూయార్క్ టైమ్స్' కేసు సాంకేతిక అభివృద్ధికి సంబంధించి అనేక పాత అంశాలతోపాటు కొన్ని కొత్త అంశాలనూ చర్చా వేదిక మీదికి తెచ్చింది.



మనిషి మెదడు పని విధానంలో అతని సామాజిక ఉనికి పాత్ర గురించి తెలిసిపోయాక మనుషుల ఆలోచనల్ని నియంత్రించడం సాధ్యం కావచ్చు. కృత్రిమ మేధ 'చైతన్యం'లో కార్పొరేట్ల ప్రయోజనాల్ని ఇమిడ్చే ప్రమాదం వుంది. అంటే కృత్రిమ మేధ తనను సృష్టించిన వారికి అనుగుణంగా యూజర్స్‌ను వశీకరణం చేసే అవకాశం ఉంది.

ఏది మేధో సంపత్తి హక్కు అవుతుంది, ఏది కాదు? అనేవి చట్టానికీ, ఆర్థిక రంగానికీ సంబంధించిన అంశాలు. 1995లో ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO) ఏర్పడినప్పుడు వాణిజ్య సంబంధిత మేధో సంపత్తి హక్కుల మీద (ట్రిప్స్) సుదీర్ఘ చర్చ జరిగింది. ఆ చట్టాలే ఇప్పుడు అమల్లో వున్నాయి. అవే కృత్రిమ మేధకు కూడ వర్తిస్తాయి.

కృత్రిమ మేధ చాలా పనులు చేస్తుంది. మనం రోజుల కొద్దీ కసరత్తు చేసే పనుల్ని సెకన్లలో చేసి పడేస్తుంది. అదీ ఇదని కాదు ఏదైనా చేసేస్తుంది. మన గర్ల్ ఫ్రెండ్ పెయింటింగ్‌ని లియోనార్డో డావిన్సీ 'మోనాలిసా' పెయింటింగ్‌లా వేయమంటే వేసేస్తుంది. కాన్సెప్ట్, పాత్రలు, సన్నివేశాలూ ఇచ్చి ఒక స్క్రిప్టు రాయమంటే రాసేస్తుంది. ఎస్.ఎస్. రాజమౌళి, స్పీల్‌బర్గ్ పాటించే చిత్రంలో రాయమన్నా రాసేస్తుంది. బాయ్‌ఫ్రెండ్‌గా, గర్ల్‌ఫ్రెండ్‌గా ఎలా ఉండమన్నా అలా ఉంటుంది. కావాలంటే సెక్స్ కూడ చేస్తుంది. నమ్మకం కుదరకపోతే 2013 నాటి స్పైక్ జోన్స్ సినిమా 'హర్' చూడండి.

అయితే, కృత్రిమ మేధ కొన్ని పనులు చేయదు. లియోనార్డో డావిన్సీ 'మోనాలిసా' పెయింటింగ్‌ను యథాతథంగా నకలు చేసేయమంటే చేయదు. 1963 నవంబరు 22న అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్. కెన్నడీ హత్యకు గురైన సందర్భంలో న్యూయార్క్ టైమ్స్ రిపోర్టును చూపించు అని అడిగితే చాట్ జీపిటి చూపదు. అలా చేయడం చట్ట విరుద్ధం అని కూడా యూజర్‌ను హెచ్చరిస్తుంది. అంతగా మీకు కావాలంటే ఆ రిపోర్టు సారాంశాన్ని చెపుతానంటుంది. ఏ నవల గురించి అడిగినా వెంటనే సారాంశాన్ని చెప్పేస్తుంది. అంతేగానీ, ఆ నవల కాపీ కావాలంటే ఇవ్వదు. అంచేత ఏఐని చట్టపరంగా తప్పు పట్టాల్సింది ఇక్కడ కాదు. దాన్ని ఎక్కడ తప్పు పట్టాలో ఇప్పుడు చూద్దాం. దానికన్నా ముందు మనిషికీ యంత్రాలకూ ఉన్న అనుబంధాన్ని ఓసారి గుర్తుకు తెచ్చుకుందాం.

సృష్టిలో ప్రతి జీవి తన సంతతిని సృష్టిస్తుంది. తన సంతతి మనుగడ కోసం ఆహారాన్ని సేకరించి పెడుతుంది. మనిషి అంతటితో ఊరుకోడు; సహజసిద్ధంగా ఆహారం దొరక్కపోతే తన సంతతి జీవికను కాపాడడానికి తనే ఆహారాన్ని ఉత్పత్తి చేస్తాడు. దాని కోసం అనేక పనిముట్లను పరికరాల్ని సృష్టిస్తాడు. 'మన అవసరమే సిసలైన సృష్టికర్త' అన్నాడు గ్రీకు తత్వవేత్త ప్లేటో క్రీస్తు పూర్వం నాలుగవ శతాబ్దంలో. 'అవసరమే ఆవిష్కరణలకు తల్లి'గా ఈ మాట స్థిరపడిపోయింది. 18వ శతాబ్దపు స్కాటిష్ ఆర్థిక శాస్త్రవేత్త ఆడమ్ స్మిత్ ఇంకో అడుగు ముందుకేసి 'పనిముట్లు తయారు చేసే జీవి మనిషి' అన్నాడు.

కొత్త యంత్రాలు ప్రవేశించినపుడు ఆయా వృత్తుల్లో సాంప్రదాయికంగా ఉంటున్నవారికి తప్పక ఇబ్బంది కలుగుతుంది. గ్రామాల్లోనికి ట్రాక్టర్లతోపాటు దున్నడానికీ, ఊడ్పులు – పంటకోతలకు మెషీన్లు ప్రవేశించినపుడు రైతు కూలీలు ఉపాధిని కోల్పోతారు. ఆ సమయంలో వారికి భవిష్యత్తు అంధకారంగా కనిపిస్తుంది. దానికి పరిష్కారం ట్రాక్టర్లను, ఆధునిక వ్యవసాయ యంత్రాలను అడ్డుకోవడం కాదు. పాత ఉపాధిని కోల్పోతున్నవారికి కొత్త ఉపాధుల్లో ఉచిత శిక్షణ ఇవ్వాలి. లేకుంటే, పునరావాసం కల్పించాలి. అయితే, ఇదంతా తాత్కాలికమే. క్రమంగా కొత్త టెక్నాలజీలో కొత్త ఉపాధి కలుగుతుంది. కంప్యూటర్లను ప్రవేశపెడుతున్న కొత్తలో 'ఆఫీసుల యాంత్రీకరణ నశించాలి' అంటూ ఉద్యోగులు నినాదాలు చేసేవారు. ఇప్పుడు ఆఫీసుల్లోనే కాదు ఇంట్లోనూ కంప్యూటర్లు వచ్చేశాయి. పిల్లల్ని బుజ్జగించడానికి చేతిలో ట్యాబ్‌లు పెడుతున్నారు. ఇటీవలి కాలంలో ఐటీ రంగంలోనే ఉపాధి అవకాశాలు ఎక్కువగా పెరిగాయి. ఐటీ అంటే సాఫ్ట్‌వేర్ విభాగం ఒక్కటే కాదు సెల్‌ఫోన్ రిపేరు కూడ అందులో భాగమే. ఈ పరిణామాల్ని మనం 1980ల ఆరంభంలో ఊహించలేదు. మళ్ళీ ఇప్పుడు కృత్రిమ మేధను చూసి అదే రకం భయం! ఏఐతో మానజాతి అంతరించిపోతుందనే వరకు తీవ్ర ఆందోళనను వ్యక్తం చేస్తున్నవారూ ఉన్నారు. అంతగా భయపడాల్సిన అవసరంలేదు. కొంతకాలం కొన్ని నిర్మాణపరమైన సర్దుబాట్లు వుంటాయి. అంతే.

కార్పొరేట్లు నిరంతరం తమ యంత్రాలను ఆధునీకరించుకుంటూ, ఉత్పత్తిని పెంచుకుంటూ, మార్కెట్‌ను విస్తరించుకుంటూ, ఫ్యాక్టరీలో తయారైన సరుకును ఎప్పటికప్పుడు అమ్ముకుంటూ వుండాలి. అమ్మలేకపోతే, కార్పొరేట్లకు లాభాలు రాకపోగా పెట్టిన పెట్టుబడి కూడ తిరిగిరాదు. ఉత్పత్తిని అమ్మితీరాలనే నియమం వుంది కనుక పెద్ద సంఖ్యలో కొనుగోలుదారుల్ని, విస్తారమైన మార్కెట్‌ను కూడ కార్పొరేట్లే సృష్టించుకుంటూ వుంటారు. అప్పటి వరకు మానవ మనుగడకు ముప్పు వుండదు.

మనకున్న జ్ఞానం మొత్తంగా మనది కాదని మనకు చాలా స్పష్టంగా తెలుసు. అనేక మూలాల నుంచి మన మెదడులోనికి ముడి సమాచారం కుప్పలు తెప్పలుగా వచ్చి చేరుతుంటుంది. దాన్ని మన మెదడు రసాయన ప్రక్రియ ద్వారా వడగట్టి ఒక అవగాహనగా మార్చుతుంటుంది. అప్పటి నుంచి అది మన జ్ఞానంగా చెలామణీ అయిపోతుంటుంది. ఇది శరీరధర్మం. సరిగ్గా ఈ ప్రక్రియకు నకలుగానే ఆధునిక కంప్యూటర్లు ఆవిర్భవించాయి.

కంప్యూటర్లు ముడి సమాచారాన్ని ప్రాసెస్ చేసి సంస్కరించి సమాచారంగా మారుస్తాయి. ఇక్కడ సమాచారం అంటే సంస్కరింపబడిన, సూక్ష్మీకరింపబడిన ముడి సమాచారంగా భావించాలి. సమాచారమే దాని అంతిమ ఉత్పత్తి కనుక దాన్ని సమాచార సాంకేతికత అంటాం. చాలామంది టెకీలకు కూడ కంప్యూటర్ టెక్నాలజీని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) అని ఎందుకు అంటారో తెలీదు.

అయితే ఇక్కడో కీలకమైన ప్రక్రియ ఒకటి జరుగుతుంటుంది. బయటి నుండి వచ్చిన ముడి సమాచారాన్ని మెదడు ఒక అవగాహనగా మార్చే సమయంలో ఆ మనిషి సామాజిక ఉనికి కీలక పాత్ర పోషిస్తుంది. 'మనుషుల ఉనికిని నిర్ణయించేది వారి చైతన్యం కాదు; తద్విరుద్ధంగా, మనుషుల సామాజిక ఉనికి వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది' అన్నాడు కార్ల్ మార్క్స్ ("It is not the consciousness of men that determines their being, but, on the contrary, their social being that determines their consciousness"). సామాజిక ఉనికి చైతన్యాన్ని మార్చడానికి కృత్రిమ మేధను ఉపయోగిస్తారనేది ఒక అనుమానం. అలా చేయడం ఆచరణ సాధ్యమేనా అనేది అసలు ప్రశ్న.

గోరింటాకులో చర్మానికి ఎరుపు రంగును పూసే నిర్దిష్ట రసాయనాన్ని కనుక్కోగలిగితే దాన్ని ప్రయోగశాలల్లో కృత్రిమంగా సృష్టించవచ్చు. అప్పుడు గోరింటాకు పెట్టుకోకుండానే చర్మానికి ఎరుపు రంగు పూయవచ్చు. సృష్టికి ప్రతి సృష్టి అలాగే జరుగుతుంది. మనిషి మెదడు పని విధానంలో అతని సామాజిక ఉనికి పాత్ర గురించి తెలిసిపోయాక మనుషుల ఆలోచనల్ని నియంత్రించడం సాధ్యం కావచ్చు. కృత్రిమ మేధ 'చైతన్యం'లో కార్పొరేట్ల ప్రయోజనాల్ని ఇమిడ్చే ప్రమాదం వుంది. అంటే కృత్రిమ మేధ తనను సృష్టించిన వారికి అనుగుణంగా యూజర్స్‌ను వశీకరణం చేసే అవకాశం ఉంది.

పాలస్తీనా–ఇజ్రాయిల్ యుద్ధంలో రెండు పరస్పర విరుద్ధ అభిప్రాయాలు ఉనికిలో వున్నట్టు మనకు తెలుసు. మొదటిది, పాలస్తీనా పక్షం. రెండోది; ఇజ్రాయిల్ పక్షం. కృత్రిమ మేధ సాఫ్ట్‌వేర్ ఉత్పత్తిదారులు ఇజ్రాయిల్ అభిమానులయితే అది ఆ అభిప్రాయాలనే యూజర్స్ మెదడుల్లో జొప్పిస్తుంది. అప్పుడు కృత్రిమ మేధ అభిప్రాయాల్ని కూడా శంకించక తప్పదు. ఒక ప్రాయోజిత కార్యక్రమంగా లక్ష్య వ్యక్తి (Target Person) ఉపచేతన లోనికి చొరబడి మూలవ్యక్తి (Sponsor) ఆలోచనల్ని జొప్పించే ప్రక్రియను క్రిష్టోఫర్ నోలాన్ 2010 నాటి సైన్స్ ఫిక్షన్ సినిమా 'ఇన్సెప్షన్'లో మనం చూస్తాము. ఇప్పుడు నిజజీవితంలోనూ కృత్రిమ మేధ అలా చేస్తుంది. అంటే మనుషుల్ని హిప్నటైజ్ చేస్తుంది. అదీ అసలు ప్రమాదం.

• డానీ
సమాజ విశ్లేషకులు

రాజకీయం చేస్తున్నదెవరు?

'రామో విగ్రహవాన్ ధర్మః', ధర్మం మానవ రూపం దాల్చితే ఎలా ఉంటుందో రాముడలా ఉంటాడని నమ్ముతాం. రాముడిని కేవలం భారతీయులు కాకుండా దక్షిణ ఆసియా దేశాలన్నీ కొలుస్తాయి. బౌద్ధ, ఇస్లామిక్ దేశాలు కూడా నమ్మటం విశేషం. మలేసియా, ఇండోనేసియా లాంటి ముస్లిం దేశాలలో రాముణ్ణి కొలుస్తారు.

మన దేశంలో శ్రీరాముడిని కొలవని వారు ఉండరు. రాముడి జన్మస్థలం మీద కొన్ని వందల సంవత్సరాలుగా వివాదం నడుస్తున్నది. 1985లో రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మసీదు తాళాలు తెరిపించి, ప్రజలకు దర్శనం కల్పించారు. 1989లో చెన్నై జరిగిన విలేఖరుల సమావేశంలో రామాలయం నిర్మిస్తామని, అది అయోధ్యలోనేనని స్పష్టంగా చెప్పారు. ఈ విషయం పరాశరన్‌కి, సుబ్రహ్మణ్యస్వామికి తెలుసు. దురదృష్టవశాత్తు ఆ రాత్రి రాజీవ్ గాంధీ మరణించడం, తరువాత అద్వానీ రథయాత్ర, బాబ్రీ మసీదు కూల్చివేత వల్ల సామరస్యంగా పరిష్కారం కావలసిన వివాదానికి ఇన్ని రోజులు పట్టింది. ఇప్పుడు అయోధ్యలో ఆలయ నిర్మాణం జరుగుతుండడం, రామ్‌లల్లా ప్రతిష్ఠ జరగబోవటం అందరికీ ఎంతో సంతోషం కలిగించింది. శంకర భగవత్పాదులు ప్రతిపాదించిన రామ పంచాయతనం పద్ధతిలో సూర్య శివ, గణపతి, అమ్మవార్ల దేవాలయాలతో నిర్మించడం ఇంకా ఆనందం కలుగుతున్నది. ఇంతటి ఆనందకర సన్నివేశంలో జరుగుతున్న కొన్ని పరిణామాలు మాత్రం బాధ కలిగిస్తున్నాయి.

పూరీ పీఠాధిపతి వారు చెప్పిన విషయాన్ని అర్థం చేసుకోకుండా బీజేపీ సోషల్ మీడియా వారు చేసే కామెంట్లు వింటుంటే వారిని ఆరాధించే వారికి ఎంతో దుఃఖం కలుగుతున్నది. మాకు రాముడెంత ఇష్టమో శంకర పీఠాధిపతులన్నా అంతే గౌరవం. ఏ రాజకీయ నాయకుడూ కూడా తిట్టే వారిని ఆపే ప్రయత్నం చేయకపోవడం ఇంకా విషాదం. కాంగ్రెస్ పార్టీ నాయకులెవరూ రావటం లేదంటూ పేరు పేరునా తిడుతూ, వారు హిందూ వ్యతిరేకమంటూ ప్రచారం చేస్తున్నారు. అయోధ్య అక్షింతల రూపంలో రాజకీయం చేస్తున్నదెవరు? అయోధ్యలో ఇంకా గుడి నిర్మాణం పూర్తి కాలేదు, రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠ ఇంకా జరుగలేదు. పూజలు మొదలు కాని అయోధ్య గుడి నుంచి పూజ అక్షింతలు ఎలా వచ్చాయి? దేశమంతా పంచాలంటే ఎన్ని లారీలు కావాలి? ప్రజల అమాయకపు భక్తిని ఇలా అయోధ్య అక్షింతల పేరుతో మోసం చేయడం రాజకీయం కాదా? ఈ రాజకీయ ఎత్తుగడలను చూసిన పార్టీలు మేము ప్రతిష్ఠకు రాము అంటే హిందూ వ్యతిరేక ముద్ర వేస్తారా?

రామజన్మభూమి ట్రస్ట్ వారు పిలిచారు, కొన్ని రాజకీయ పార్టీలు రాము అని చెప్పాయి. అది వారి మధ్య విషయం. దీని మీద స్పందించటానికి నడ్డా ఎవరు? ఇది రాజకీయం కాదా? కేవలం అయోధ్య అక్షింతల పేరుతో ఎన్నికలలో గెలుద్దామని అనుకుంటే ప్రజలు అమాయకులు కారు. 91 ఏళ్ళ దేవెగౌడ ఇప్పుడు రావచ్చట కానీ అద్వానీని, మురళీ మనోహర్ జోషీని తరువాత రమ్మనడం, ప్రజల కోపాన్ని చూసి ఇదేమీ లేదనటం ప్రజలు చూస్తూనే ఉన్నారు. ఇది రాజకీయం కాదా? బీజేపీ ఇప్పటికైనా ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టే రాజకీయాలు మానుకోవాలి, వారిని ఓటర్లుగా చూడటం మానుకోవాలి. అయోధ్యలో రామమందిర నిర్మాణం, రామ్‌లల్లా ప్రతిష్ఠ మత రహితంగా భారతీయులందరకూ సంతోషకరం.

– జమలాపురపు శ్రీనివాస్

అభివృద్ధి నమూనా పర్యావరణ హితమై ఉండాలి!

తెలంగాణ రాష్ట్ర కొత్త ప్రభుత్వ కొద్దిరోజుల పాలనలో కొన్ని సానుకూల అంశాలు ఉన్నాయి. ముఖ్యంగా గత ప్రభుత్వ నిరంకుశ పాలనకు చిహ్నంగా ఉన్న ముళ్ళ కంచెలు తొలిగాయి. ప్రగతి భవన్ 'ప్రజావాణి'లో ప్రజలు తమ గొంతు వినిపిస్తున్నారు. 'మహాలక్ష్మి' పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఉద్యోగులకు మొదటి వారంలోనే జీతాలు అందాయి. 'ప్రజా పాలన' పేరుతో అధికారులు ప్రజల ముంగిట్లోకి వచ్చారు. రాష్ట్ర ఆర్థిక, విద్యుత్ రంగాలపై ప్రభుత్వం ప్రజల ముందు శ్వేత పత్రాలు పెట్టింది. ఆయా అంశాలపై ప్రజలకు కొంత అవగాహన ఏర్పడడానికి, గత ప్రభుత్వ పాలనా వైఫల్యాలను అర్థం చేసుకోవడానికి ఈ పత్రాలు తోడ్పడ్డాయి. ఇవన్నీ ప్రజలకు ఊరటనిచ్చే అంశాలే.


వీటితో పాటు, ముఖ్యమంత్రికి ఉండే బిజీ షెడ్యూల్ రీత్యా, ఇతర రంగాల లాగే, విద్యా శాఖకు కూడా ప్రత్యేక మంత్రిని నియమిస్తే ఆ రంగానికి సంబంధించి చర్చలు, పనులు వేగంగా ముందుకు వెళ్ళే అవకాశం ఉండేది. మానిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా, వ్యవసాయ రంగానికి చట్టబద్ధ అధికారాలతో కమిషన్‌ను నియమిస్తే ఆ రంగానికి సంబంధించి కూడా చర్చలు, కార్యాచరణ మొదలయ్యేవి. అత్యంత అవినీతికి, తప్పుడు నిర్ణయాలకు కేంద్రంగా ఉండిన నీటి పారుదల రంగంపై ఇంకా శ్వేత పత్రం వెలువడాల్సి ఉంది. ఆ పత్రం కూడా అనేక కొత్త విషయాలను బయట పెట్టే అవకాశం ఉంది. ఈ శ్వేత పత్రాన్ని కూడా వెంటనే వెలువరించడంతో పాటు, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై, అవినీతిపై వేగంగా న్యాయ విచారణ పూర్తి చేయించాలి. తప్పులకు బాధ్యుల నుంచి నష్టపరిహారం రాబట్టాలి. తగిన శిక్షపడే వరకూ విచారణ కొనసాగించాలి.

గత రెండు మూడేళ్లుగా, కాళేశ్వరం ప్రాజెక్టు కారణంగా ముంపునకు గురైన రైతులకు నష్టపరిహారం అందించడానికి కూడా ఈ ప్రభుత్వం సిద్ధం కావాలి. ఈ ప్రాజెక్టు కోసం భూ సేకరణ వల్ల నష్టపోయిన రైతులకు అవకాశం ఉన్న చోట వారి భూములను వారికి తిరిగి వెనక్కు ఇచ్చేయాలి. ముఖ్యంగా అందరూ వ్యతిరేకిస్తున్నా, 50 టీఎంసీల సామర్థ్యంతో కట్టిన మల్లన్నసాగర్ రిజర్వాయర్ పరిధిలో ఈ విషయం పరిశీలించాలి. గ్రామాలను, రైతుల పొలాలను ముంచి కట్టిన ఈ ప్రాజెక్టు పరిధిలో బహుళ జాతి కోకో కోలా కంపెనీ ఏర్పాటుకు గత ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలి. దశాబ్దాలుగా పనిచేస్తున్న విజయ, ములుకనూరు, నార్మూరు, కరీంనగర్ లాంటి స్థానిక పాల రైతుల సహకార సంఘాల ఉనికికి చేటు తెచ్చేలా గత ప్రభుత్వం గుజరాత్ అమూల్ కంపెనీ ఏర్పాటుకు ఈ ప్రాజెక్టు పరిధిలో ఇచ్చిన అనుమతిని కూడా రద్దు చేయాలి.

ఫార్మా సిటీని రద్దు చేస్తూ చేసిన ప్రకటన సిరా తడి ఆరకముందే, వెయ్యి నుంచి మూడు వేల ఎకరాల విస్తీర్ణంలో అనేక చోట్ల ఫార్మా విలేజెస్‌ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం ఆందోళన కలిగించే విషయం. ఫార్మా పరిశ్రమే కాలుష్యభరితమైనది. కాలుష్యం ఉండని ఫార్మా అంటూ ఉండదు. ఈ కారణం చేతనే అమెరికా, యూరప్ లాంటి ధనిక దేశాలు ఈ పరిశ్రమలను తమ భూ భాగం నుంచీ తరిమేస్తున్నాయి. పైగా స్థానిక వైద్య అవసరాలకు కాకుండా, అంతర్జాతీయ ఎగుమతి కోసం చేసే ఇలాంటి మందుల పరిశ్రమలను మన రాష్ట్ర గ్రామాల మధ్యలో నెలకొల్పి కాలుష్యాన్ని విస్తరించడం సరైంది కాదు.

రాష్ట్ర హైకోర్టు భవనానికి 100 ఎకరాల స్థలాన్ని కేటాయించే నిర్ణయం కూడా ఆక్షేపణీయమే. ఎత్తయిన భవంతులు నిర్మించే అవకాశం ఉన్న రోజుల్లో సరైన భూమి వినియోగ విధానం లేకుండా ఒక్కో సంస్థకు వందల ఎకరాలు కేటాయించడం సరైంది కాదు. పైగా ఇందుకోసం వ్యవసాయ విశ్వ విద్యాలయంలోని బయో డైవర్సిటీ బ్లాక్ నుంచి భూమిని కేటాయిస్తున్నారనే వార్తలు వచ్చాయి. ఇదే నిజమైతే ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి.

గత ప్రభుత్వ పారిశ్రామికీకరణ విధానంలో సాగకుండా ప్రస్తుత ప్రభుత్వం కొత్త అడుగులు వేయాలి. పరిశ్రమల కోసం భూ సేకరణ నుంచి, కాలుష్యం సృష్టించని పరిశ్రమలకు మాత్రమే అనుమతి ఇవ్వడం వరకూ అత్యంత పారదర్శకంగా ప్రజలను భాగస్వాములను చేస్తూ ముందుకు సాగాలి. స్థానికులకు ఉపాధి అవకాశాలు, స్థానిక ఉత్పత్తిదారులకు లాభదాయకత, పారిశ్రామిక కార్మికులకు చట్టబద్ధ హక్కుల అమలు లక్ష్యంగా 'టిఎస్ ఐపాస్' చట్టంలో అవసరమైన మార్పులు చేయాలి.



ప్రభుత్వం ఆలోచిస్తున్న రాష్ట్ర కొత్త అభివృద్ధి నమూనాలో అర్బన్ (ఔటర్ రింగ్ రోడ్డు లోపు), సెమీ అర్బన్ (రీజనల్ రింగ్ రోడ్డు లోపు), రూరల్ (రీజనల్ రింగ్ రోడ్డు నుండీ రాష్ట్ర సరిహద్దులోపు) క్లస్టర్స్‌గా విభజించి పారిశ్రామికీకరణ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి నమూనాలో వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలకు తగిన స్థానం ఉండాలి. కానీ ఈ కొత్త అభివృద్ధి నమూనా రూపొందించే ముందు లోతైన చర్చ జరగాలి. పారిశ్రామికీకరణ పేరుతో ఆయా జిల్లాలు, మండలాలు, గ్రామాలలో గత 50 ఏళ్లుగా జరిగిన భూ కేటాయింపులు, పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి కల్పనపై ప్రభుత్వం స్పష్టమైన శ్వేత పత్రం ప్రకటించాలి.

వివిధ జిల్లాలలో ఆయా పారిశ్రామిక వాడలకు గతంలో కేటాయించిన భూములను పూర్తి స్థాయిలో వినియోగించుకోకుండా కొత్త భూ సేకరణకు ఎట్టి పరిస్థితుల్లో నోటిఫికేషన్‌లు ఇవ్వకూడదు. ఆయా ప్రాంతాలలో ఏర్పాటయ్యే పరిశ్రమలు కాలుష్యం వెదజల్లకుండా చూడడం, ఈ సంస్థలు స్థానిక యువతీ యువకులకే 80శాతం ఉద్యోగాలు, ఉపాధి కల్పించేలా నిబంధనలు పెట్టడం, ఆయా పరిశ్రమలు, సంస్థలు నియమించుకునే కార్మికులకు, ఉద్యోగులకు కనీస వేతనాలు సహా, ఇతర చట్టబద్ధ హక్కులు అందించేలా చూడడానికి, కార్మిక శాఖను బలోపేతం చేయడం అవసరం.

ఈ ముందస్తు హెచ్చరిక ఎందుకంటే, కేంద్రం తీసుకు వచ్చిన ఇథనాల్ 20 పాలసీ ప్రకారం రాష్ట్రంలో ఇప్పటికే 15 ఇథనాల్ పరిశ్రమలకు అనుమతులు ఇచ్చారు. నారాయణ పేట జిల్లా, మరికల్ మండలం చిత్తనూరులో ఏర్పాటయిన ఇథనాల్ పరిశ్రమ ఉత్పత్తిని ప్రారంభించి అత్యంత కాలుష్యాన్ని వెదజల్లుతున్నది. ఈ పరిశ్రమకు వ్యతిరేకంగా ఉద్యమించిన ప్రజలపై గత ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టి వేధించింది. తాజాగా నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఏర్పాటవుతున్న ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా పోరాడుతున్న స్థానిక ప్రజలపై ఇప్పటి ప్రభుత్వం కూడా 60 మందిపై కేసులు పెట్టింది. చిత్తనూర్, దిలావర్‌పూర్ ప్రజలపై ఈ కేసులను ఎత్తేయడంతో పాటు, స్థానిక ప్రజల అభ్యంతరాలను దృష్టిలో ఉంచుకుని ఆయా జిల్లాలలో ఇథనాల్ పరిశ్రమలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలి.


నిజాం షుగర్స్ కంపెనీని పునరుద్ధరించడానికి చర్చలు ప్రారంభించడంతో పాటు, పత్తి, మొక్కజొన్న, సోయా, చిరు ధాన్యాలు, నూనె గింజలు, పప్పు ధాన్యాలు, పాలు, మాంసం లాంటి వ్యవసాయ ఉత్పత్తుల ఆధారిత ప్రాసెసింగ్ పరిశ్రమలను స్థానిక రైతు సహకార సంఘాల ఆధ్వర్యంలో నెలకొల్పడానికి ప్రయత్నాలు ప్రారంభిస్తే, కాలుష్యం లేని పరిశ్రమలు అందుబాటులోకి వచ్చి స్థానిక యువతకు, ఉపాధి కల్పిస్తాయి.

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వ పారిశ్రామికీకరణ విధానంలోనే ముందుకు సాగకుండా కొత్త అడుగులు వేయాలి. పరిశ్రమల కోసం భూ సేకరణ నుంచీ, కాలుష్యం సృష్టించని పరిశ్రమలకు మాత్రమే అనుమతి ఇవ్వడం వరకూ మొత్తంగా అత్యంత పారదర్శకంగా ప్రజలను భాగస్వాములను చేస్తూ ముందుకు వెళ్ళాలి. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, కాలుష్య రహిత పరిశ్రమలు, స్థానిక ముడి సరుకుల ఉత్పత్తిదారులకు లాభదాయకత, పారిశ్రామిక కార్మికులకు చట్టబద్ధ హక్కుల అమలు, లక్ష్యంగా పెట్టుకుని 'టిఎస్ ఐపాస్' చట్టంలో అవసరమైన మార్పులు చేయాలి. సేవా రంగంలో వచ్చే పరిశ్రమలలో కూడా స్థానిక యువత ఉపాధి అవకాశాలు పొందేలా అవసరమైన శిక్షణలు అందించడం వేగంగా జరగాలి.

రాష్ట్రం ఏర్పడి పదేళ్ళు గడుస్తున్నా సమగ్ర వ్యవసాయ విధానం రూపొందించకపోగా, గత ప్రభుత్వ నిర్వాకం వల్ల, రెండేళ్లుగా వ్యవసాయ శాఖ కనీసం సంవత్సర ప్రణాళిక కూడా తయారు చేసి ప్రకటించలేని దుస్థితిలో ఉంది. అందువల్ల నూటికి 60 మందికి జీవనోపాధి కల్పించే వ్యవసాయ రంగం కోసం సమగ్ర విధాన రూపకల్పన చేయడంపై ప్రభుత్వం ముందుగా దృష్టి సారించాలి. ప్రతి సర్వే నంబర్‌లో వాస్తవ సాగుదారుల గుర్తింపు కోసం ప్రతి సంవత్సరం జమాబందీ, రాష్ట్ర అవసరాలకు అనుగుణమైన పంటల ప్రణాళిక, గ్రామీణ ప్రాంతంలో మౌలిక సదుపాయాల నిర్మాణం కోసం పెట్టుబడులు, రైతులకు న్యాయమైన ధరలు అందేలా పంటల కొనుగోలు విధానం, ప్రకృతి వైపరీత్యాల నుండీ రైతులు తట్టుకునేలా పంటల బీమా పథకం, వ్యవసాయ విద్య పరిశోధనా సంస్థలకు జీవం పోయడం... ఇవన్నీ ఈ విధానంలో భాగంగా ఉండాలి.

ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రకటించిన మద్యం బెల్టు షాపుల రద్దు నిర్ణయాన్ని వేగంగా అమలులోకి తేవడానికి స్థానిక మహిళా ప్రజా ప్రతినిధులతో, మహిళా బృందాలతో కమిటీలు వేయాలి. ప్రతి మూడు నెలలకు ఒకసారి సామాజిక తనిఖీ ద్వారా ఈ విధానం ఫలితాలను విశ్లేషించాలి.

■ కన్నెగంటి రవి
తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ



హెలికాప్టర్ల విన్యాసం







కొలువు దీరిన విహంగాలు

అతిపెద్ద ట్విన్ఇంజిన్ జెట్ బోయింగ్ 777-9

బాహుబలి

ప్రత్యేక ఆకర్షణగా బోయింగ్ 777-9

ఏవియేషన్ షో

- నేటినుంచి నాలుగు రోజులు
- 20కి పైగా విహంగాల ప్రదర్శన
- తొలి రెండు రోజులు వ్యాపారులకు..

హైదరాబాద్ సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆసియాలోనే అతిపెద్ద సివిల్ ఏవియేషన్ షోగా గుర్తింపు పొందిన వింగ్స్ ఇండియా షో రెండేళ్ల తర్వాత మళ్లీ నగరానికి వచ్చింది. నేటినుంచి 21వ తేదీ వరకూ నాలుగు రోజులపాటు జరిగే ఈ షోను అడ్వాన్స్‌డ్ ఎయిర్ మొబిలిటీ నేపథ్యంతో నిర్వహిస్తున్నారు. మొదటి రెండు రోజులు బీ2బీ సమావేశాలు, సదస్సులు జరుగనుండగా, చివరి రెండురోజులు సామన్యులకు విమానాలను వీక్షించే అవకాశం కల్పిస్తున్నారు. విమానయాన రంగంలో వస్తోన్న మార్పులు, సాంకేతిక

మిగతా 8వపేజీలో..

బోయింగ్ కంపెనీ తాజా కలెక్షన్‌లో చేరిన విమానం 777-9. గత ఏడాది దుబాయ్ ఎయిర్ షోలో కనువిందు చేసిన ఈ విమానం.. వింగ్స్ ఇండియా -2024 షో కోసం ఇండియాకు తొలిసారిగా వచ్చింది. ఇప్పటికే బేగంపేట విమానాశ్రయంలో ల్యాండ్ అయిన ఈ అతిపెద్ద విమానంలో తక్కువగానే ఇంధన వినియోగం ఉంటుందని, ఉద్గారాలను సైతం చాలా తక్కువగా వెదజల్లుతుందని విమానయాన సంస్థ ప్రతినిధులు తెలిపారు. బోయింగ్ 777 ట్విన్ ఐసెల్ ఎయిర్‌క్రాఫ్ట్, 787 డ్రీమ్‌లైనర్ ఫ్యామిలీలోని మెరుగైన ఫీచర్ల సమ్మేళనంగా బోయింగ్ 777-9 విమానం ఉంటుందని అంటున్నారు. త్వరలోనే ఎయిర్ ఇండియా ఫ్లీట్‌లో ఈ విమానాలు చేరనున్నాయి. దాదాపు 400-425 (2 క్లాస్)మంది ఒకేసారి ప్రయాణించే వీలున్న ఈ విమానం ఏకధాటిగా 7600 నాటికల్ మైల్స్ (సుమారు 14,075 కిలోమీటర్లు) ప్రయాణించగలదు. ప్రపంచంలో ట్విన్ ఇంజిన్ సైజ్డ్ ప్లేన్ ఇది ఒక్కటే. దీనికి పోటీ కూడా ఏమీ లేదని వారు తెలిపారు.

మరో నిమిషంలో ఇల్లు చేరుతామనే లోపే..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి
- లిఫ్ట్ అడిగి వాహనం ఎక్కిన బాలుడు
- పాలవ్యాన్ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు
- రెండు కుటుంబాల్లో విషాదం



మనోజ్ (ఫైల్)



సంజీవ (ఫైల్)

హయత్‌నగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పండగకు అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. ఆనందాలు నింపుకొని తిరిగి వస్తూ.. యాక్టివా కనిపిస్తే లిఫ్ట్ అడిగి ఎక్కాడు. ఇంకో నిమిషంలో ఇంటికి క్షేమంగా చేరాల్సిందే. కానీ.. అంతలోనే మృత్యురూపంలో పాలవ్యాన్ దూసుకొచ్చింది. వీరు ప్రయాణిస్తున్న యాక్టివాను వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలుడితో సహా ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ హృదయ విదారకరమైన ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పసుమాముల గ్రామానికి చెందిన నడికుడి కృష్ణకు కుమార్తె, కూమారుడు మనోజ్(13) ఉన్నారు. మనోజ్ కుంట్లూర్‌లోని ఓ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని మనోజ్ శనివారం అమ్మమ్మ ఊరు పోచంపల్లికి వెళ్లాడు. బుధవారం పసుమాములకు తిరుగు ప్రయాణమయ్యాడు. హయత్‌నగర్ బస్‌స్టాండ్ వద్ద బస్సు కోసం వేచి చూస్తున్న అతనికి బాచారం గ్రామానికి చెందిన గండిపల్లి సంజీవ(19) హోండా యాక్టివాపై కనిపించాడు. వెంటనే లిఫ్టు అడిగి ఎక్కాడు. మరో నిమిషంలో ఇంటి వద్ద దిగుతామనే లోపు పసుమాముల కమాన్ వద్ద ఎదురుగా వస్తున్న పాలవ్యాను యాక్టీవాను అతి వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మనోజ్

మిగతా 8వ పేజీలో..

టిప్పింగ్ కిరికిరి..!

- కొనుగోలు.. చెల్లింపుల్లో గందరగోళం
- ఫీజు ఇవ్వాలంటోన్న టీఎస్ఎస్పీడీసీఎల్
- ఏపీటీఈఎల్‌ను ఆశ్రయించిన రాంకీ
- యూనిట్‌కు రూ.7.84 చొప్పున చెల్లింపులు
- ప్రైవేట్ సంస్థకు లబ్ధి చేసిన యంత్రాంగం

ఒప్పందాల్లోని లొసుగులతో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోంది. కోట్లాది రూపాయల ప్రజాధనం ప్రైవేట్ సంస్థల ఖాతాల్లోకి చేరుతోంది. ఓ విభాగం నుంచి టిప్పింగ్ ఫీజు (డంపింగ్ ఫీ).. మరో విభాగానికి విద్యుత్ విక్రయించి ప్రైవేట్ సంస్థ ఆదాయం పొందుతోంది. మొదట్లో ఒప్పందాలు, నిబంధనలు పట్టించుకోని సదరు శాఖ ఆ తర్వాత తప్పు తెలుసుకొని దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. టిప్పింగ్ ఫీజు చెల్లిస్తేనే.. విద్యుత్ డబ్బులిస్తామంటూ మెలిక పెట్టడంతో ఈ వివాదం అప్పిలేట్ ట్రైబ్యునల్ ఫర్ ఎలక్ట్రిసిటీ (ఏపీటీఈఎల్)కి చేరింది.

వ్యర్థాలనుంచి విద్యుత్ ఉత్పత్తిపై ఎఫెక్ట్



జవహర్‌నగర్ ప్లాంట్

హైదరాబాద్ సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో వెలువడే చెత్త తరలింపు, నిర్వహణకు 2009లో జీహెచ్ఎంసీతో రాంకీ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. 2012లో అగ్రిమెంట్ అందుబాటులోకి రాగా.. మొదట్లో చెత్త నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అనంతరం చెత్త తరలింపు, యేడాదిన్నర క్రితం నుంచి సెకండరీ కలెక్షన్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల(ఎస్‌సీటీఎస్) ఏర్పాటుతో పాక్షిక సేకరణ సైతం ఆ సంస్థకే అప్పగించారు. దీంతో టన్నుకు రూ.2053 టిప్పింగ్ ఫీజు (మొత్తం టిప్పింగ్ ఫీజు రూ.2281లో 90శాతం) జీహెచ్ఎంసీ చెల్లిస్తోంది. గతంలో యేటా రూ.200 నుంచి రూ.250 కోట్లు చెల్లించగా.. ఏడాది క్రితం నుంచి ఆ మొత్తం రూ.460 కోట్లు దాటింది. ఇదంతా వ్యర్థాల సేకరణ, తరలింపు, శాస్త్రీయ నిల్వ, నిర్వహణకు సంబంధించినది. ఒప్పందంలో భాగంగా పొడి చెత్త నుంచి విద్యుదుత్పత్తికి జవహర్‌నగర్‌లో రాంకీ ఏర్పాటుచేసిన 19.8 మెగావాట్ల ప్లాంట్ అందుబాటులోకి వచ్చింది. రెండో దశలో 24 మెగా వాట్ల విద్యుదుత్పత్తి ప్లాంట్ పనులు పురోగతిలో ఉన్నాయి. దుండిగల్‌లోనూ 15 మెగావాట్ల ప్లాంట్ సిద్ధమైంది. జవహర్‌నగర్‌లో మొదటి దశలో సిద్ధమైన ప్లాంట్‌లో ఉత్పత్తి చేస్తోన్న విద్యుత్‌ను యూనిట్‌కు రూ.7.84 చొప్పున చెల్లించి కొనుగోలు చేసేందుకు టీఎస్ఎస్పీడీసీఎల్‌తో రాంకీ పీపీఏ చేసుకుంది. ఇందుకనుగుణంగా గతంలో విద్యుత్ కొనుగోలుకు సంబంధించిన చెల్లింపులు జరిగాయి.

మొత్తం టిప్పింగ్ ఫీజా..? పాక్షికమా..?

వ్యర్థాల నుంచి విద్యుదుత్పత్తికి సంబంధించి సీఈఆర్‌సీ నిబంధనల మేరకు నడుచుకుంటామని డిస్కమ్ కొన్ని నెలల క్రితం స్పష్టం చేసినట్టు తెలిసింది. జవహర్‌నగర్ ప్లాంట్‌లో విద్యుదుత్పత్తికి 1500 టన్నుల పొడి చెత్త వినియోగిస్తున్నారు. ఈ వ్యర్థాలకు జీహెచ్ఎంసీ నిత్యం రూ.30.79లక్షలు రాంకీకి చెల్లిస్తోంది. అయితే, సీఈఆర్‌సీ నిబంధనల ప్రకారం స్థానిక సంస్థలు చెల్లించే టిప్పింగ్ ఫీజును విద్యుత్ కొనుగోలు సంస్థలకు ఇవ్వాలన్నది అధికారుల వాదన. మొదట్లో ఒప్పందాలు, నిబంధనలు పట్టించుకోని టీఎస్ఎస్పీడీసీఎల్ ఆ తర్వాత తప్పు తెలుసుకొని టిప్పింగ్ ఫీజు చెల్లిస్తేనే.. విద్యుత్ కొనుగోలు డబ్బులిస్తామంటూ మెలిక పెట్టింది. ఇందుకు సుముఖంగా లేని రాంకీ అప్పిలేట్ ట్రైబ్యునల్ ఫర్ ఎలక్ట్రిసిటీ (ఏపీటీఈఎల్)ని ఆశ్రయించింది. దీంతో మొత్తం టిప్పింగ్ ఫీజు టీఎస్ఎస్పీడీసీఎల్‌కు చెల్లించాలా..? లేక నిర్వహణకు సంబంధించిన మొత్తమా..? అన్న దానిపై సందిగ్ధత నెలకొంది. టీఎస్ఎస్పీడీసీఎల్ మెలికతో దుండిగల్‌లో కొత్తగా నిర్మించిన చెత్త నుంచి విద్యుదుత్పత్తి ప్లాంట్ ప్రారంభోత్సవం నిలిచిపోయింది. ప్లాంట్ సిద్ధంగా ఉన్నా పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ (పీపీఏ) జరగకపోవడంతో అందుబాటులోకి రాలేదు.

20న నీటి సరఫరా బంద్

హైదరాబాద్ సిటీ, జనవరి17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాలకు ఈ నెల 20న 24గంటలపాటు నీటి సరఫరా నిలిచిపోనున్నట్లు వాటర్‌బోర్డు అధికారులు ప్రకటించారు. కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లయ్ ఫేజ్ - 1లో మిరాలం, అలియాబాద్ ఆఫ్ టేక్ ప్రాంతం వద్ద మరమ్మతులు చేయాల్సి ఉంది. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో నీటిసరఫరాకు అంతరాయం కలగనుంది.



హెచ్‌జీసీఎల్ కార్యాలయం

మూసీ కార్యాలయం తరలింపు?

హైదరాబాద్ సిటీ, జనవరి17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తార్నాకలో ఉన్న మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) కార్యాలయాన్ని నానక్‌రాంగూడకు తరలించనున్నారు. ఇటీవల మూసీ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశాన్ని నానక్‌రాంగూడలోని ఎంఆర్‌డీసీఎల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంలోనే ఎంఆర్‌డీసీఎల్ కార్యాలయం తార్నాకలోని పాత హెచ్ఎండీఏ కార్యాలయంలో ఉన్నట్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో కార్యాలయాన్ని నానక్‌రాంగూడలోని హెచ్‌జీసీఎల్ కార్యాలయానికి తరలించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది.



బ్యాక్ టు సిటీ..

సంక్రాంతి సందర్భంగా పల్లెబాట పట్టిన నగరవాసులు తిరిగి వస్తున్నారు. దీంతో రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, మళ్లీ సందడిగా మారాయి. తిరిగి వచ్చే ప్రయాణికులతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ రద్దీగా కనిపించింది

మెరుగైన విద్యుత్‌సరఫరాకు

స్పెషల్ డ్రైవ్

- క్షేత్రస్థాయి పర్యటనల్లో సీజీఎం, ఎస్ఈలు



వినియోగదారునితో మాట్లాడుతున్న రంగారెడ్డి సీజీఎం ఆనంద్

హైదరాబాద్ సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో మరింత మెరుగైన విద్యుత్ సరఫరా అందించే దిశగా విద్యుత్ శాఖ స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశాలతో గ్రేటర్‌లో మెట్రోజోన్, మేడ్చల్, రంగారెడ్డి జోన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో సీజీఎంలు, ఎస్ఈలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుంటున్నారు. మెట్రోజోన్ సీజీఎం నరసింహస్వామి, రంగారెడ్డి జోన్ సీజీఎం ఆనంద్‌లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు పరిశీలించారు. ఫిబ్రవరి 10 నాటికి గ్రేటర్‌జోన్‌లో సమ్మర్ డిమాండ్‌కు తగినట్లు ఏర్పాట్లు చేయనుంది. మరమ్మతుల నేపథ్యంలో గురువారం గ్రేటర్‌జోన్ పరిధిలో 125 ఫీడర్లలో 2 గంటల పాటు విద్యుత్‌సరఫరాలో అంతరాయాలు నెలకొంటాయని అధికారులు తెలిపారు.



బ్యాడ్ బౌన్సర్స్..!

కొందరి తీరుతో పరేషాన్

- పెరుగుతున్న ఆగడాలు
- కస్టమర్లపై దాడులు, బెదిరింపులు
- రౌడీల్లా వ్యవహరిస్తున్న కొందరు
- బంజారాహిల్స్‌లో వారంలో రెండు కేసులు

ఆరడుగుల ఎత్తు.. కండలు తిరిగి.. చూడటానికి వస్తాదులను తలపిస్తారు. వ్యక్తిగత భద్రతలో వీరు కాస్త కీలకంగా వ్యవహరిస్తారు. సెలబ్రెటీలు, సినీ పరిశ్రమ ప్రముఖులు బయటకు వచ్చినప్పుడు రక్షణకు వీరిని నియమించుకుంటారు. అయితే, ఇప్పుడు వీరు దారి తప్పుతున్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని దాడులకు పాల్పడుతున్నారు. పోలీసులకు మించి అంతా మేమే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.

బంజారాహిల్స్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో కొంతమంది బౌన్సర్‌లు శృతి మించుతున్నారు. దాడులు, దౌర్జన్యాలకు దిగుతున్నారు. శాంతి భద్రతల సమస్యకు కారణమవుతున్నారు. వీరి విషయంలో కఠినంగా వ్యవహరించాల్సిన పోలీసులు కూడా తూతూ మంత్రంగా కేసులు పెట్టి చేతులు దులుపుకొంటున్నారు. దాడి చేస్తే బెయిలబుల్ కేసే అవుతుందని తెలుసుకున్న కొంతమంది బౌన్సర్లు దూకుడుగా వ్యవహరిస్తున్నారు. గడిచిన పది రోజుల్లో బంజారాహిల్స్‌లో బౌన్సర్ల ఆగడాలపై రెండు కేసులు నమోదయ్యాయి. ఒకే పబ్‌కు చెందిన బౌన్సర్లు పార్టీ ప్రియుల మీద దాడి చేయడమే కాకుండా హత్యాయత్నం చేశారంటే వారి ఆగడాలు ఏ స్థాయిలో ఉన్నాయనేది తెలుస్తోంది.

పబ్‌కు వస్తే అంతే..

నగరంలో పబ్ సంస్కృతి పెరుగుతోంది. పశ్చిమ మండలం పరిధిలో సుమారు 52 పబ్‌లున్నాయి. రక్షణ నిమిత్తం నిర్వాహకులు పదుల సంఖ్యలో బౌన్సర్లను నియమించుకుంటున్నారు. పబ్‌లో మద్యం మత్తులో ఏదైనా హడావిడి జరిగితే జాగ్రత్తగా వారిని నిరోధించడమే వీరి పని. కానీ కొంతమంది బౌన్సర్లు పబ్‌లో రౌడీలుగా వ్యవహరిస్తున్నారు. పబ్‌కు వచ్చే యువకులను చిన్న కారణాలకే చితక బాదుతున్నారు. నడిరోడ్డు మీద దాడులు చేస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 14లో ఆఫ్టర్ 9 పబ్‌లో పది రోజుల క్రితం పుట్టిన రోజు వేడుకలు చేసుకునేందుకు వచ్చిన యువకులపై బౌన్సర్లు దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బౌన్సర్లను నియంత్రించడంలో విఫలమయ్యారు. ఇదే అదునుగా భావించిన బౌన్సర్లు తాజాగా రెండు రోజుల క్రితం పార్టీకి వచ్చిన యువకులపై బీర్ బాటిళ్లతోనూ, కత్తితోనూ దాడి చేశారు. ఈ గొడవలో ఇద్దరు గాయపడ్డారు. బౌన్సర్లపై కేసులు పెడుతున్న పోలీసులు పబ్ యాజమాన్యం మీద ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనేది ప్రశ్నార్థకంగా మారింది. బౌన్సర్ల విషయంలో యాజమాన్యం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం వల్లే వారు రెచ్చిపోతున్నారనేది పై రెండు సంఘటనలతో తేలిపోయింది. ఇదే పబ్‌లో అమ్మాయిలతో నృత్యాలు చేయిస్తున్నారని గతంలో స్థానికంగా ఉండే వారు సైతం ఫిర్యాదులు చేశారు. ఇవి కూడా బుట్టదాఖలయ్యాయి. పోలీసులు చిన్నపాటి కేసులు పెట్టి చేతులు దులిపేసుకున్నారు.

భద్రత నుంచి సోషల్ స్టేటస్ వరకు..

దేహదారుఢ్యంపై ఆసక్తి ఉండి చదువుకునే వారికి బౌన్సర్ వ్యవస్థ ఉపాధి అవకాశంగా మారింది. కండలు తిరిగిన వీరులను


మిగతా 8వ పేజీలో..


ఇదేనా.. ఫ్రెండ్లీ పోలీసింగ్..!




8

ట్రై కమిషనరేట్ల పరిధిలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు కొత్త అర్థం చెబుతున్నారు. బాధితుల పక్షాన కాకుండా డబ్బులున్న.. డబ్బులు వచ్చే వారితో కొందరు ఖాకీలు ఫ్రెండ్లీగా ఉంటున్నారు. అండగా ఉంటారని ఠాణా మెట్లు ఎక్కితే.. సార్ అనడం సంగతి అటుంచి 'ఎక్కడ చెప్పుకుంటావో చెప్పుకో పో..' అంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఓ విఎస్సింగ్ కేసు విషయంలో పోలీసులు ఇలాంటి నిర్లక్ష్యమే ప్రదర్శించడంతో ఓ నిండు ప్రాణం పోయింది.








విద్యుత్ దీపాల వెలుగులతో దర్గా ముఖద్వారం

నేటి నుంచి జహంగీర్‌పీర్ దర్గా ఉర్సు

కొత్తూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): హజ్రత్ జహంగీర్‌పీర్ (జేపీ) దర్గా ఉర్సుకు సిద్ధమైంది. నేటి నుంచి మూడు రోజుల పాటు ఉర్సును నిర్వహించేందుకు అంతా సిద్ధం చేశారు. 18న గంధోత్సవం, 19న దీపారాధన, 20న ఖత్మేఖురాన్‌తో ముగింపు నిర్వహిస్తారు. ఈ దర్గా భిన్న మతాలకు ప్రతీకగా నిలుస్తోంది. కుల, మతాలకతీతంగా వేలాదిమంది భక్తులు దర్గాను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. నగరానికి 45 కిలోమీటర్ల దూరంలో కొత్తూర్ మండలం ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులో ప్రశాంత వాతావరణంలో దర్గా నెలకొని ఉంది. రాష్ట్రంలోని నలుమూలల నుంచే కాక, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి దర్గాను దర్శించుకుంటారు. గిరిజనులు కుటుంబ సభ్యులతో ఎడ్లబండ్లపై తరలివచ్చి దర్గాలో మొక్కులు తీర్చుకోవడం ఇక్కడి ప్రత్యేకత. ఉర్సును పురస్కరించుకుని జేపీ దర్గా విద్యుత్ దీపాలంకరణతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఉర్సు కోసం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు అధికారులు భక్తులకు ఏర్పాట్లను పూర్తి చేశారు. ప్రతి అరగంటకు అఫ్జల్‌గంజ్, చార్మినార్ ప్రాంతాల నుంచి బస్సులు నడుస్తాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు. శంషాబాద్ జోన్ డీసీపీ నారాయణరెడ్డి పర్యవేక్షణలో ఏసీపీ రాంచందర్‌రావు ఆధ్వర్యంలో జేపీ దర్గాలో మూడు రోజుల పాటు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు తెలిపారు.

నిలకడగా తమ్మినేని వీరభద్రం ఆరోగ్యం

రాయదుర్గం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నాయకుడు తమ్మినేని వీరభద్రం ఆరోగ్యం నిలకడగా ఉందని, చికిత్సకు స్పందిస్తున్నారని ఏఐజీ ఆస్పత్రి వైద్యులు విడుదల చేసిన హెల్త్‌బులెటెన్‌లో పేర్కొన్నారు. ఆయనకు వైద్యుల పర్యవేక్షణలో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామని, చికిత్సకు స్పందిస్తున్నారని మరో 24-48 గంటలు చాలా కీలకమని తెలిపారు. ఆయనను సీపీఎం బీవీ రాఘవులు పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీరభద్రం ఆరోగ్యం నిలకడగా ఉందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎవరు ఆందోళన చెందొద్దని, ఆస్పత్రికి రావద్దని సూచించారు.





ప్రభుత్వ స్థలంలో పార్కింగ్ దందాకు చెక్..!

- వెంటనే వాహనాలను ఖాళీ చేయించిన తహసీల్దార్
- ప్రైవేట్ వ్యక్తి ఏర్పాటు చేసిన సూచిక బోర్డుల తొలగింపు
- సాయంత్రానికి యథాస్థితిలో వాహనాలు

మంగళ్‌హాట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గుఫా మందిర్ ప్రభుత్వ స్థలంలో అక్రమ పార్కింగ్‌ను ప్రోత్సహిస్తూ అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్న వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రభుత్వ స్థలంలో పార్కింగ్ దందా' శీర్షికన బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతి, ఆర్ఐతో పాటు సిబ్బంది గుఫామందిర్ వద్దకు చేరుకొని పెద్ద ఎత్తున పార్కింగ్‌లో పెట్టిన వాహనాలను వెంటనే ఖాళీ చేయించారు. అనంతరం అక్కడి స్థానికులతో వివరాలు సేకరించి, పార్కింగ్ దందా నిర్వహిస్తున్న వ్యక్తి వద్ద రికార్డులను సేకరించే ప్రయత్నం చేయగా, సదరు వ్యక్తి రికార్డును లాక్కొని వెళ్లిపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ సంవత్సరం రూ. 50 లక్షల వరకు దందా నడుస్తుందని తెలియడంతో వెంటనే అక్రమ పార్కింగ్ వ్యవహారంపై కఠినంగా వ్యవహరించాలని సిబ్బందికి స్థానిక తహసీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ రోజు స్థలాన్ని విజిట్ చేసి వివరాలు తనకు తెలియజేయాలని ఫీల్డ్ అధికారులకు సూచించారు. మధ్యాహ్నం వరకు అధికారులు అక్కడే ఉండి అక్రమంగా ఏర్పాటు చేసిన సూచిక బోర్డులను తొలగించారు. ఇదిలా ఉండగా ఎస్‌బీ అధికారులు సైతం ప్రత్యేకంగా స్థానికుల నుంచి వివరాలను సేకరించారు. పార్కింగ్ నిమిత్తం ఎంత మొత్తంలో వసూలు చేస్తున్నారు? ఇందులో ఎవరెవరు ఉన్నారు? గుఫా మాత మందిర్‌లో పూజలు నిర్వహించేందుకు డబ్బులు వసూలు చేస్తున్న వారి వివరాలతో పాటు రాత్రి సమయాల్లో వాహనాల మధ్య చేరి సట్టా, క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ గంజాయి తాగుతున్న యువకుల వివరాలను సైతం రాబట్టినట్లు సమాచారం. దీంతో స్థానికులు 'ఆంధ్రజ్యోతి' కథనంపై హర్షం వ్యక్తం చేశారు. అధికారుల్లో చలనం తీసుకువచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



గుఫామందిర్ ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయ అధికారులు



ఆంధ్రజ్యోతి కథనం

సాయంత్రానికి మళ్లీ అదే స్థితి..

రెవెన్యూ అధికారులు ఉదయం గుఫామందిర్ వద్దకు చేరుకొని ప్రభుత్వ స్థలంలోని వాహనాలను తరలించగా వారు వెళ్లిన గంటలోపే మళ్లీ వాహనాలను పార్క్ చేసేలా అక్కడి నిర్వాహకులు ప్రోత్సహించడం విశేషం. సాయంత్రం ఆరు గంటల వరకు భారీగా వాహనాలు ప్రభుత్వ స్థలంలో పార్క్ చేసి ఉండడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు వెళ్లిన వెంటనే అదే బరితెగింపునకు దిగడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో వాహనాల పార్కింగ్‌కు అడ్డుకట్ట వేయాలని అక్కడి నివాసితులు కోరుతున్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీస్ ఇస్తున్న సీఐటీయూ నాయకులు

16న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

నార్సింగ్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ పిలుపునిచ్చారు. మణికొండ మున్సిపల్ కమిషనర్‌కు సీఐటీయూ నాయకులు బుధవారం సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో మున్సిపల్ కార్మికులు ప్రజల ఆరోగ్యాలను కాపాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు రుద్ర కుమార్, మణికొండ సీఐటీయూ కార్మికులు టి.చంద్రశేఖర్, విజయ్, వరలక్ష్మి, జయశ్రీ పాల్గొన్నారు.

గిరిజన గురుకులాల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

రాజేంద్రనగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ గురుకులాల్లో ఐదవ తరగతిలో ప్రవేశాల గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త పీఎస్ కళ్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని తెలిపారు. విద్యార్థుల ఎంపిక ప్రక్రియ పాత జిల్లా యూనిట్‌గా పరిగణిస్తామని తెలిపారు.

మైనారిటీ గురుకులాలకు దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా పరిధిలోని తొమ్మిది మైనారిటీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కె.నవీన్ కుమార్‌రెడ్డి సూచించారు. జిల్లాలోని హయత్‌నగర్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, బాలాపూర్(బాలురు), ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, హయత్‌నగర్, ఫరూఖ్‌నగర్, మొయినాబాద్(బాలికల) మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూప్‌లు, 5వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే, 6,7,8వ తరగతి బ్యాక్‌లాగ్ ఖాళీలను(మైనారిటీలకు మాత్రమే) భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఫిబ్రవరి 6వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

25, 26వ తేదీల్లో క్రీడా పోటీలు

రాజేంద్రనగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26వ తేదీల్లో వాలీబాల్, బ్యాడ్మింటన్, క్యారమ్స్ పోటీలను నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు వేముల వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేశ్, క్రీడల కార్యదర్శులు వి.లక్ష్మణ్‌దాస్‌లు ఓ ప్రకటనలో తెలిపారు. వాలీబాల్ పోటీలో ప్రథమ బహుమతి రూ. 10 వేలు, ద్వితీయ రూ. 5 వేలు, బ్యాడ్మింటన్ పోటీలో ప్రథమ బహుమతి రూ. 3 వేలు, ద్వితీయ రూ. 2వేలు, క్యారమ్స్‌లో ప్రథమ బహుమతి రూ. 2వేలు, ద్వితీయ రూ. వెయ్యితోపాటు షీల్డ్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 88854 62345, 92930 55950, 98482 05377లో సంప్రదించాలని వారు సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నార్సింగ్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని హిమాయత్‌నగర్ ఏఈ పి.శ్రీనివాస్ తెలిపారు. 11 కేవీ కాళీమందిర్, 33/11 కేవీ గంధంగూడ పరిధిల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యానగర్, శివపురి కాలనీ, శివసాయినగర్, సంజయ్‌గాంధీనగర్, లిబ్దమ్ విల్లా, సంగం సిటీ, వెస్ట్‌ఎండ్ కాలనీ, హిమగిరినగర్‌లో విద్యుత్ కోత ఉంటుందని తెలిపారు. అలాగే, 33/11 కేవీ గంధంగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వరకాలనీ, డైమండ్‌విల్లా, బృందావన్‌కాలనీ, నర్సారెడ్డికాలనీ, పద్మశ్రీ హిల్స్, తిరుమలగార్డెన్, పావనీ హర్మోనియంవిల్లా తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

డ్రమ్ముల కంపెనీలో అగ్నిప్రమాదం



డ్రమ్ముల కంపెనీలో అగ్ని ప్రమాదం

రాజేంద్రనగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఓ డ్రమ్ముల కంపెనీలో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ ద్వారా మంటలు వ్యాపించినట్లు తెలిసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేతాజీనగర్‌లోని ఏషియన్ బ్యారెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఇనుప డ్రమ్ములను తయారు చేస్తారు. వీటికి బ్లూ, గ్రీన్, రెడ్ కలర్ వేస్తారు. అలా వేసే కలర్స్‌ను నిల్వ ఉంచిన బ్యారెల్స్‌లో మంగళవారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. గమనించిన కంపెనీ కార్మికులు మైలార్‌దేవుపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ కృష్ణయ్య సంఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని మైలార్‌దేవుపల్లి ఎస్ఐ తెలిపారు.

డబీర్‌పురాలో వ్యక్తి అదృశ్యం



ఉస్మాన్ మహమూద్

యాకుత్‌పుర, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. రెయిన్ బజార్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహ్మద్ ఉస్మాన్ మహమూద్(32) భార్య అమీన్ మహమూద్, ఇద్దరు పిల్లలతో కలిసి రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డబీర్‌పుర కాళి మాజీద్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. ఉస్మాన్ మహమూద్ మార్చిలో దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు వచ్చాడు. ఇంట్లోనే ఉంటున్న భర్త మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని అమీన్ మహమూద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసిన సందర్భంగా బుధవారం ఆయన కార్యాలయంలో ఆలిండియా ఓల్డ్ టెంపుల్ రినోవేషన్ ట్రస్ట్ చైర్మన్ ఆర్.కె.జైన్, ప్రముఖ జైన సంగీత విద్వాంసుడు ప్రవీణ్ వనిగోటలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
● గోషామహల్, ఆంధ్రజ్యోతి



జాతీయ బీజేపీ వాల్ రైటింగ్ క్యాంపెయిన్‌లో భాగంగా జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ ఆధ్వర్యంలో వాల్ రైటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ యాదవ్, అమర్‌సింగ్, మయూర్ కలేకర్, రఘుకాంబ్లే, అనిల్ యాదవ్, రామకృష్ణ, ముఖేశ్, సందీప్, సురేశ్, కాంత్రి, శ్రీకాంత్, పవన్, అరుణ్ పాల్గొన్నారు.
● అఫ్జల్‌గంజ్, ఆంధ్రజ్యోతి

వాచ్‌మన్ హత్య కేసులో నిందితుడి అరెస్ట్

నార్సింగ్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మంచిరేవుల గ్రామంలో వాచ్‌మన్ జంగయ్య హత్య కేసులో బిహార్‌కు చెందిన అర్జున్ మాంజిని నార్సింగ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నార్సింగ్ ఏసీపీ ఎస్.లక్ష్మీనారాయణ, ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్, ఎస్ఐ అశోక్‌వర్ధన్‌లు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. అర్జున్ మాంజి కన్‌స్ట్రక్షన్ సైట్లలో చిన్న, చిన్న సెంట్రింగ్ ఐరన్ రాడ్‌లు దొంగిలించి బయట అమ్ముకునేవాడు. జనవరి 15న సెంట్రింగ్ ఐరన్ రాడ్‌లు సంచిలో అమ్ముకునేందుకు పెట్టగా దానిని గమనించిన వాచ్‌మన్ జంగయ్య ప్రశ్నించాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఇదే విషయాన్ని మనసులో పెట్టుకొని అర్జున్ మాంజి సోమవారం రాత్రి జంగయ్యతో కలిసి మద్యం తాగాడు. అతడు నిద్రపోయిన తర్వాత రాత్రి 10 గంటల సమయంలో వాచ్‌మన్ తలపై సిమెంట్‌తో తయారు చేసిన డంబెల్ లాంటి పరికరంతో కొట్టాడు. దీంతో జంగయ్య మృతిచెందినట్లు వెల్లడించారు.

వీధి కుక్కదాడిలో గాయపడ్డ బాలుడు

● మెరుగైన చికిత్స అందించాలి : అసదుద్దీన్ ఓవైసీ



గాయపడ్డ తైమూర్

నార్సింగ్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కదాడిలో తీవ్రంగా గాయపడ్డ ఆరేళ్ల బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ ఆరోగ్యశాఖ కార్యదర్శికి సూచించారు. మెదక్ జిల్లాకు చెందిన తైమూర్(6)పై బుధవారం వీధికుక్క దాడి చేయడంతో ముఖం, కన్నుపై తీవ్రగాయాలయ్యాయి. ఈ విషయాన్ని తైమూర్ తండ్రి షకీర్, కుటుంబ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఓవైసీ బాలుడికి మెరుగైన వైద్యం అందించేలా చూడాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌కు సూచించారు. దీంతో ఎమ్మెల్యే బాలుడికి మెరుగైన చికిత్స అందించేలా చూడాలంటూ తెలంగాణ ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినాను కోరారు. ఈ మేరకు బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని ఆరోగ్యశాఖ కార్యదర్శి సరోజినీ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

కిడ్నీ మార్పిడి విజయవంతం

బంజారాహిల్స్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): థ్రాంబోటిక్ మైక్రో అంజియోపతి(టీఎంఏ) సిండ్రోమ్ లక్షణాలతో కిడ్నీ వ్యాధి చివరి దశలో ఉన్న రోగికి వైద్యులు విజయవంతంగా మూత్ర పిండాల మార్పిడి పూర్తి చేశారు. బంజారాహిల్స్‌లోని విరించి ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి నెఫ్రాలజీ టీమ్ హెడ్ డాక్టర్ కేఎస్ నాయక్, డాక్టర్ నవీన్ కుమార్ మట్టెవాడ, సీనియర్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ నవీన్ మెడి వివరాలు వెల్లడించారు. 'జార్ఖండ్ జమ్తారాకు చెందిన రామన్ కుమార్ సింగ్(37) మూత్రపిండ వ్యాధితో బాధపడుతున్నారు. స్థానికంగా ఓ ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు చేయించుకోగా ఆయనకు మూత్ర పిండ మార్పిడి తప్పనిసరి అని వైద్యులు తేల్చారు. తన సోదరి మూత్ర పిండం ఇచ్చేందుకు సిద్ధ పడింది. ఇద్దరి బ్లడ్ గ్రూప్ వేర్వేరు కావడంతో కిడ్నీ అమర్చడం సమస్యగా మారింది. దీన్నే వైద్య పరిభాషలో థ్రాంబోటిక్ మైక్రో అంజియోపతి సిండ్రోమ్ అంటారు. దీంతో రోగిని మెరుగైన వైద్యం నిమిత్తం విరించి ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు కిడ్నీ మార్పిడి చేస్తే భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను విశ్లేషించారు. అనంతరం కిడ్నీని విజయవంతంగా మార్పిడి చేశారు. రోగి వేగంగా కోలుకున్నారని వైద్యులు తెలిపారు.

21న ప్రకృతి విజ్ఞాన చికిత్సపై జాతీయ సదస్సు

పంజాగుట్ట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ యోగా విద్యాలయం, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోని రామచంద్ర ప్రకృతి ఆశ్రమంలో ఈ నెల 21న ప్రకృతి విజ్ఞాన చికిత్సపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని గ్లోబల్ చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సదస్సులో వంద రకాల దేశవాళీ బియ్యం, వంద రకాల కూరగాయల దేశవాళి విత్తనాలు, మట్టి కుండల తయారీ, సహజ రంగులు, ఖాదీ, చేనేత, తాటి ఆకుల బొమ్మలు, ఔషధ మొక్కలు, గానుగ నూనె, సిరి ధాన్యాలు, ఇతర ప్రదర్శనలు, అమ్మకాలు చేస్తామన్నారు. సమావేశంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గాంధారి ప్రభాకర్, మహిళా కన్వీనర్ యానాల రాధిక, ప్రతినిధులు గిరిధర్, టి.సురేందర్, సుభాష్, గోవర్ధన్, సాయితేజ, శివారెడ్డి పాల్గొన్నారు.

4వ తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



జ్ఞానేశ్వర్



గంగాధర్

మంగళ్‌హాట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 4వ తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని 4వ తరగతి కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన కేంద్ర సంఘం ఎన్నికల్లో ఆరోసారి రాష్ట్ర అధ్యక్షుడిగా గడ్డం జ్ఞానేశ్వర్ ఎన్నిక కాగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొండూరు గంగాధర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం నాంపల్లి గృహకల్ప ప్రాంగణంలోని కేంద్ర సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 22న యూనియన్ కార్యాలయం భవనంలో మహా చండియాగం నిర్వహించిన అనంతరం ప్రమాణ స్వీకారం ఉంటుందని తెలిపారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించి ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తామని తెలిపారు.

గ్రిల్ హౌస్ హోటల్ సీజ్

● లైసెన్స్ రద్దు ● 17 మంది బాధితుల్లో ఆరుగురు డిశ్చార్జి ● మరో 11 మందికి కంటోన్మెంట్ ఆస్పత్రిలో చికిత్స



గ్రిల్ హౌస్ హోటల్‌ను సీజ్ చేసిన అధికారులు



కంటోన్మెంట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

అల్వాల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అల్వాల్ లోతుకుంటలోని గ్రిల్‌హౌస్ హోటల్ ఘటనలో సంబంధిత హోటల్ లైసెన్స్‌ను జీహెచ్ఎంసీ అధికారులు బుధవారం రద్దు చేయడంతోపాటు సీజ్ చేశారు. సంబంధిత హోటల్ యజమానిపై అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 13న గ్రిల్ హౌస్‌లో కొంతమంది స్థానికులు షవర్మా తిన్నారు. వారిలో మొదట నలుగురు అస్వస్థతకు గురికాగా, తాజాగా మరో 13 మందికి విరేచనాలు, వాంతులు అయ్యాయి. వారంతా బొల్లారం కంటోన్మెంట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. మరికొంతమందిని సుచిత్రలోని మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వారిలో కోలుకున్న ఇద్దరిని డిశ్చార్జి చేశారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు ఆరుగురిని డిశ్చార్జ్ చేయగా మరో 11 మంది బొల్లారం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

రక్త పరీక్షల్లో సాల్మొనెల్లా బ్యాక్టీరియా

బాధితులు అస్వస్థతకు గురికావడానికి కారణాలు తెలుసుకునేందుకు రక్త పరీక్షలు నిర్వహించగా సాల్మొనెల్లా బ్యాక్టీరియా ఉన్నట్లు తేలిందని జీహెచ్ఎంసీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మీకాంత్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. గుడ్డులోని పచ్చసొన, నిమ్మరసం, నూనెను మిక్సీలో వేసి తెల్లని మయోనైస్‌ను తయారు చేస్తారు. గుడ్డుపై కోళ్ల రెట్ట ఉంటుంది. వాటిని శుభ్రం చేయకుండానే మిక్సీలో వేస్తారు. కొన్నిసార్లు గుడ్డు షెల్ కూడా అందులో పడుతుంది. శుభ్రత ప్రమాణాలు పాటించకపోవడం కారణంగా అలాంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయని పేర్కొన్నారు.

మయోనైస్‌ను నిల్వ చేస్తే అంతే..!

గుడ్డుకు బదులు సోయాబీన్స్‌తో కూడా మయోనైస్‌ను తయారు చేసుకోవచ్చని, తాము నగరంలోని హోటళ్ల యజమానులకు వివరించామన్నారు. వెజ్ మయోనైస్‌తో పోల్చుకుంటే గుడ్డుతో తయారు చేసిన మయోనైస్ రుచి ఉండడంతో షవర్మా, పిజ్జాలు, ఎగ్‌బర్గర్, వెజ్‌బర్గర్ తదితర వాటిలో వీటిని ఉపయోగిస్తారని లక్ష్మీకాంత్ వివరించారు. తయారు చేసిన మయోనైస్ వెంటనే ఉపయోగించాలని, నిలువ ఉంచి వినియోగిస్తే అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. ఇక నుంచి ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రత్యేక తనిఖీలు చేస్తామన్నారు. ఇప్పటికే గ్రిల్‌హౌస్ యజమాని తౌఫిక్‌పై ఐపీసీ 273, 269 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లు అల్వాల్ స్టేషన్‌హౌజ్ ఆఫీసర్ రాహుల్‌దేవ్ తెలిపారు.

రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం



నాగేంద్రబాబును సన్మానిస్తున్న ఎంఏ నయీమ్, తదితరులు

రాజేంద్రనగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే నెంబర్.1 పోలీస్ స్టేషన్‌గా రాజేంద్రనగర్ నిలిచింది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా చేతుల మీదుగా ఇన్‌స్పెక్టర్ బి.నాగేంద్రబాబు ట్రోఫీని అందుకున్నారు. బుధవారం రాజేంద్రనగర్ తాలూకా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ ఎంఏ నయీమ్ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు నాగేంద్రబాబును సన్మానించారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజేంద్రనగర్ పోలీసులు చేస్తున్న కృషిని అభినందించారు. స్నేహపూర్వకమైన వాతావరణంలో ప్రజలు, క్రీడాకారులు, విద్యార్థులతో కలిసి చేపట్టిన కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. రాజేంద్రనగర్ ఏసీపీ బి.గంగాధర్, ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబులు అనేక సమస్యల పరిష్కారానికి చొరవ చూపారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు కనకమామిడి ప్రవీణ్‌కుమార్, కోళ్లమీది యాదయ్య ముదిరాజ్, మాగని కృష్ణ, రవీందర్‌రెడ్డి, విశ్రాంత ఉద్యోగ సంఘాల నాయకులు జి.అంజయ్య గౌడ్, ఎస్.జగదీశ్వర్, వేముల వెంకటేశ్, ఎస్.వెంకటేశ్, మల్లేశ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న మాధవీలత



సమావేశంలో మాట్లాడుతున్న చార్మినార్ బాగ్ ప్రతినిధులు

ఆరు రోజులపాటు సీతారాముల కల్యాణం

చాంద్రాయణగుట్ట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న అయోధ్యలో రామమందిర ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని లతా మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రాంతాల్లో ఆరు రోజులపాటు సీతారామ కల్యాణం నిర్వహిస్తామని ఫౌండేషన్ చైర్మన్ మాధవీలత తెలిపారు. అందులో భాగంగా మంగళవారం రాత్రి చార్‌కమాన్, మామాజుమ్లా పాఠక్ వద్దనున్న మహవీర్ దళ్, చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వద్ద పూజలు చేసి సీతారాముల విగ్రహాలను పల్లకిలో ఉంచి కల్యాణ వేదిక వద్దకు ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సరితాఅగర్వాల్, పవన్‌మిశ్రా, అనిల్‌బజాజ్, నీరజ్‌అగర్వాల్, పంకజ్‌అగర్వాల్, గౌరీశంకర్‌సోని, రేణుసోని, మేఘారాణిఅగర్వాల్ దంపతులు పాల్గొన్నారు.

54 బస్తీల్లో అక్షింతలు పంపిణీ

శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ చార్మినార్ బాగ్ ఆధ్వర్యంలో బుధవారం రాంబక్షిబండలోని వనవాసి రామాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చార్మినార్ బాగ్ సంయోజక్ మజ్జిగ రమేశ్, సహ సంయోజక్ విశాల్‌ప్రసాద్ మాట్లాడుతూ అయోధ్యలో పూజించిన అక్షింతలు, ఆహ్వానపత్రం, శ్రీరాముడి అయోధ్య చిత్రపటం చార్మినార్‌బాగ్‌లోని ఏడు నగరాలు, 54 బస్తీల్లో ప్రతీ ఇంటికి చేర్చామని తెలిపారు. జనవరి 1 నుంచి 15 వరకు 2,194 మంది కార్యకర్తలు 96,417 ఇళ్లకు పంపిణీ చేశారని పేర్కొన్నారు. సమావేశంలో సభ్యులు ముఖేశ్ యాదవ్, గౌలిపురా నగర్ సభ్యుడు మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్‌తో అంటకాగే వారితో కాంగ్రెస్ పోరాటం

● తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ

సైదాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్‌తో అంటకాగేవారితో కాంగ్రెస్ ఎప్పటికీ దూరం ఉంటుందని, అలాంటి వారితో నిరంతరం పోరాటం చేస్తుందని ఆ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. మంగళవారం రాత్రి చాదర్‌ఘాట్‌లో తారిక్ ముస్లిం షాబాన్ ఆధ్వర్యంలో ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డికి ఆర్ఎస్ఎస్‌తో సంబంధాలు ఉన్నాయంటూ ప్రతిపక్షాలు కుట్రపూరితంగా ఆరోపణలు చేసినా, లౌకికవాదులంతా నమ్మలేదని చెప్పారు. రేవంత్‌రెడ్డి పనులు పరుగులు పెట్టిస్తున్నాడని కితాబిచ్చారు. కాంగ్రెస్ హిందూ, ముస్లిం తేడా లేకుండా అందరిని కలుపుకుని పోతుందని అన్నారు. పాతబస్తీలో పేదరికం అధికంగా ఉందని, పేదరికాన్ని తగ్గించేందుకు కాంగ్రెస్ కృషి చేస్తుందని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముస్లింల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయయంతో ఉందని అన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు సమీర్ ఉల్లా, మలక్‌పేట కాంగ్రెస్ ఇన్‌చార్జి షేక్‌అక్బర్, తారిక్ ముస్లిం షాబాన్ అధ్యక్షుడు ముస్తాక్‌మాలిక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షీ, మంత్రి పొన్నం ప్రభాకర్‌లను ముస్లిం మతపెద్దలు సన్మానించారు.

భారత్ ఇంగ్లాండ్ మ్యాచ్‌కు పటిష్ట భద్రత

● రాచకొండ సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25 నుంచి 29 వరకు ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఐదు రోజుల పాటు జరగనున్న భారత్ ఇంగ్లాండ్ టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌కు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు వెల్లడించారు. ఈ మేరకు డీసీపీలు, అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు, హెచ్‌సీఏ అధికారులతో బుధవారం ఉప్పల్ స్టేడియం ప్రాంగణంలో సీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. టికెట్ల పంపిణీలో, పార్కింగ్‌కు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రేక్షకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా బందోబస్తు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హెచ్‌సీఏ అధ్యక్షులు జగన్‌మోహన్‌రావు, ఉపాధ్యక్షులు దిల్జిత్ సింగ్, సెక్రటరీ దేవరాజు, మల్కాజిగిరి డీసీపీ పద్మజ, డీసీపీ (ఎస్‌బీ) కరుణాకర్, ట్రాఫిక్ డీసీపీ-1 మనోహర్, అడ్మిన్ డీసీపీ ఇందిర, అదనపు డీసీపీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రిపబ్లిక్ డే హార్స్ రైడింగ్ పోటీ-2024లో పతకాలతో పాటు ప్రతిష్ఠాత్మకమైన షో జంపింగ్ ఛాంపియన్ ఆఫ్‌ది డే ట్రోఫీని గెలుచుకున్న కెడెట్స్

రిపబ్లిక్ డే పోటీల్లో ఎన్‌సీసీ కెడెట్ల ప్రతిభ

అల్వాల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్‌కు చెందిన కెడెట్స్ న్యూఢిల్లీలో రిపబ్లిక్ డే హార్స్ రైడింగ్ పోటీ-2024లో ప్రతిభను కనపర్చారు. ఈక్వెస్ట్రియన్ (గుర్రపుస్వారీ)లో ప్రదర్శన చేశారు. రిపబ్లిక్ డే క్యాంప్‌లో భాగంగా బుధవారం నిర్వహించిన ఈక్వెస్ట్రియన్ (గుర్రపుస్వారీ)లో ఎన్‌సీసీ కెడెట్స్ నైపుణ్యాన్ని ప్రదర్శించి పతకాలను సాధించారని రక్షణశాఖ పౌర సంబంధాల అధికారి హరినాయక్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈక్వెస్ట్రియన్ (గుర్రపుస్వారీ) ఎక్సలెన్స్‌లో తెలంగాణ, ఏపీకి చెందిన ఎన్‌సీసీ కెడెట్స్ వివిధ విభాగాల్లో మూడు బంగారు, నాలుగు రజిత, మూడు కాంస్య పతకాలతో పాటు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన షో జంపింగ్ ఛాంపియన్ ఆఫ్‌ది డే ట్రోఫీని గెలుచుకున్నారు. ఈ పోటీల్లో 15 ఎన్‌సీసీ డైరెక్టరేట్‌ల నుంచి కేడెట్లు హాజరయ్యారు.



మహాలడ్డు రథయాత్ర ప్రారంభిస్తున్న అతిథులు

మహాలడ్డూ ప్రసాదం శోభాయాత్ర

మారేడ్‌పల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మారేడ్‌పల్లికి చెందిన శ్రీరామ క్యాటరింగ్ వ్యాపారి నాగభూషణం రెడ్డి 1265 కిలోల మహాలడ్డూ ప్రసాదాన్ని తయారు చేసి భక్తుల సందర్శనార్థమై పికెట్‌లోని తన నివాసం వద్ద ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు వందాలది మంది భక్తులు పాల్గొని లడ్డూని దర్శించుకున్నారు. అనంతరం నాగభూషణం రెడ్డి దంపతులు మహాలడ్డూకు హారతినిచ్చి జెండా ఊపి మంగళ వాయిద్యాల నడుమ శోభాయాత్రను మూడున్నర గంటలకు ప్రారంభించారు. ఇక్కడి నుంచి నేరుగా తాడ్‌బంద్ హనుమాన్ ఆలయం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం అయోధ్య రామ మందిరానికి రోడ్డు మార్గం గుండా తీసుకెళ్ళనున్నట్లు మహాలడ్డూ తయారీదారు నాగభూషణం రెడ్డి తెలిపారు. మధ్యప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జి మురళీధర్ రావు, సీనియర్ నాయకులు చాడా సురేష్ రెడ్డి, శ్యాంసుందర్ గౌడ్, కార్పొరేటర్ కొంతం దీపిక, శ్రీగణేష్, ఎం.కొమరయ్య, సారంగపాణి, టోపి శంకర్ తదితరులు పాల్గొని మహాలడ్డూను దర్శించుకొన్నారు.

హత్య కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

బంజారాహిల్స్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ప్రధాన ప్రధాన నిందితుడితో పాటు అతనికి సహకరించిన మరో వ్యక్తిని ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. షేక్‌పేట జై హింద్ కాలనీకి చెందిన గౌస్ మొయినుద్దీన్ భార్య 2022 ఫిబ్రవరిలో ఉన్నత విద్య కోసం లండన్ వెళ్లింది. అక్కడ ఆమెకు అద్నన్ హస్సెన్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తనను వివాహం చేసుకోవాలని మీనా పై ఒత్తిడి తేవడం మొదలు పెట్టాడు. దీంతో ఆమె నగరానికి తిరిగివచ్చి గతేడాది నవంబర్ 11న ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ నెల 14న మొయినుద్దీన్ తన భార్యతో ఇంట్లో ఉండగా అద్నన్ అక్కడకు వచ్చి బలవంతంగా స్కూటీ మీద ఎక్కించుకొని కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించాడు. మొయినుద్దిన్ అతన్ని వెంబడించాడు. అపార్ట్‌మెంట్ నుంచి కొద్ది దూరం వెళ్లాక మొయినుద్దిన్ స్కూటీని అడ్డుకుని తన భార్యను కాపాడేందుకు ప్రయత్నించాడు. వెంటనే అద్నన్ హస్సెన్ జేబులో నుంచి కత్తి తీసి మొయినుద్దీన్ ఛాతిలో పొడిచాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మొయినుద్దీన్ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ద్వారా అద్నన్‌ను అరెస్టు చేశారు. అతడు పారిపోయేందుకు సహకరించిన మిర్జాఫజల్‌ను కూడా అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్టు జూబ్లీహిల్స్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ తెలిపారు.



జూ క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్.హిరెమత్‌కు చెక్కు అందజేస్తున్న అరిజన్ ఫార్మాసూటికల్ కంపెనీ ప్రతినిధులు

ఆఫ్రికన్ లయన్ దత్తత

మదీన, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలో గల ఆరిజన్ ఫార్మాషూటికల్ కంపెనీ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా జవహర్‌లాల్ నెహ్రూ జూపార్క్‌లోని ఆఫ్రికన్ సింహాన్ని దత్తత తీసుకున్నారు. ఏడాదిపాటు లయన్ ఆహారం, ఎన్‌క్లోజర్ నిర్వహణ, వైద్యం తదితర ఖర్చులకు అవసరమయ్యే రూ.3లక్షల చెక్కును బుధవారం కంపెనీ ప్రతినిధులు అశుతోష్ అనిల్‌కొత్వాల్, ఎల్ఎస్ దీపక్, సత్యనారాయణ గిరిలు జూ క్యూరేటర్‌కు అందజేశారు. కంపెనీ తరఫున వరుసగా నాలుగోసారి ఈ సింహాన్ని దత్తత తీసుకున్నారు. వన్యప్రాణులను దత్తత తీసుకోవడానికి కార్పొరేట్ కంపెనీలు ముందుకు రావడం సంతోషకరమని జవహర్‌లాల్ నెహ్రూ జూపార్కు క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్.హిరెమత్ అన్నారు.

ఇదేనా.. ఫ్రెండ్లీ పోలీసింగ్

● సీపీ చెప్పినా.. చెవికెక్కించుకోని ఇన్‌స్పెక్టర్లు
● ఠాణాకు వెళ్తే చీదరింపులే..
● కొందరి తీరుతో కొత్త బాస్‌లకు తలనొప్పులు
● పోలీస్‌స్టేషన్ల ప్రక్షాళనకు కసరత్తు

హైదరాబాద్ సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): 'ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు పెద్దపీట వేస్తాం' తరచూ పోలీస్ బాస్‌లతో పాటు.. ప్రభుత్వంలోని పెద్దలు చెప్పే మాట ఇది. పోలీసులంటే ప్రజల్లో ఉన్న దురభిప్రాయాన్ని దూరం చేసేందుకు ఈ విధానాన్ని పక్కాగా అమలు చేయాలని భావించారు. కానీ, ఠాణాల్లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటోంది. నగరంలోని కొన్ని పోలీస్‌స్టేషన్లలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు కొత్త అర్థం చెబుతున్నారు. సాయం కోసం.. న్యాయం కోసం పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కిన వారి విషయంలో కాకుండా నేరస్థులతో కొందరు పోలీసులు చేతులు కలుపుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాసులు కురిపించే కేసులపై దృష్టి సారించి ప్రజల గోడు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

మర్యాద ఇవ్వరు..

పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, బాధితులతో పోలీసులు మర్యాదగా మాట్లాడాలి.. గౌరవం ఇవ్వాలి. బాధితులు ఏస్థాయి వారైనా.. 'సార్' అని సంబోధించాలి. ఓపికతో వారి బాధను, సమస్యలను వినాలి. అందుకు అనుగుణంగా ఫిర్యాదు రాసుకోవాలి.. అవసరమైతే సిబ్బంది రాసివ్వాలి. పోలీసులు తమకు కచ్చితంగా న్యాయం చేస్తారనే నమ్మకాన్ని కలిగించాలి. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ఇవీ ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో కొన్ని నిబంధనలు. అయితే, చాలా పోలీస్‌స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్ మొదలుకొని క్షేత్రస్థాయి సిబ్బంది, రిసెప్షనిస్టులు సహా ఎవరూ బాధితులను కనీసం సాటి మనిషల్లా కూడా చూడడం లేదు.



వైరల్ చేస్తే తప్పా...

సైబరాబాద్ కమిషనరేట్ పరిధి దేవేందర్‌నగర్‌లో ఓ వ్యక్తికి.. మహిళకు మధ్య వివాదం తలెత్తింది. అతను.. మరో వ్యక్తి మహిళపై దాడి చేశారు. బాధితురాలు సూరారం పోలీసులను ఆశ్రయించగా, వారు పట్టించుకోలేదు. దీంతో ఆమె సామాజిక మాధ్యమాల్లో పోలీసుల తీరుపై వివరిస్తూ వీడియో పోస్ట్ చేయగా, అది వైరల్ అయింది. వెంటనే పోలీసులు ఆమెను పిలిపించి, దాడి చేసిన వ్యక్తిపై పెట్టీ కేసు నమోదు చేశారు. నిందితులిద్దరూ.. ఓ పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తూ భూ దందాలు చేసే వ్యక్తికి అనుచరులు కావడంతో మహిళపై జరిగిన దాడిని పట్టించుకోలేదని ఆరోపణలు ఉన్నాయి.

ఇకపై అలా జరగదు..

'కొంతమంది పోలీసులు ఎవరికి వారు ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అర్థం మార్చేసి.. నేరస్థులతో ఫ్రెండ్లీగా ఉంటున్నారు' అని నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి స్వయంగా అన్నారంటే నగరంలో పోలీసుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోచ్చు. ఇకపై అలా జరగకూడదని.. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఒక్కరితో ఫ్రెండ్లీగా ఉంటారని హామీ ఇచ్చారు. కానీ, చాలా పోలీస్‌స్టేషన్లలో సీపీ మాటలు పెడచెవిన పెడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పోలీస్‌స్టేషన్ల స్థాయిలో కూడా ప్రక్షాళన చేయాలని కొత్త సీపీలు యోచిస్తున్నట్లు సమాచారం.

అర్ధరాత్రి వరకూ తిప్పి..

హబీబ్‌నగర్‌లో అదృశ్యం అయిన యువతి తస్లీం (22) మొయినాబాద్‌లో శవమై తేలింది. ఈ కేసులో పోలీసుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ నెల 8వ తేదీన యువతి అదృశ్యం కాగా, అదేరోజు ఆమె సోదరుడు హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. తన సోదరి కనిపించడం లేదని.. ఆమె ఫొటోను చూపించగా డ్యూటీలో ఉన్న పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆధార్ కార్డ్ ఉంటేనే కేసు ఫైల్ చేస్తామని చెప్పి.. తిప్పి పంపారు. రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా తీసుకోలేదు. రాత్రి 11 గంటల వరకు పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పారు. చివరకు బాధితుడు ఏసీపీకి ఫిర్యాదు చేస్తానని గట్టిగా చెప్పడంతో.. ఎస్ఐకి కోపం వచ్చి 'ఏసీపీకే కాదు.. నీ దిక్కున్నచోట చెప్పుకో పో' అంటూ స్టేషన్ నుంచి వెళ్లగొట్టారు. మరోసటి రోజు ఆ యువతి మొయినాబాద్ పరిసరాల్లో ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు వెంటనే స్పందించి ఉంటే ఆమె ప్రాణాలు దక్కేవి. ఈ విషయం సిటీ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డికి తెలియడంతో ఆయన ఎస్ఐపై సస్పెన్షన్ వేటు వేశారు. ఇన్‌స్పెక్టర్‌కు చార్జి మెమో జారీ చేశారు. స్టేషన్‌కు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. సిబ్బంది పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏవియేషన్ షో

(5వ పేజీ తరువాయి)



ఆవిష్కరణలను తెలుసుకునే అవకాశం కల్పించడంతోపాటు ఏవియేషన్ రంగంలో ఉపాధి అవకాశాలకు ఉపయుక్తంగా షోలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పౌర విమానయాన శాఖతో కలిసి, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫిక్కీ, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తోన్న ఈ షోలో దాదాపు 130 మంది ఎగ్జిబిటర్లు తమ ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. వీరితోపాటుగా విమానయాన సంస్థలు 15 హాస్పిటాలిటీ చాలెట్స్‌ను సైతం ఏర్పాటుచేయబోతున్నాయి. 106 దేశాల నుంచి 1500మంది డెలిగేట్లతోపాటుగా 5వేల మంది బిజినెస్ విజిటర్లు వస్తారని అంచనా వేస్తున్నారు. ఈ షోలో 20కు పైగా విమానాలు, హెలీకాప్టర్లను ప్రదర్శించ బోతున్నారు. వీటిలో హెచ్ఏఎల్, బోయింగ్, ఎయిర్‌బస్, బెల్ హెలికాప్టర్, పవన్ హన్స్ లిమిటెడ్, బంబార్డియర్, టెక్నామ్, బ్లూ రే లాంటి సంస్థలు తమ ఎయిర్‌క్రాఫ్ట్‌ను ప్రదర్శించబోతున్నాయి.

వినోదం పంచడానికి సారంగ్ టీమ్ సిద్ధం

ఈ ఏవియేషన్ షోలో నగరవాసులు కోరుకునే విన్యాసాలతో వినోదం పంచడానికి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన సారంగ్ టీమ్ సిద్ధమైంది. ఇప్పటికే నగరంలో హుస్సేన్ సాగర్ తదితర ప్రాంతాలలో ట్రయల్స్ పూర్తి చేసిన వీరు మొదటి రెండురోజులూ రెండేసి షోలు, చివరి రెండు రోజులూ మూడు షోల చొప్పున చేయనున్నారు. హెచ్ఏఎల్ తీర్చిదిద్దిన హెలికాప్టర్లతో విన్యాసాలు చేయనున్న సారంగ్ బృందంలో స్క్వాడ్రన్ లీడర్ అవినాష్, స్క్వాడ్రన్ లీడర్ కరణ్ (టీమ్ లీడర్), గ్రూప్ కెప్టెన్ ఎస్ కె మిశ్రా, వింగ్ కమాండర్ శ్రీధర్ కీలకంగా వ్యవహరిస్తున్నారు.

టికెట్ ధరలు ఇలా..

బిజినెస్ విజిటర్స్: రూ. 3000. దీనికి 18శాతం పన్నులు అదనం. (మొత్తం టికెట్ ధర రూ.3,540)

సందర్శకులకు: సామాన్యులకు బుక్ మై షోలో టికెట్లను అందిస్తున్నారు. ఈనెల 20, 21 తేదీలలో వీరికి అనుమతి ఉంటుంది. ఈ టికెట్ ధర రూ.885. ఉదయం 10 గంటలు, మధ్యాహ్నం 1.30 గంటలకు.. (రెండు షోలుగా టికెట్లు బుక్ మై షోలో లభిస్తున్నాయి)

పార్కింగ్ వసతి: సందర్శకుల కోసం సికింద్రాబాద్‌లోని బైసన్ పోలో గ్రౌండ్, వెస్లీ బాయ్స్ హాస్టల్ గ్రౌండ్స్‌లలో పార్కింగ్ వసతి కల్పించారు. అక్కడ నుంచి బస్‌లలో ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

పని చేస్తున్న ఇంటికే కన్నం

● రూ. 60 లక్షల విలువైన బంగారం, వజ్రాభరణాలతో ఉడాయింపు
● నిందితుడితో పాటు మరో ముగ్గురి అరెస్ట్
● సొత్తు స్వాధీనం..



కేసు వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్

రాయదుర్గం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పనిచేస్తున్న ఇంటినే దోచేసి సుమారు రూ. 60 లక్షల విలువైన బంగారం, వజ్రాభరణాలతో ఉడాయించాడు. చివరకు పోలీసులు ప్రధాన నిందితుడితో పాటు అతనికి సహకరించిన మరో ముగ్గురు దొంగలను అదుపులోకి తీసుకొని వారి నుంచి 963 గ్రాముల బంగారం, వజ్రాభరణాలను, రూ. 2.80 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ బుధవారం వెల్లడించారు. కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ముప్ప ఇంద్రప్రస్థాలోని ఓ విల్లాలో నివసించే సుజాత పనిమీద గత యేడాది డిసెంబర్ 21న ఢిల్లీ వెళ్లి అదే నెల 26న తిరిగి వచ్చారు. ఇంట్లో పనిచేసే చందన్, ఒడిస్సాకు చెందిన ప్రభాకర్ మల్లిక్(27)లకు ఇళ్లు అప్పగించి వెళ్లారు. ఆమె తిరిగి వచ్చిన నాటి నుంచి ప్రభాకర్ మల్లిక్ కనిపించకుండా పోయాడు. అలస్యంగా సుజాత తన ఇంట్లోని 75 తులాల బంగారం, వజ్రాభరణాలతోపాటు రూ.6.50 లక్షల నగదు చోరీ అయ్యాయని గుర్తించారు. సుజాత సూచన మేరకు ఆమె అసిస్టెంట్ వెంకట ప్రసాద్ కొల్లూరు పోలీసులకు ఈ నెల 9న పిర్యాదు చేశాడు. పోలీసు ల దర్యాప్తులో యజమానురాలు ఊరికి వెళ్లగానే ప్రభాకర్ మాలిక్ తనకు పరిచయం ఉన్న ముగ్గురిని విల్లాకు రప్పించుకొని పథకం ప్రకారం ఇంట్లోని డబ్బుతోపాటు లాకర్‌ను బద్దలు కొట్టి బంగారు, వజ్రాభరణాలు, నగదుతో ఉడాయించారని సీసీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. చోరీ చేసిన అనంతరం తనకు సహకరించిన వారికి కొంత నగదు ఇచ్చి వారిని స్వగ్రామానికి పంపించాడు. విఁగతా డబ్బులను తీసుకొని తాను ఇది వరకు పనిచేసిన కడప జిల్లా నంద్యాలకు వెళ్లి పోయాడు. దొగిలించిన బంగారం విక్రయించేందుకు గోపనపల్లికి తిరిగి వచ్చినట్లు కొల్లూరు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందటంతో వారు ప్రభాకర్ మల్లిక్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో మల్లిక్ ఇచ్చిన సమాచారం మేరకు అతడికి సహకరించిన ఒడిస్సాకు చెందిన జమ్మల మడుగు కడపలోని ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న తపన్ దాస్(32), గోపన్‌పల్లిలో నివాసం ఉంటూ కుక్‌గా పనిచేస్తున్న ఒడిస్సాకు చెందిన సచింద్ర దాస్(48), రతికంటా దాస్(26)లను అదుపులోకి తీసుకొని వారి నుంచి సొత్తును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. కేసును ఛేదించిన పోలీసులను అభినందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాదాపూర్ అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, మియాపూర్ ఏసీపీ నర్సింహా రావు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోయింది 750 గ్రాములు.. లభించింది 963 గ్రాములు..

పోయిన సొత్తు 75 తులాలు.. పోలీసులు స్వాధీనం చేసుకుంది 953 గ్రాముల బంగారు వజ్రాభరణాలు. పోలీసు రికార్డుల ప్రకారం నిందితులందరు నేర చరిత్ర లేని వారు కాగా.. నిందితుల వద్ద చోరీ అయిన బంగారం కన్నా ఎక్కువ మొత్తం లభించింది. నిందితులు ఇంకా ఎక్కడైన చోరీలు చేశారా లేదా ఫిర్యాదుదారులు ఇచ్చిన తులాల బంగారం అనేది కొన్ని ప్రాంతాల్లో 8 గ్రాముల బంగారాన్ని తులం అన్ని పిలుస్తారు అలాంటి కొలతల తికమక ఏమైనా ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమవుతున్న గోవులు..!

● ఆందోళనలో యజమానులు..! ● ఫిర్యాదులను పట్టించుకోని పోలీసులు..?

కుషాయిగూడ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లోని ఒకటో నంబరు కాప్రా సర్కిల్ పరిధిలోని శివారు ప్రాంతాలైన కాప్రా, చర్లపల్లి, కుషాయిగూడ పరిధిలో ఇటీవల ఆవులు కనిపించకుండా పోతున్నాయి. నగరంలో, శివారుల్లో ఇంకా కొన్ని కుటుంబాలు ఇప్పటికీ 'పాడి' ద్వారా జీవనోపాధి పొందుతున్నాయి. తమ ఇళ్ల వద్దనే పశువుల కొట్టం వేసుకొని గేదెలు, ఆవులు, కోళ్ల పెంచుతూ ఆదాయ వనరుగానే కాకుండా ఒక వ్యాపకంగా కూడా పాడిని పెంచుతున్నారు. అయితే, ఇలా పెంచుకుంటున్న ఆవులు, దూడలు, కోడెలు బయటకు మేతకు వెళ్లి సాయంత్రం దొడ్లోకి తిరిగి వస్తాయి. కూలీల కొరత కారణంగా వాటిని యథేచ్ఛగా వదిలి వేస్తుండడంతో ఒక్కోసారి రోజుల తరబడి అవి ఇంటికి రాకుండా ఉంటాయి. ఏ కూరగాయల మార్కెట్ దగ్గరో, ఖాళీగా ఉన్న బహిరంగ ప్రదేశాల్లోనో కనిపిస్తే యజమానులు వాటిని ఇంటికి తీసుకెళ్తుంటారు. అయితే, ఇటీవల ఆవులు కనిపించకుండా పోతున్నాయని పశువుల యజమానులు వాపోతున్నారు. ఆగంతకులు వాటిని అపహరించుకు పోతున్నారని, ఇతర రాష్ట్రాలకు పశువులను తరలించుకుపోతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.



గత నవంబరు నెలలో కనిపించకుండా పోయిన ఒంగోలు జాతి ఆవు (ఈ ఫొటోలోని కోడె గత వారం అదృశ్యమైంది)

● జమ్మిగడ్డ మారుతీ కాలనీలో నివసించే సాయిలు దశాబ్ద కాలం క్రితం వరకు వ్యవసాయం చేసేవారు. వయసు మీరడంతో పాటు వ్యవసాయ భూమి ప్లాట్లుగా మారడం, కూలీలు దొరకని పరిస్థితుల్లో కొన్ని పాడి పశువులతో కాలక్షేపం చేస్తున్నాడు. గత యేడాది నవంబరు నెలలో అతని ఒంగోలు జాతి ఆవు కనిపించకుండా పోయింది. దాదాపు రెండు నెలలుగా దాని ఆచూకీ కోసం ఆ కుటుంబ సభ్యులు తిరగని చోటంటూ లేదు. ఇంతలోనే మరో ఆవు, కోడె దూడ కనిపించకుండా పోవడంతో హతాశుడయ్యాడు. ఎవరికి చెప్పుకోవాలో దిక్కు తెలియని స్థితిలో వారం రోజులుగా పశువుల జాడ కోసం ఆ కుటుంబం వెతుకుతూనే ఉంది.

● కాప్రా నివాసి అల్లం రాజుది కూడా అదే పరిస్థితి. అతనికి ఆరు ఆవులు ఉండగా, గత సోమవారం రాత్రి ఇంటి ముందు కట్టేసిన ఆవులు మాయమయ్యాయి. మంగళవారం ఉదయం వాటి జాడ కోసం వెదుకుతుండగా, రెండు ఆవులు కాప్రా వెళ్లే దారిలో నాలా సమీపంలోని చెత్త కుప్పలో పడి వున్నాయి. ఏదో మత్తు మందు, ఇంజక్షన్ ఇవ్వడం మూలంగా సాయంత్రం వరకు కూడా అవి లేచి నిలుచోలేకపోయాయి. పశువులను తరలించుపోయే ఏదో ముఠా తమ నాలుగు ఆవులను ఎత్తుకు పోయారని సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళితే అక్కడి సిబ్బంది తమనే గదమాయించి పంపేశారని ఆయన వాపోయారు.

● చర్లపల్లి డివిజన్‌ను ఆనుకొని నాగారం మున్సిపాలిటీ పరిధిలో నివసించే సుబ్రహ్మణ్య స్వామి ఆవు కూడా ఇదే తరహాలో అదృశ్యమైంది. గత పదిహేను రోజులుగా ఆవు ఆచూకీ కోసం నానా అగచాట్లు పడుతున్నానని ఆయన వాపోయారు.

బ్యాడ్ బౌన్సర్స్..!

(5వ పేజీ తరువాయి)

కొంతమంది ప్రముఖులు భద్రత కోసం ఉపయోగిస్తుంటారు. ఆకారం చూసైనా బయటి వారు ఇబ్బంది కలిగించరనే ఉద్దేశంతో వీరిని నియమించుకుంటుంటారు. ఒక్కో బౌన్సర్‌కు రోజుకు వెయ్యినుంచి రెండు వేల రూపాయల ఇచ్చేవారు. కాలక్రమేణ బౌన్సర్‌లను నియమించుకోవడం స్టేటస్ సింబల్‌గా మారింది. చిన్నపాటి ఫంక్షన్ జరిగినా, భారీ సభ నిర్వహించినా అందులో బౌన్సర్లను నియమించుకోవడం నగర వాసులకు ఫ్యాషన్‌గా మారింది. వివాహాది శుభకార్యాల్లో పది మంది బౌన్సర్లకు రూ.20-30వేల వరకు ప్యాకేజీ ఇచ్చి నియమించుకుంటున్నారు. స్టేజీ మీద నిలబడి వధూవరులను కలిసే బంధుమిత్రులను నియంత్రించడం, భోజనాల ప్రక్రియ క్రమ పద్ధతిగా జరిగేలా చూడటంతో పాటు ప్రముఖులు వచ్చినా.. కాస్త హడావుడి చేయడం బౌన్సర్‌ల పని. ఇక షోరూంల ప్రారంభోత్సవానికి తరలి వచ్చే సినీ తారల రక్షణ కోసం బౌన్సర్‌లను విరివిగా ఉపయోగిస్తున్నారు. సినీ ప్రముఖుల రక్షణ పేరుతో అనేక సందర్భాల్లో సామాన్య ప్రజలపై దౌర్జన్యం చేసిన ఘటనలున్నాయి. పలు పోలీసుస్టేషన్‌లలో కేసులు కూడా నమోదయ్యాయి.

గతంలోనూ దాడులు..

గతేడాది జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు 36లో అమ్నీషియా పబ్‌లో కూడా ఇదే జరిగింది. మద్యం మత్తులో ఉన్న యువకుడు బాత్‌రూంలో టిష్యూ పేపర్‌లు కింద పడేసినందుకు బౌన్సర్లు దాడి చేసి దుర్భషలాడారు. గతంలో కూడా ఆ పబ్‌లో బౌన్సర్లు దౌర్జన్య కాండను కొనసాగించారు. 2016లో ఇదే పబ్ బౌన్సర్లపై నాలుగు కేసులు నమోదు అయ్యాయి. అంతకుముందు జూబ్లీ 800 పబ్‌లో నలుగురు యువకులను చితక బాదిన బౌన్సర్లను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అంతకుముందు టికిషా, హార్డ్‌కప్ లాంటి పబ్‌లలో కూడా బౌన్సర్లు విర్రవీగిపోయారు. దాదాగిరి చెలాయించారు. మత్తులో ఉన్న అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సంఘటనలు కూడా అనేకం ఉన్నాయి. చేతిలో కర్రలు పట్టుకుంటూ హూంకరిస్తున్నారని పార్టీప్రియులు చెబుతున్నారు. కొంతమంది అక్రమంగా కంట్రీ మేడ్ పిస్తోల్‌లతో పబ్‌లో విధులు నిర్వహిస్తున్నారని ఆరోపణలు లేకపోలేదు. దాడులు జరుగుతునప్పటికీ పోలీసులు కేవలం చిన్నపాటి కేసులు నమోదు చేసి వదిలేయడంతో బౌన్సర్లు మరింత రెచ్చిపోతున్నారు.

మరో నిమిషంలో ఇల్లు చేరుతామనే లోపే..

(5వ పేజీ తరువాయి)

అక్కడిక్కడే మృతి చెందగా.. సంజీవ తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే అతన్ని 108లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చందర్‌సింగ్ తెలిపారు.

కన్నీరు మున్నీరైన కుటుంబీకులు

ఇంటి సమీపంలోనే పాలవ్యాను మృత్యువు రూపంలో మనోజ్‌ను కబళించడంతో కుటుంబ సభ్యుల రోదన అందరిరనీ కలిచి వేసింది. కృష్ణకు మనోజ్ ఒక్కగానొక్క కుమారుడు కావడంతో ఆ తల్లిదండ్రుల రోదన ఆపడం ఎవరితరం కాలేదు. గండిపల్లి సంజీవ ఇటీవల చదువు మానేశాడు. సంతోషంగా సంక్రాంతి పండగ జరుపుకున్న ఆ రెండు కుటుంబాలలో తీవ్ర విషాదం నెలకొంది.

పరధ్యానాన్ని పక్కన పెట్టొచ్చు

● హెచ్‌సీయూ పరిశోధనలో వెల్లడి

హైదరాబాద్ సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మెదడులోని విద్యుత్ సిగ్నల్స్ మార్పు కారణంగా నిజ జీవితంలో జరుగుతున్న సంఘటనలు పట్టించుకోకుండా వేరే ఆలోచన లేదా వేరే ధ్యాసలోకి మెదడు వెళుతుందని హెచ్‌సీయూ పరిశోధక బృందం గుర్తించింది. ఉదాహరణకు మనం రోడ్డు దాటుతున్న సమయంలో మనం ఏం ఆలోచిస్తున్నా మెదడు మాత్రం వాహనాల నుంచి వచ్చే వెలుగు, హారన్ (శబ్దాలు)లపై దృష్టి కేంద్రీకరిస్తూ పనిచేస్తుంది. ఒకవేళ రోడ్డు దాటడం సులభం అయిన సందర్భంలో మెదడు వేరే ఆలోచనల కోసం శక్తిని వెచ్చిచడంతో పరధ్యానం వస్తుంది. ఈ సమయంలో రోడ్డుపై వాహనాల శబ్దాలు, వెలుతురును మెదడు నిర్లక్షం చేస్తుందని హెచ్‌సీయూ పరిశోధకులు గుర్తించారు. మెదడుకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం ద్వారా పరధ్యానాన్ని తగ్గించుకోవచ్చని సీఎన్‌సీఎస్ హెడ్ ప్రొఫెసర్ రమేష్ కుమార్ మిశ్రా, జర్మనీ మరియారిచీ పోస్ట్‌డాక్టోరియల్ ఫెలో డాక్టర్ సీమా ప్రసాద్‌ల పర్యవేక్షణలో హెచ్‌సీయూ పీహెచ్‌డీ విద్యార్థి వైష్ణవీ మోహితే తమ పరిశోధనల్లో గుర్తించారు. ఈ పరిశోధనల ఫలితాలను అమెరికాలోని సైకోనోమిక్ సొసైటీ పరిశోధనల్లో ప్రచురించారు.

హైదరాబాద్‌లో ప్రారంభమైన ఎంఆర్‌సీఎస్ పరీక్షలు

● వివిధ రాష్ట్రాల నుంచి హాజరుకానున్న 240 మంది సర్జికల్ ట్రైనీలు



ఇంగ్లండ్, మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి వచ్చిన ప్రముఖులు

హైదరాబాద్ సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్(ఇంగ్లండ్)లో సభ్యత్వం కోసం నిర్వహించే ఎంఆర్‌సీఎస్ పరీక్షలను హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని కిమ్స్ డైరెక్టర్ డైరెక్టర్ రఘురాం తెలిపారు. బుధవారం నుంచి ఈనెల 22 వరకు ఎంఆర్‌సీఎస్ పరీక్షలు జరగనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షల నిర్వహణ నిమిత్తం యూకే, మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి 35మంది ప్రముఖులు ఇండియాకు వచ్చారని, ఈ పరీక్షలు రాసేందుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి మొత్తం 240మంది సర్జికల్ ట్రైనీలు హైదరాబాద్ వస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శస్త్రచికిత్సలో పరిజ్ఞానం, అనుభవం, కోర్ క్లినికల్ సామర్థ్యాన్ని ఎంఆర్‌సీఎస్ పరీక్షల ద్వారా అంచనా వేసి, అర్హులైన వారికి అత్యున్నత గుర్తింపు ఇవ్వడమే ఎంఆర్‌సీఎస్ పరీక్ష ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు.

ఎక్కువగా తింటే జీడిపప్పు ప్రమాదమే!

కోవిడ్ తర్వాత బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలనే ఉద్దేశంతో అనేక మంది జీడిపప్పులను తినటం ప్రారంభించారు. అయితే ఈ జీడిపప్పు వల్ల కూడా అనేక రకాల దుష్పరిణామాలు ఉన్నాయని పోష్టికాహార నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అలర్జీలు

కొందరికి జీడిపప్పు తింటే పడదు. చర్మంపై దద్దుర్లు వస్తాయి. కొందరికైతే కళ్లు తిరిగినట్లు అవుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనాల ఆధారంగా చూస్తే- మొత్తం జనాభాలో 0.5 నుంచి ఒక శాతం మందికి జీడిపప్పు అలర్జీ ఉంది.

అజీర్తి

జీడిపప్పులో కొవ్వు, ఫైబర్‌లు ఎక్కువగా ఉంటాయి. దీని వల్ల అరుగుదల చాలా కష్టమవుతుంది. జీడిపప్పును ఎక్కువగా తింటే గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. అజీర్తి చేస్తుంది.

బరువు పెరుగుతారు

ఒక గుప్పెడు జీడిపప్పులో 160 కేలరీలు ఉంటాయి. ప్రతి రోజు వీటిని ఎక్కువగా తింటే బరువు పెరుగుతారు. బరువు తగ్గాలనుకొనే వారు జీడిపప్పును తినటం పూర్తిగా మానేస్తే మంచిది.

బ్లడ్ సుగర్ పెరుగుతుంది



జీడిపప్పు గ్లైసిమిక్ ఇండెక్స్ విలువలు తక్కువే! దీని ప్రకారం చూస్తే- వీటిని తిన్న వెంటనే బ్లడ్ సుగర్ పెరగకూడదు. అయితే తాజాగా చేసిన అధ్యయనాలలో జీడిపప్పును తిన్న వెంటనే బ్లడ్‌సుగర్ పెరుగుతుందని తేలింది. అందువల్ల మధుమేహం ఉన్నవారు జీడిపప్పును ఎక్కువగా తినకూడదు.

ప్రమాదకరమైన తొక్క

తొక్క తీయని జీడిపప్పులో ఉరిషివోల్ అనే ఒక విష పదార్థం ఉంటుంది. అందువల్ల జీడిపప్పు తొక్క తగిలితే చర్మం ఎర్రబడుతుంది. దురద పెడుతుంది. అందువల్ల జీడిపప్పు తొక్కను వలిచేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలి.

పచ్చివి తినవద్దు..

పచ్చి జీడిపప్పులో ఫైటిక్ యాసిడ్ అనే పదార్థం ఉంటుంది. ఈ పదార్థం కాల్షియం, ఐరన్, జింక్ మొదలైనవి శరీరంలోకి చేరకుండా అడ్డుపడుతూ ఉంటుంది. అందువల్ల పచ్చి జీడిపప్పు తినటం మంచిది కాదు. నానబెట్టిన లేదా వేయించిన జీడిపప్పులో ఇది తక్కువగా ఉంటుంది. అందువల్ల వేయించిన లేదా నానబెట్టిన జీడిపప్పు తినటం మంచిది.

కిడ్నీ స్టోన్స్

జీడిపప్పులో ఆక్సలేట్స్ అనే కాంపౌండ్స్ ఉంటాయి. ఇవి శరీరంలో ఎక్కువగా చేరితే కిడ్నీలలో రాళ్లు ఏర్పడతాయి.

మృదువైన చర్మానికి కాకరకాయ!

నిగనిగలాడే మృదువైన చర్మం కావాలని అందరూ కోరుకుంటారు. ఇలాంటి చర్మం కోసం రకరకాలైన క్రీములు కూడా రాస్తూ ఉంటారు. ఈ క్రీములతో పాటుగా ఈ కింది ఆహారపదార్థాలు తినటం వల్ల ప్రయోజనాలు ఉంటాయంటున్నారు నిపుణులు. ఆ ఆహార పదార్థాలేమిటో చూద్దాం.

పుదీనా

పుదీనాను ఎక్కువగా తినటం వల్ల చర్మం నిగనిగలాడుతుంది. దీనిలో ఉండే రోజ్‌మేరినిక్ యాసిడ్ వల్ల శరీరంలోని రక్త ప్రసారం బాగా పెరుగుతుంది. దీని వల్ల చర్మం మృదువుగా అవుతుంది. పుదీనా ఆకులు చర్మ సంబంధ వ్యాధుల నివారణకు కూడా ఉపకరిస్తాయి.

కాకరకాయ

కాకరకాయను తినటం కష్టమే! అయితే కాకరలో మనకు ఉపకరించే విటమిన్‌ఈ, విటమిన్ సీ, కెరోటిన్ వంటి అనేక పదార్థాలు ఉన్నాయి. మన శరీరంలోని చర్మకణాలపై ఫ్రీరాడికల్స్ దాడి చేయకుండా ఇవి కాపాడుతూ ఉంటాయి.

నేరేడు పండు



చర్మాన్ని కాపాడే క్విర్‌సిటిన్, ఎలాజిక్ అనే రెండు యాసిడ్‌లు దీనిలో ఉన్నాయి. ఇవి మన చర్మాన్ని- యూవీ కిరణాల నుంచి కాపాడుతూ ఉంటాయి. నేరేడు పండు చర్మంపై ఉండే ఎర్రమచ్చలను కూడా పోగొడుతుంది.

ఉసిరి

చర్మం ఎండిపోకుండా.. నిగనిగలాడుతూ ఉండటానికి కొలేజిన్ అనే పదార్థం చాలా ముఖ్యం. దీని తయారీలో ఫైబ్రోబ్లాస్ట్ అనే పదార్థాలు ఉపకరిస్తాయి. ఇవి మన శరీరానికి తగినంత అందటంలో ఉసిరి కీలకమైన పాత్ర పోషిస్తుంది.

సెలబ్ ఫిట్

'బాసూ వేరీజ్ ద పార్టీ...' అంటూ మెగాస్టార్‌తో కలిసి ఇచ్చిన డ్యాన్స్ పార్టీతో తొలిసారి తెలుగు తెరపై మెరిసింది ఊర్వశీ రౌతెలా. ఆ 'ప్రత్యేక పాట'తో టాలీవుడ్‌లో మరికొన్ని అవకాశాలూ దక్కించుకుంది. మోడల్‌గా మొదలుపెట్టి... అందాల రాణి సింహాసనం అధిష్టించి... నటిగా అడుగులు వేస్తున్న ఊర్వశి... పేరుకు తగ్గట్టుగానే నవయవ్వనంతో యువతరాన్ని సమ్మోహితులను చేస్తోంది. వెండితెర వెలుగులకే పరిమితం కాకుండా... అభిమానులకు ఫిట్‌నెస్ లక్ష్యాలు నిర్దేశించి... వారిని ఆరోగ్యకర జీవన విధానం వైపు నడిపిస్తోంది.



ఊర్వశివో..!

పదిహేనేళ్లప్పుడు 'విల్స్ ఫ్యాషన్ వీక్'లో క్యాట్‌వాక్‌తో అలరించిన ఊర్వశీ రౌతెలా మొట్టమొదటి లక్ష్యం... మోడల్‌గా ఎదగడం. అనుకున్నట్టుగానే ఆ ఫ్యాషన్ షో.. ఆమెను తిరుగులేని మోడల్‌ను చేసింది. 2009లో 'మిస్ టీన్ ఇండియా' టైటిల్ నెగ్గింది. ప్రతిష్టాత్మక 'లాక్మే ఫ్యాషన్ వీక్'లో షో స్టాపర్‌గా మురిపించింది. తరువాత జరిగిన అమెజాన్, బాంబే, దుబాయ్ ఫ్యాషన్ వీక్స్‌లోనూ ఆ జోరు కొనసాగింది. 2011లో 'ఇండియన్ ప్రిన్సెస్', 'మిస్ ఏషియన్ సూపర్‌మోడల్'గా నిలిచింది. అదే ఏడాది చైనాలో జరిగిన 'మిస్ టూరిజమ్ క్వీన్ ఆఫ్ ద ఇయర్' కిరీటం దక్కించుకుని, ఆ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా చరిత్ర సృష్టించింది. ఇవన్నీ చూసి బాలీవుడ్ పిలిచినా... 'మిస్ యూనివర్స్' పోటీల కోసం అవకాశాలను పక్కన పెట్టింది. 2012లో 'ఐయామ్ షి- మిస్ యూనివర్స్ ఇండియా' టైటిల్‌తో పాటు 'మిస్ ఫొటోజెనిక్' అవార్డు కూడా ఊర్వశి గెలుచుకుంది. అయితే అందుకు తగిన వయసు లేకపోవడంవల్ల ఆ కిరీటాన్ని వదులుకోవాల్సి వచ్చింది.

అయితే ఊర్వశి పట్టు విడవలేదు. 2015లో పోటీపడి విజేతగా నిలిచింది. అదే సంవత్సరం భారత్ తరుపున 'మిస్ యూనివర్స్'కు పోటీ పడింది. దీనికి ముందే... అంటే 2013లో మరోసారి బాలీవుడ్ ఊర్వశి తలుపు తట్టింది. సన్నీడియోల్ పక్కన ప్రాధాన్యం ఉన్న పాత్ర కావడంతో ఓకే చెప్పింది. అలా 'సింగ్ సాబ్ ద గ్రేట్' ద్వారా వెండితెరకు పరిచయమైన ఆమె... ఇక అప్పటి నుంచి ఖాళీగా ఉన్నది లేదు. వెంటనే 'యోయో హనీసింగ్' ఇంటర్నేషనల్ ఆల్బమ్ 'లవ్ డోస్'లో ఆడి పాడింది. ఒక్క హిందీ చిత్రాలకే పరిమితం కాకుండా... దక్షిణాది నుంచి వచ్చిన ఆఫర్లకూ ఓకే చెప్పింది. ఇప్పటికి అన్నీ కలిపి ఓ ఇరవై చిత్రాలు ఆమె ఖాతాలో ఉన్నాయి. ఇవి కాకుండా ఎన్నో ప్రముఖ బ్రాండ్ల యాడ్ షూటింగ్‌లతో ఎంతో బిజీ అయిపోయింది.

ఉత్తరాఖండ్ హరిద్వార్‌లో పుట్టిన ఊర్వశి సొంత పట్టణం కోట్‌ద్వార్. అక్కడి 'జోసెఫ్స్ కాన్వెంట్'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె.. ఢిల్లీ 'గార్గి కాలేజీ' నుంచి డిగ్రీ పట్టా పొందింది. 'హేట్ స్టోరీ-4'లో విభిన్నమైన పాత్ర పోషించి ప్రశంసలు అందుకున్న ఈ భామ... 'వాల్తేరు వీరయ్య'తో ప్రత్యేక పాటల తారగా తెలుగులో అవకాశాలు పట్టేస్తోంది. మోడల్‌గా గ్లామర్ ప్రపంచంలోకి అడుగుపెట్టి... నటిగా వరుస అవకాశాలు దక్కించుకొంటున్న ఊర్వశిని చూడగానే పాలరాతి శిల్పం గుర్తుకువస్తుంది. ఇది ఆమె అభిమానుల మాట. గమ్మత్తయిన చూపు... మైమరిపించే రూపు... మేని మెరుపు... పదిహేనేళ్ల కిందట కెరీర్ ఆరంభంలో ఎంతలా ఆకర్షణీయంగా కనిపించిందో... ఇప్పుడూ అంతే అందంగా... సౌందర్య రాశిలా అలరిస్తోంది. 'ఏవిటి మీ రహస్యం' అని అడిగితే... 'ఆహార నియమాలే నన్ను ఇంత ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంచుతున్నాయి' అంటుంది ఊర్వశి. ఆమె పాటించే ఆహార నియమాలు, చేసే వ్యాయామాలు ఏంటో ఓ లుక్కేద్దాం రండి.

ఇదీ మెనూ...

ప్రొటీన్స్, కార్బొహైడ్రేట్స్, హెల్దీ ఫ్యాట్స్‌తో కూడిన సమతుల ఆహారం తీసుకొంటుంది ఊర్వశి. క్రమం తప్పని వ్యాయామంతో పాటు ఆహార నియమాలను కచ్చితంగా పాటిస్తుంది. ప్రాసెస్డ్, జంక్ ఫుడ్స్, షుగర్ ముట్టుకోదు. ఆమె మెనూలో అధికశాతం గుడ్లు, చికెన్, ఫిష్, తాజా కూరగాయలు, పండ్లు, నట్స్ ఉంటాయి. సెలబ్రిటీ న్యూట్రిషనిస్ట్ శ్వేతా షా... ఆమెకు ఆయుర్వేదంలో సూచించిన ఆహారం అందిస్తారు. ఎంతోమంది బాలీవుడ్ స్టార్లు, క్రికెటర్లకు న్యూట్రిషనిస్టుగా వ్యవహరిస్తున్నారు శ్వేతా. 'మూడేళ్ల కిందట మొదటిసారి ఊర్వశిని కలిశాను. తన చర్మం, శిరోజాల ఆరోగ్యం గురించి అప్పట్లో తను ఆందోళన పడుతుండేది. నిజానికి తనది చక్కని చర్మం. అంతకంటే ఆరోగ్యకరమైన జుట్టు. అధిక సమయం ఎండలో తిరగడం, కెమికల్ ట్రీట్‌మెంట్ల వల్ల అవి సహజత్వం కోల్పోయాయి. యాంటీఆక్సిడెంట్స్, సరైన హైడ్రేషన్, డీటాక్సిఫయింగ్ జ్యూస్‌లతో కూడిన ఆయుర్వేద ఆధారిత డైట్ ప్లాన్ సూచించాను' అని ఓ ఇంటర్వ్యూలో శ్వేత వెల్లడించారు. ఊర్వశి మెనూలో ప్రధానంగా మిల్లెట్స్, నెయ్యి, పండ్ల రసాలు ఉంటాయి.

- వర్కవుట్ తరువాత తీసుకొనే బ్రేక్‌ఫాస్ట్‌లో అత్యధిక పోషకాలు, శక్తినిచ్చే ఆహారం ఉండేలా డిజైన్ చేశారు శ్వేత. గుడ్లు, ప్రొటీన్ షేక్ లేదంటే మొలకెత్తిన విత్తనాలతో పోహా. ఏదైనా సరే... ఇంటి నుంచి వచ్చిన ఆహారమే తీసుకొంటుంది ఊర్వశి.
- భోజనానికి ముందు కొద్దిగా పండ్లు. ద్రాక్ష, స్ట్రాబెర్రీ ఊర్వశికి ఇష్టమైన పండ్లు.
- మధ్యాహ్న భోజనంలో ఇంటి నుంచి వచ్చిన రోటీ, సబ్జీ, గ్రీన్ సలాడ్.
- రాత్రి భోజనం మాంసకృత్తులతో నిండి ఉంటుంది. దూది ముథియాస్ (గుజరాతీ వంటకం) లేదా పనీర్‌తో గ్రిల్డ్ చికెన్ లేదా ఫిష్.
- ఊర్వశికి పరాఠా ఎంతో ఇష్టం. అయితే మైదా, గోధుమ పిండి కాకుండా మిల్లెట్స్‌తో చేసిన పరాఠాలను ఊర్వశికి పరిచయం చేసింది శ్వేత. అలాగే అన్నానికి బదులు కాలీఫ్లవర్ రైస్‌ను ఉపయోగిస్తుంది. ఇవి కాకుండా కొరియాండర్ జ్యూస్ వారానికి ఒకసారి. ఇది డీటాక్సిఫై చేస్తుంది.



వర్కవుట్ ఇలా...

ఇంటి నుంచి అడుగు బయటకు పెట్టిన ప్రతిసారీ విభిన్నమైన లుక్స్‌తో ఆశ్చర్యపరుస్తుంది ఊర్వశి. ఆమె శరీరాకృతికి తగిన డ్రెస్సింగ్‌తో... ఎప్పటికప్పుడు ట్రెండీ ఫ్యాషన్ దుస్తుల్లో ఆహా అనిపిస్తుంది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా... ఇన్‌స్టాగ్రామ్‌లో తరచూ వర్కవుట్ వీడియోలు అప్‌లోడ్ చేస్తూనే ఉంటుంది. దానిద్వారా వ్యాయామాన్ని తమ జీవనశైలిలో భాగం చేసుకొనే దిశగా అభిమానుల్లో ప్రేరణ కలిగిస్తుంది. ఊర్వశికి ఇన్‌స్టాలో డెబ్బై లక్షల మందికి పైగా ఫాలోవర్స్. ఏ పోస్టు పెట్టినా క్షణాల్లో లక్షల్లో లైక్‌లు వచ్చి పడతాయి. వారానికి కనీసం మూడు రోజులు జిమ్‌కు వెళ్లే ఊర్వశి వ్యాయామాల్లో యోగా, నాట్యం కూడా మిళితమై ఉంటాయి.

- ఉదయం లేవగానే యోగా, ప్రాణాయామం. యోగావల్ల కండరాలు దృఢంగా మారతాయి. ఫ్లెక్సిబిలిటీ పెరుగుతుంది. ధ్యానంతో మానసిక ప్రశాంతత, ఏకాగ్రత కుదురుతాయి. ఒత్తిడి మాయమవుతుంది. ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. శరీరానికి కావల్సినంత ప్రాణవాయువు అందుతుంది.
- 20 నిమిషాలపాటు ట్రెడ్‌మిల్ తదితర కార్డియో వ్యాయామాలు
- స్ట్రెంత్ ట్రైనింగ్‌లో బెంచ్ ప్రెస్, డంబెల్ ప్రెస్, వెయిట్‌లిఫ్టింగ్, పిలేట్స్ క్రంచెస్, ప్లాంక్స్, పుషప్స్, స్క్వాట్స్, లంగెస్
- అదనపు కేలరీలు కరగడానికి డ్యాన్స్

మంచి చేసే మెగ్నీషియం!

మన శరీరానికి అవసరమైన ఏడు ముఖ్యమైన లవణాలలో మెగ్నీషియం కూడా ఒకటి. మన శరీరంలో జరిగే బయోకెమికల్ చర్యలను నియంత్రించటానికి అవసరమయ్యే సుమారు 300 ఎంజైమ్‌లను ఉత్పత్తి చేయటంలో మెగ్నీషియం కీలకమైన పాత్ర వహిస్తుంది. ఇలాంటి మెగ్నీషియం మన శరీరంలో ఉత్పత్తి కాదు. కేవలం మనం తినే ఆహారం నుంచే లభ్యమవుతుంది. మెగ్నీషియం మన శరీరంలో ఏఏ చర్యలకు ఉపకరిస్తుందో తెలుసుకుందాం.


ఎముకల పటుత్వానికి

మన శరీరంలోని 60 శాతం మెగ్నీషియం ఎముకలలోనే ఉంటుంది. మెగ్నీషియం విలువలు తక్కువ అయితే ఎముకలు గుల్లబారిపోతాయి. తరచు గాయాలవుతూ ఉంటాయి. రక్తంలో మెగ్నీషియం విలువలు తక్కువగా ఉంటే- రకరకాల ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి.

అజీర్తిని హరించటానికి

మెగ్నీషియం వల్ల అజీర్తి సమస్యలు తొలగిపోతాయి. మెగ్నీషియం మలాన్ని మృదువుగా చేసి బయటకు పంపటంలో కీలకమైన పాత్ర వహిస్తుంది. తీవ్రమైన అజీర్తి సమస్య ఉన్నవారు 28 రోజులు మెగ్నీషియం సప్లిమెంట్స్‌ను వాడితే - ఆ సమస్య తొలగిపోతుంది.

మానసిక ఆరోగ్యం కోసం..



రకరకాల మానసిక సమస్యలకు మెగ్నీషియం సరైన మోతాదులో లేకపోవటమే ప్రధాన కారణమని చెప్పవచ్చు. ఆందోళన, అలజడి, ఒత్తిడికి లోనుకావటం వంటి సమస్యలకు మెగ్నీషియం కూడా ఒక కారణమని నిపుణులు పేర్కొంటున్నారు.

నిద్ర కోసం..

మెగ్నీషియం సరైన మోతాదులో లేకపోతే నిద్ర సరిగ్గా పట్టదు. అంతే కాకుండా నిద్రపోయే విధానంలో కూడా మార్పు వస్తుంది. అందువల్ల సరిగ్గా నిద్ర పట్టనివారు మెగ్నీషియం విలువలను పరీక్షించుకోవటం మంచిది.


మైగ్రేన్‌కు మంచి మందు..

మైగ్రేన్ తగ్గటానికి మెగ్నీషియం మంచి మందు. తాజా పరిశోధనల ప్రకారం- మెగ్నీషియం ఇంజెక్షన్లు 15 నుంచి 30 నిమిషాలలో మైగ్రేన్‌ను తగ్గిస్తాయి.

మధుమేహ నియంత్రణలో కూడా..

ఇన్సులిన్ నియంత్రణలో మెగ్నీషియం కీలకమైన పాత్ర పోషిస్తుంది. మెగ్నీషియం విలువలు సక్రమంగా లేకపోతే- మధుమేహ నియంత్రణ సాధ్యం కాదు. అంతే కాకుండా ఇన్సులిన్‌ను సమర్థంగా ఉపయోగించుకోవటంలో కూడా మెగ్నీషియందే ముఖ్యమైన పాత్ర!

కౌన్సెలింగ్



పెదవుల మీద పుండ్లు ఎందుకు?

డాక్టర్! గత కొన్ని రోజులుగా నా పెదవుల మీద పుండ్లు ఏర్పడి పైపూత మందులు వాడుతున్నా తగ్గడం లేదు. నాలుగు నెలల క్రితం సురక్షిత పద్ధతులు పాటించకుండా అపరిచిత వ్యక్తితో లైంగికంగా కలిశాను. ఈ పుండ్లు ఏదైనా సుఖ వ్యాధికి సూచనలా?

- ఓ సోదరి, మిర్యాలగూడ

పెదవులు మీద పుండ్లు హెర్పిస్ వ్యాధి లక్షణం. హెర్పిస్ సింప్లెక్స్ వైరస్ సోకితే పెదవులు, ముఖం, ఛాతీ, వేళ్ల మీద పుండ్లు ఏర్పడతాయి. అలాగే జననావయవాల చుట్టూ నీటి బొబ్బలు కూడా తలెత్తుతాయి. ఈ వ్యాధిని త్వరగా గుర్తించి చికిత్స అందించకపోతే కళ్లు, మెదడు ఇన్‌ఫెక్షన్లకు లోనవుతాయి. హెర్పిస్ సింప్లెక్స్ వైరస్‌లలో రకాలు కూడా ఉన్నాయి. హెర్పిస్ సింప్లెక్స్ 1 అనే వైరస్ సోకితే, లక్షణాలు నడుము పై భాగంలో కనిపిస్తాయి. ఈ వైరస్ లైంగికంగా కలవకపోయినా, ముద్దులు పెట్టుకోవడం, వస్తువులను షేర్ కోసుకోవడం వల్ల కూడా ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. హెర్పిస్ సింప్లెక్స్ 2 అనే వైరస్ లక్షణాలు నడుము కింది భాగంలో బయల్పడతాయి. ఈ వైరస్ లైంగిక కలయిక ద్వారానే సంక్రమిస్తుంది. కాబట్టి హెర్పిస్ ఉన్న వ్యక్తితో ఏ రకంగా సన్నిహితంగా మెలిగినా ఏదో ఒక హెర్పిస్ రకం వైరస్ కచ్చితంగా సోకుతుంది. హెర్పిస్ వ్యాధిని యాంటీవైరస్ మందులతో తగ్గించవచ్చు. కానీ ఈ వ్యాధిని సమూలంగా నిర్మూలించడం సాధ్యం కాదు. కాబట్టి వీలైనంత త్వరగా వైద్యులను సంప్రతించి వ్యాధి మరింత ముదిరిపోకుండా నియంత్రించుకోండి.

డాక్టర్ షర్మిలా మజుందార్,
సెక్సాలజిస్ట్ అండ్ సైకో అనలిస్ట్, హైదరాబాద్

బొద్దుగా ఉంటే ముద్దుగా ఉంటారేమోకానీ, అందాల పోటీలకు పనికి రారు అనుకోవడం పొరపాటని నిరూపించింది కర్ణాటకుకు చెందిన జేన్ దీపిక గ్యారెట్. గత ఏడాది మిస్ నేపాల్‌గా గెలిచిన జేన్, 2023 మిస్ యూనివర్స్ పోటీలో పాల్గొన్న మొట్టమొదటి ప్లస్ సైజ్ అభ్యర్థిగా గుర్తింపు పొందింది. ఆవిడ గురించిన మరిన్ని విశేషాలు.

ప్లస్ సైజ్ బ్యూటీ

"ఐదడుగుల ఏడంగుళాల ఎత్తు, 80 కిలోల బరువుతో అందం ప్రమాణాలను అందుకోలేని నేను ఈ పోటీలో పాల్గొనడం వెనకొక ప్రధాన ఉద్దేశం ఉంది. అధిక బరువు, హార్మోన్ సమస్యలతో బాధపడే మహిళలకు ప్రాతినిధ్యం వహించడం కోసమే నేనీ పోటీలో పాల్గొని గెలిచాను. లావుగా ఉన్నంత మాత్రాన అందవిహీనంగా ఉన్నామని భావించవలసిన అవసరం లేదు. అధిక బరువుతో కూడా అందంగా కనిపించే వీలుంది అనడానికి నా గెలుపే ఒక ఉదాహరణ" అంటూ గత ఏడాది మిస్ నేపాల్‌గా గెలుపొందిన సందర్భంగా జేన్ ఇలా తన అభిప్రాయాన్ని మీడియాతో పంచుకుంది. 23 ఏళ్ల జేన్ అమెరికాలో పుట్టిన నేపాలీ మోడల్. మిస్ యూనివర్స్ 2023 టాప్ 20 జాబితాలో చోటు దక్కించుకున్న జేన్, ఈ పోటీలో సెమి ఫైనల్స్‌కు చేరిన మొట్టమొదటి ప్లస్ సైజ్ యువతిగా పేరు తెచ్చుకుంది.

అభద్రతను వదిలించి....

వృత్తిపరంగా నర్సు అయిన జేన్, మహిళల్లోని హార్మోన్ల హెచ్చుతగ్గులు, అవి మహిళల మానసిక ఆరోగ్యంపై చూపించే ప్రభావాల గురించి ప్రపంచానికి చాటి చెప్పడం కోసం తాను మిస్ యూనివర్స్ పోటీలో పాల్గొన్నానని అంటోంది. జేన్ తానెదుర్కొన్న ఆరోగ్య సమస్యల గురించి బహిరంగంగా మాట్లాడింది. ఆవిడ పాలీసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్ వల్ల విపరీతమైన డిప్రెషన్‌కు లోనైంది. అయినప్పటికీ ఓ పక్క కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటూ, తనకున్న ప్యాషన్‌కొద్దీ అందాల ప్రపంచంలో ఎదగడం మొదలుపెట్టింది. నటన, మోడలింగ్‌లో పట్టు సాధించింది. అందాల పోటీల్లో నాజూకుదనానికే పెద్ద పీట వేస్తారు. ప్రారంభంలో తాను అనుభవించిన ఆత్మన్యూనత గురించి ప్రస్తావిస్తూ... "నేనెంతో అభద్రతకు లోనయ్యాను. మిగతా అమ్మాయిలతో నన్ను నేను పోల్చుకుంటూ, నేను వాళ్లలా పొడవుగా, నాజూకుగా లేనని ఎంతో బాధపడేదాన్ని" అంటూ చెప్పుకొచ్చింది జేన్. అందాల పోటీల్లో పాల్గొనడం మొదలుపెట్టిన తొలిరోజుల్లో ఆవిడ శరీర బరువును చూసి ఎందరో హేళన చేయడం, బాడీ షేమింగ్‌తో విపరీతమైన ఒత్తిడికి లోనవడం లాంటివి కూడా జరిగాయి. అయినప్పటికీ నర్సు వృత్తి తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందనీ, ఎన్నో అనుభవాలను పొందే అవకాశాన్ని కల్పించిందనీ జేన్ మీడియాతో చెప్పుకొచ్చింది.

స్విమ్‌సూట్‌లో...

అందాల పోటీల్లో పాల్గొనే అభ్యర్థులకు అసౌకర్యానికి గురి చేసే రౌండ్ ఇది. మరీ ముఖ్యంగా జేన్ లాంటి బొద్దుగా ఉండే అమ్మాయిలు ఈ రౌండ్‌లో మార్కులు సాధించడం కొద్దిగా కష్టమే! కానీ ఇందుకు పూర్తి భిన్నంగా జేన్, స్విమ్ సూట్ రౌండ్‌లో మెటాలిక్ గ్రీన్ స్విమ్‌సూట్, స్ట్రాప్ హీల్స్‌తో జడ్జిల దృష్టిని ఆకర్షించింది. బ్యూటీ వాక్‌తో మార్కులను కొట్టేసి, టాప్ 20లో స్థానాన్ని దక్కించుకుంది. అధిక బరువుతో ఆత్మన్యూనతకు లోనయ్యే మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ... "కర్వీగా ఉండి అందచందాల ప్రమాణాలను అందుకోలేని మహిళలకు నేను ప్రాతినిధ్యం వహిస్తున్నాను. ఒకే రకమైన బ్యూటీ స్టాండర్డ్స్ అంటూ ఉండవు. ప్రతి మహిళా అందగత్తే! మిస్ యూనివర్స్ నేపాల్‌గా ఈ వేదికను ఉపయోగించుకుంటూ నేనొక విషయం చెప్పాలనుకుంటున్నాను. ప్రతి మహిళా తనను తాను అంగీకరించుకోవాలి. వాళ్ల శరీరాలను బట్టి ఆత్మవిశ్వాసంగా వ్యవహరించాలి. ఇలా నడుచుకోగలిగితే విజయాలన్నీ తల వంచుతాయి" అంటూ మిస్ నేపాల్‌గా గెలుపొందిన సందర్భంలో మాట్లాడింది జేన్.

స్ఫూర్తి



అనుసరణీయం.. చిరస్మరణీయం



'కళ కళ కోసం కాదు ప్రజా శ్రేయస్సు కోసం' అని త్రికరణ శుద్ధిగా విశ్వసించి తదనుగుణంగా నడుచుకున్న ఏకైక కథానాయకుడు విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు అంటే అతిశయోక్తి కాదు. అనేక చిత్రాల్లో బడుగు, బలహీన వర్గాల పక్షం నిలచి వారి కోసం న్యాయపోరాటం చేసే పాత్రల్లో నటించిన యన్టీఆర్, ఆయా వర్గాల అభిమానాన్ని విశేషంగా చూరగొన్నారు. తనను అంతగా అభిమానించే వారికి ఏదైనా చేయాలన్న తలంపుతోనే యన్టీఆర్ రాజకీయప్రవేశం చేసిన సంగతి కొత్తగా చెప్పవలసిన పనిలేదు. కోట్ల రూపాయలు సంపాదించి, ఆ రోజుల్లోనే కోట్ల ఆదాయం చూస్తూ రాజభోగాలు అనుభవించిన యన్టీఆర్ 'పేదవాడే దేవుడు' అని నమ్మి వారి కోసం 'తెలుగుదేశం' పార్టీ నెలకొల్పి, జనంలోకి వచ్చారు. ఆ రోజుల్లో యన్టీఆర్‌కు జనం పట్టిన బ్రహ్మరథం తరాలు మారినా అనితరసాధ్యంగానే నిలిచింది. కేవలం తొమ్మిది మాసాల్లోనే రాజకీయ రంగంలోనూ అధికారాన్ని చేజిక్కించుకొని, అప్పటికీ ఇప్పటికీ అనితర సాధ్యమైన చరిత్రను సృష్టించారు రామారావు. ఆయన రాజకీయ ప్రవేశాన్ని ఎద్దేవా చేసినవారు, అనుభవరాహిత్యం అని విమర్శించిన వారు సైతం ముక్కున వేలేసుకొనేలా పాలన సాగించి, పలు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టి బడుగు, బలహీన వర్గాల వారి అభివృద్ధికి పాటు పడ్డారు యన్టీఆర్. ఆయన ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలు ఇప్పుడు పేర్లు మార్చుకొని, రంగులు వేసుకొని చెలామణీ అవుతున్నాయి. 'సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు' అని చాటడమే కాదు, వారి పురోభివృద్ధికి అహర్నిశలూ పాటుపడ్డారు రామారావు. అందుకే తెలుగుదేశం పార్టీ ఈ నాటికీ వెలుగుతూనే ఉంది. జయాపజయాలు ఎలా ఉన్నా, తెలుగుదేశం పార్టీ మనుగడ సాగుతూనే ఉంది. భావితరాలను సైతం ప్రభావితం చేసే దిశగా పార్టీ నడక సాగిస్తోంది. రాబోయే ఎన్నికల్లో మళ్ళీ విజయదుందుభి మోగించడానికి సిద్ధమవుతోంది. సినిమా రంగంలోనూ, రాజకీయరంగంలోనూ.. వెరసి ప్రజా జీవితంలో తాను ఉన్నప్పుడే కాదు.. తన తదనంతరం కూడా తన ప్రభావం కొనసాగేలా చేయగలగడం ఒక్క యన్టీఆర్‌కే చెల్లింది. అందుకే ఆయన యుగపురుషుడని, శకపురుషుడని చరిత్ర ఆయనకు నీరాజనాలు పలుకుతోంది. యన్టీఆర్ ఆశయసాధన కోసం పాటుపడేవారందరూ మళ్ళీ 'తెలుగుదేశం' పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధమవుతున్నారు. యన్టీఆర్ ఉండగా, తెలుగుదేశం సాధించిన ఘనవిజయాల కోవకు చెందే రీతిన విజయం సాధించాలని అన్నగారి అభిమానులు ఆశిస్తున్నారు. వారి సంకల్పం ఫలించాలని, యన్టీఆర్ వర్ధంతి సందర్భంగా కోరుకుందాం.

● కొమ్మినేని వేంకటేశ్వరరావు

'బిట్స్' ఇంజనీరింగ్ అడ్మిషన్ టెస్ట్

పిలానీలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్)- 'బిట్స్‌ఎట్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. హైదరాబాద్ క్యాంపస్, పిలానీ క్యాంపస్, కేకే బిర్లా గోవా క్యాంపస్‌లలో ఈ టెస్ట్‌లో సాధించిన ర్యాంకుతో అడ్మిషన్ పొందవచ్చు. బీఈ, బీఫార్మసీ, ఎమ్మెస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొందిన అభ్యర్థులు మొదటి సంవత్సరం పూర్తయిన తరవాత ఇంజనీరింగ్ డ్యూయెల్ డిగ్రీలో చేరే వీలుంది.

కోర్సులు-స్పెషలైజేషన్‌లు

బీఈ స్పెషలైజేషన్‌లు: కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్, మెకానికల్, మాన్యుఫాక్చరింగ్

బీఫార్మసీ

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, మేథమెటిక్స్, ఫిజిక్స్, జనరల్ స్టడీస్

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. బీఫార్మసీ ప్రోగ్రామ్‌కు బయాలజీ అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గ్రూప్ సబ్జెక్టులకు సంబంధించి ఒక్కోదానిలో కనీసం 60 శాతం మార్కులు, మొత్తమ్మీద 75 శాతం మార్కులు ఉండాలి. ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం తప్పనిసరి.

దరఖాస్తు ఫీజు: పురుషులకు రూ.3,400; మహిళలకు రూ.2,900; రెండో విడత ఎగ్జామ్ రాయాలంటే పురుషులు రూ.2,000; మహిళలు రూ.1500 అదనంగా చెల్లించాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 11

వెబ్‌సైట్: bitsadmission.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/bu2ITR8లో చదవండి.

దిక్సూచి
DIKSUCHI

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో అకడమిక్ కోర్సులు

హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ఏఓయూ)- గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

డిగ్రీ: బీఏ, బీకాం, బీఎస్సీ

ఎంఏ స్పెషలైజేషన్‌లు: జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ. మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది.

ఇవి కాకుండా పీజీ డిప్లొమాలు, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు కూడా ఉన్నాయి

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 31
- **వెబ్‌సైట్:** www.braouonline.in

వాఘాలో వందేమాతరం



వరుణ్‌తేజ్ కథానాయకుడిగా భారత వైమానిక దళం నేపథ్యంలో రూపొందుతున్న దేశభక్తి చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. మాజీ విశ్వసుందరి మానుషి చిల్లర్ కథానాయిక. ప్రతాప్‌సింగ్ హడా దర్శకత్వంలో సందీప్ ముద్దా నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 16న విడుదలవుతోంది. ఈ చిత్రంలోని తొలి గీతాన్ని యూనిట్ బుధవారం పంజాబ్‌లోని వాఘా సరిహద్దుల్లో ఆవిష్కరించింది. ఈ కార్యక్రమంలో వరుణ్‌తేజ్, మానుషి చిల్లర్ చిత్రబృందంతో పాల్గొన్నారు. వైమానిక దళం యుద్ధానికి సన్నద్ధమవుతున్న నేపథ్యంలో వచ్చే గీతమిది. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. మిక్కీ జే మేయర్ స్వరపరచగా అనురాగ్ కులకర్ణి ఆలపించారు.

ఫియర్‌కు వేదికగా



హీరోయిన్ వేదిక లీడ్‌రోల్‌లో నటిస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ఫియర్'. హరిత గోగినేని దర్శకత్వంలో ఏఆర్ అభి నిర్మిస్తున్నారు. అరవింద్ కృష్ణ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. బుధవారం పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభమైంది. తొలిషాట్‌కు దర్శకుడు కరుణాకర్ క్లాప్ ఇచ్చారు. నటుడు మురళీమోహన్ స్క్రిప్ట్‌ను యూనిట్‌కు అందించారు. ఈ సందర్భంగా వేదిక మాట్లాడుతూ 'సస్పెన్స్ థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసేలా మా దర్శకురాలు కథను తయారుచేశారు. తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుందన్నారు. దర్శకురాలు మాట్లాడుతూ 'ప్రేక్షకులకు మంచి సినిమా అందించాలని ఏడాది పాటు కష్టపడి కథ తయారుచేసుకున్నాను. వేదిక పాత్ర ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'హరిత నా వైఫ్. తన సినీరంగం పట్ల ఇష్టం, వివిధ విభాగాలపై అవగాహన ఉన్నాయి. తను 'ఫియర్'తో దర్శకురాలిగా అరంగేట్రం చేయడం ఆనందంగా ఉంది. వేదిక ఛాలెంజింగ్ రోల్ చేస్తున్నారు' అని తెలిపారు. ఈ చిత్రంలో ప్రేక్షకులను ఎంటర్టైన్ చేసే అంశాలు చాలా ఉన్నాయని అరవింద్ కృష్ణ అన్నారు. పవిత్రా లోకేశ్, షాయాజీ షిండే, అనీష్ కురువిల్ల కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనూప్‌రూబెన్స్, సినిమాటోగ్రఫీ: ఐ ఆండ్రూ

మిల్లర్ కిల్లర్



ధనుష్ కథానాయకుడిగా నటించిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'కెప్టెన్ మిల్లర్'. సంక్రాంతికి తమిళంతో పాటు ఇతర భాషల్లోనూ విడుదలైంది. ఈ నెల 25న తెలుగు వెర్షన్ విడుదలవుతోంది. ఏషియన్ మల్టీప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థలు తెలుగు హక్కులు సొంతం చేసుకున్నాయి. వెంకటేశ్, నాగార్జున సోషల్ మీడియా వేదికగా బుధవారం 'కెప్టెన్ మిల్లర్' ట్రైలర్‌ను విడుదల చేశారు. బ్రిటిషర్లను తుదముట్టించే అవేశపరుడైన దేశభక్తుడిగా ధనుష్ సరికొత్త గెటప్పుల్లో కనిపించారు. ఈ చిత్రంలో ప్రియాంక మోహన్ కథానాయిక. సందీప్ కిషన్, డాక్టర్ శివరాజ్‌కుమార్ కీలకపాత్రల్లో నటించారు. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో జీ. శరవణన్, సాయి సిద్ధార్థ్ నిర్మించారు. సంగీతం: జీవీప్రకాశ్ కుమార్. సాయి సిద్ధార్థ్

మార్కెట్ బేజార్!



భారీగా పతనమైన స్టాక్ సూచీలు.. సెన్సెక్స్ 1,628 పాయింట్లు డౌన్.. 21,600 దిగువకు నిఫ్టీ

2022 జూన్ తర్వాత అతిపెద్ద నష్టం
బ్యాంకింగ్, ఆర్థిక రంగ షేర్లు విలవిల
రూ.4.60 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై: భారత స్టాక్ మార్కెట్ బుధవారం మహా పతనాన్ని చవిచూసింది. బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 1,628 పాయింట్లు (2.23 శాతం) క్షీణించి 71,500.76 వద్దకు జారుకుంది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 460.35 పాయింట్లు (2.09 శాతం) కోల్పోయి 21,571.95 వద్ద ముగిసింది. ప్రామాణిక సూచీలకు గడిచిన ఏడాదిన్నరకు పైగా కాలంలో (2022 జూన్ 13 తర్వాత) ఇదే అతిపెద్ద నష్టం. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాల నేపథ్యంలో బ్యాంకింగ్, మెటల్, ఆయిల్ రంగ షేర్లలో ఇన్వెస్టర్లు భారీగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించే ప్రక్రియ జాప్యం కావచ్చన్న ఆందోళనలతో యూఎస్ డాలర్‌తో పాటు బాండ్ల రేట్లు మళ్లీ 4 శాతం పైకి ఎగబాకడం, ఎర్ర సముద్రంలో సంక్షోభం వంటి అంశాలు అంతర్జాతీయంగా ఈక్విటీ ట్రేడింగ్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. పైగా, మన సూచీలు ఆల్‌టైం గరిష్ఠాల వద్ద కదలాడుతున్న నేపథ్యంలో మదుపర్లు ముందు జాగ్రత్త చర్యగా పెద్ద ఎత్తున లాభాల స్వీకరణకు పాల్పడ్డారని మార్కెట్ వర్గాలంటున్నాయి. అమ్మకాలు పోటెత్తడంతో మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.59 లక్షల కోట్లకు పైగా తరిగి రూ.370.36 లక్షల కోట్లకు పరిమితమైంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 23 నష్టపోగా.. 6 లాభపడ్డాయి. బీఎస్ఈలోని మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 1.09 శాతం వరకు నష్టపోయాయి. రంగాలవారీ సూచీల్లో బ్యాంకెక్స్ ఏకంగా 4.02 శాతం పతనమైంది.

ఎంఆర్ఎఫ్ షేరు @ రూ.1.50 లక్షలు

మార్కెట్లో అత్యంత ఖరీదైన షేరుగా పేరున్న ఎంఆర్ఎఫ్.. ఇంట్రాడే ట్రేడింగ్‌లో మరింత ఎగబాకి సరికొత్త రికార్డు స్థాయి రూ.1.50 లక్షలకు చేరుకుంది. ఇప్పటివరకు మార్కెట్లో రూ.లక్షన్నర పలికిన ఏకైక కంపెనీ షేరు ఇదే. అయితే, చివర్లో 1.11 శాతం నష్టంతో రూ.1,34,969 వద్ద ముగిసింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు రూ.లక్ష కోట్ల నష్టం

డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రకటించిన ఫలితాలు మార్కెట్ అంచనాలను అందుకోలేకపోవడంతో బ్యాంక్ షేర్లు 8 శాతానికి పైగా క్షీణించాయి. కొవిడ్ సంక్షోభ కాలమైన 2020 మార్చి 23న 12.7 శాతం నష్టపోయిన బ్యాంక్ షేరుకు ఆ తర్వాత ఇదే అతిపెద్ద పతనం. దాంతో బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులోనే రూ.లక్ష కోట్లకు పైగా తగ్గి రూ.11.67 లక్షల కోట్లకు పడిపోయింది. మార్కెట్ దిగ్గజ షేర్లలో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్ల భారీ పతనం ఇతర బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగ షేర్లలోనూ అమ్మకాల ఒత్తిడిని పెంచింది. దాంతో ప్రామాణిక సూచీలు అతిపెద్ద నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 2,000 పాయింట్లకు పైగా కోల్పోయి 2020 మే తర్వాత అతిపెద్ద నష్టాన్ని నమోదు చేసుకుంది.

ఎన్‌హెచ్‌పీసీలో వాటా విక్రయించనున్న ప్రభుత్వం

గురువారం నుంచి ఎన్‌హెచ్‌పీసీలో ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ప్రభుత్వం 3.5 శాతం వాటాకు సమానమైన 25 కోట్ల షేర్లను విక్రయించనుంది. ఒక్కో షేరును రూ.66కు విక్రయించటం ద్వారా ప్రభుత్వం రూ.2,300 కోట్లు సమీకరించనుంది.

అత్యంత విలువైన పీఎస్‌యూగా ఎల్ఐసీ

మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా, దేశంలో అత్యంత విలువైన ప్రభుత్వ రంగ కంపెనీ (పీఎస్‌యూ) జాబితాలో ఎస్‌బీఐని వెనక్కి నెట్టి ఎల్ఐసీ అగ్రస్థానానికి ఎగబాకింది. ప్రారంభ ట్రేడింగ్‌లో ఎల్ఐసీ షేరు 3 శాతం పెరిగి రూ.919.45 వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని రికార్డు చేసింది. దాంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.5.75 లక్షల కోట్లకు ఎగబాకింది. అదే సమయంలో ఎస్‌బీఐ షేరు నష్టాల్లో ట్రేడైంది. దాంతో బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.5.60 లక్షల కోట్లకు పరిమితమైంది. చివర్లో ఎల్ఐసీ షేరు నష్టాల్లోకి జారుకున్నప్పటికీ, కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.5.61 లక్షల కోట్లుగా నమోదు కావడంతో తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగలిగింది.

22 నుంచి నోవా అగ్రిటెక్ పబ్లిక్ ఇష్యూ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భూసార నిర్వహణ, పంట ఉత్పత్తికారకాల, పోషకాలను తయారు చేస్తున్న నోవా అగ్రిటెక్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.144 కోట్లు సమీకరించనుంది. ఇష్యూ జనవరి 22న ప్రారంభమై 24న ముగుస్తుంది. దరఖాస్తుకు ఒక్కో షేరు ధర శ్రేణిని రూ.39-41గా నిర్ణయించింది. కనీసం 365 షేర్లకు దరఖాస్తు చేసుకోవాలి. రూ.2 ముఖ విలువ కలిగిన రూ.112 కోట్ల విలువైన కొత్త షేర్లను ఇష్యూలో జారీ చేస్తారు. ఓఎఫ్ఎస్ కింద ప్రమోటర్ నూతలపాటి వెంకటసుబ్బారావు 77,58,620 షేర్లను విక్రయిస్తారు.

గూగుల్ పేతో విదేశాల్లోనూ చెల్లింపులు..
ఎన్‌పీసీఐతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ

న్యూఢిల్లీ: గూగుల్ ఇండియా డిజిటల్ సర్వీసెస్‌తో ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్ఐపీఎల్) బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. యూనిఫైడ్ పేమెంట్ సర్వీసెస్(యూపీఐ) ద్వారా చెల్లింపుల సేవలను విదేశాలకు విస్తరించేందుకు ఈ ఒప్పందం దోహదపడనుంది. అంటే, భారతీయులు విదేశాలకు వెళ్లినప్పుడు అక్కడా గూగుల్ పే ద్వారా చెల్లింపులు జరిపేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా వెంట నగదు తీసుకెళ్లాల్సిన లేదా అంతర్జాతీయ పేమెంట్ గేట్‌వేలపై ఆధారపడాల్సిన అవసరం తప్పుతుంది.

సెలోజీన్‌లో నాట్కో ఫార్మా పెట్టుబడులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఢిల్లీకి చెందిన బయోటెక్నాలజీ కంపెనీ సెలోజీన్ థెరప్యుటిక్స్‌లో నాట్కో ఫార్మా 20 లక్షల డాలర్ల (దాదాపు రూ.16 కోట్లు) పెట్టుబడులు పెట్టింది. సెల్, జీన్ థెరపీకి సంబంధించి రెండు పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను సెలోజీన్ నిర్వహిస్తోంది. కిమెరిక్ యాంటీజెన్ రిసెప్టర్ టీ (కార్ టీ) సెల్ థెరపీపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తోంది. తలసేమియా వ్యాధికి సంబంధించిన జీన్ థెరపీపై కూడా సెలోజీన్ పరిశోధనలు చేస్తోంది. కార్ టీ థెరపీపై మొదటి దశ క్లినికల్ పరీక్షలను ఈ ఏడాది ప్రథమార్థంలో ప్రారంభించాలని భావిస్తోంది.

రూ.60 కోట్లతో ఎన్‌కోర్-అల్కామ్ కొత్త ప్లాంట్
హైదరాబాద్‌లో ఫ్యాబ్రికేషన్ యూనిట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన ఎన్‌కోర్- అల్కామ్.. కార్యకలాపాల విస్తరణలో భాగంగా రూ.60 కోట్లతో అల్యూమినియం డోర్స్, విండోల తయారీ యూనిట్‌ను సూరత్‌లో ఏర్పాటు చేస్తోంది. హైదరాబాద్‌లోని మోకిలా వద్ద ఫ్యాబ్రికేషన్ యూనిట్‌ను ప్రారంభించనుంది. ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయనుంది. జర్మనీ టెక్నాలజీతో రోజుకు 30 వేల చదరపు అడుగుల అల్యూమినియం డోర్లు, విండోలను సూరత్ యూనిట్‌లో తయారు చేయనున్నట్లు సంస్థ సీఎండీ శివ కోటి రెడ్డి తెలిపారు. 1.8 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉండే ఈ యూనిట్ విస్తీర్ణం పరంగా దేశంలోనే అతిపెద్దది. అల్కామ్ బ్రాండ్‌తో అల్యూమినియం డోర్లు, విండోలను కంపెనీ ఉత్తరాదిలో విక్రయిస్తోంది. కొత్త ప్లాంట్ అందుబాటులోకి వచ్చిన తర్వాత దక్షిణాదిలోని రిటైల్ మార్కెట్లో కూడా అల్యూమినియం డోర్లు, విండోలను కంపెనీ ప్రవేశపెట్టనుంది.



ప్రారంభ ధర రూ.10.99 లక్షలు

మార్కెట్లోకి టాటా 'పంచ్.ఈవీ'

న్యూఢిల్లీ :టాటా మోటార్స్ మార్కెట్లోకి ఎలక్ట్రిక్ వెర్షన్ 'పంచ్.ఈవీ' విడుదల చేసింది. రెండు బ్యాటరీ ప్యాక్స్‌తో అందుబాటులో ఉండనున్న ఈ కారు ప్రారంభ ధర రూ.10.99 లక్షలు, రూ.14.49 లక్షలుగా ఉన్నాయి. ప్యూర్ ఈవీ ఆర్కిటెక్చర్ 'యాక్టి.ఈవీ' పై కంపెనీ తీసుకువచ్చిన మొదటి ఎలక్ట్రిక్ కారు ఇది. 25 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్‌తో కూడిన పంచ్.ఈవీ కారు ఒకసారి చార్జింగ్‌తో 315 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ ఎండీ శైలేష్ చంద్ర తెలిపారు. 35 కిలోవాట్ బ్యాటరీతో కూడిన కారు సింగిల్ చార్జింగ్‌తో 421 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందన్నారు. కాగా ఏడాది ద్వితీయార్థంలో కర్వ్, హారియర్ ఈవీ, సియెర్రా, ఆల్ట్రోజ్ ఈవీ కార్లను మార్కెట్లోకి తీసుకురానున్నట్లు చంద్ర తెలిపారు.

భారత్‌లో బలమైన బ్రాండ్ జియో

వరుసగా రెండో ఏడాదీ అగ్రస్థానం

- అత్యంత విలువైన బ్రాండ్ టాటా
- బ్రాండ్ ఫైనాన్స్ నివేదిక విడుదల

న్యూఢిల్లీ: ఆసియా కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన టెలికాం సేవల సంస్థ రిలయన్స్ జియో భారత్‌లో అత్యంత బలమైన కార్పొరేట్ బ్రాండ్‌గా నిలిచింది. బ్రాండ్ ఫైనాన్స్ అనే సంస్థ 2024కు గాను విడుదల చేసిన గ్లోబల్ 500 లిస్ట్‌లోని భారత కంపెనీల్లో జియో వరుసగా రెండో ఏడాదీ అగ్రస్థానం దక్కించుకుంది. ప్రపంచ జాబితాలో జియోకు ఈసారి 17వ స్థానం దక్కింది. కాగా, దేశీయ బీమా దిగ్గజం ఎల్ఐసీకి 23, ఎస్‌బీఐకి 24వ స్థానాలు లభించాయి. "అంతర్జాతీయ టెలికాం రంగంలో జియో కొత్త కంపెనీ అయినప్పటికీ, 610 కోట్ల డాలర్ల బ్రాండ్ విలువ (14 శాతం వృద్ధి)తో పాటు బ్రాండ్ సత్తా సూచీలో 89 పాయింట్ల స్కోర్, ట్రిపుల్ ఏ బ్రాండ్ రేటింగ్‌తో శక్తిమంతమైన బ్రాండ్‌గా ఎదిగింద"ని బ్రాండ్ ఫైనాన్స్ రిపోర్టు పేర్కొంది. కాగా, దేశంతోపాటు దక్షిణాసియాలో అత్యంత విలువైన బ్రాండ్‌గా టాటా గ్రూప్ నిలిచింది. గ్లోబల్ 500 లిస్ట్‌లో టాటా గ్రూప్‌నకు 64వ స్థానం దక్కింది. భారత్ నుంచి మొత్తం 13 కంపెనీలకు ఈ లిస్ట్‌లో చోటు లభించింది. కాగా, ఐఫోన్ తయారీ దిగ్గజం యాపిల్ ప్రపంచంలో అత్యంత విలువైన బ్రాండ్‌గా ఉంది. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, సామ్‌సంగ్ వరుసగా టాప్-5లో ఉన్నాయి.

వచ్చే ఏడాది వృద్ధి 7%

- ద్రవ్యోల్బణం దిగి రావడం ఖాయం
- 2024-25పై ఆర్‌బీఐ అంచనా

దావోస్: భారత్‌లో త్వరలో ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టి, 2024-25 ఆర్థిక సంవత్సరంలో 7 శాతం వృద్ధిని నమోదు చేస్తుందన్న ధీమా ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ ప్రకటించారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సమావేశాల సందర్భంగా దావోస్‌లో "గరిష్ఠ వృద్ధి, కనిష్ఠ రిస్క్ : భారతదేశ గాథ" అనే అంశంపై సీఐఐ నిర్వహించిన కార్యక్రమంలో దాస్ మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం ఇటీవల చేపట్టిన వ్యవస్థాత్మక సంస్కరణలు ఆర్థిక వ్యవస్థ మధ్యకాలిక, దీర్ఘకాలిక వృద్ధిని ఉత్తేజితం చేశాయని చెప్పారు. స్థూలంగా ప్రపంచం పలు ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ అందుకు భిన్నంగా భారతదేశం వృద్ధి, సుస్థిరతల చిత్రాన్ని ఆవిష్కరించిందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ 7.2 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని అంచనాగా చెప్పారు. దేశీయంగా డిమాండ్ బలంగా ఉండడంతో భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్నదని, పలు ప్రపంచ పరిణామాల మధ్య భారత్ పటిష్ఠంగా నిలిచిందని ఆయన తెలిపారు. విదేశీ మారకం నిల్వలు పుష్కలంగా ఉండడంతో విదేశీ చెల్లింపులకు ఎలాంటి అవరోధం ఉండబోదని దాస్ చెప్పారు. 2022 వేసవితో పోల్చితే ద్రవ్యోల్బణం విశేషంగా తగ్గిందని, ద్రవ్య విధాన చర్యలతో పాటు లిక్విడిటీని సద్దుబాటు చేసే చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయనేందుకు ఇది నిదర్శనమని దాస్ తెలిపారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,950 ▼	57,700 ▼	77,400 ▼
ముంబై	62,277 ▼	57,046 ▼	71,191 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



17వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	530
18 జనవరి		విశాఖపట్నం	550
చిత్తూరు	563	వరంగల్	522
గోదావరి	530	దజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	97	గోదావరి	106
వరంగల్	97	విజయవాడ	106
కరీంనగర్	97	గుంటూరు	107
మహబూబ్‌నగర్	97	ఒంగోలు	107
కర్నూలు	97	చిత్తూరు	113
విశాఖపట్నం	101		

వరల్డ్ చాంపియన్‌కు ప్రజ్ఞానంద షాక్

విషిని వెనక్కునెట్టి అగ్రస్థానానికి



విజ్కాన్‌జీ (నెదర్లాండ్స్): టీనేజ్ గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద రమేష్‌బాబు పెను సంచలనం సృష్టించాడు. టాటా స్టీల్ మాస్టర్స్ టోర్నీలో ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)కు షాకిచ్చిన 18 ఏళ్ల ప్రజ్ఞానంద.. దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్‌ను వెనక్కునెట్టి భారత టాప్ రేటెడ్ ప్లేయర్‌గా నెం:1 స్థానాన్ని ఆక్రమించాడు. మంగళవారం రాత్రి జరిగిన నాలుగో రౌండ్‌లో నల్లపావులతో ఆడిన ప్రజ్ఞానంద 62 ఎత్తుల్లో లిరెన్ ఆట కట్టించాడు. ఈ క్రమంలో క్లాసికల్ చెస్‌లో ఆనంద్ తర్వాత వరల్డ్ చాంపియన్‌ను ఓడించిన రెండో భారత ప్లేయర్‌గా ప్రజ్ఞానంద రికార్డులకెక్కాడు. అంతేకాకుండా ఫిడే లైవ్ రేటింగ్స్‌లో ఐదుసార్లు వరల్డ్ చాంపియన్ విషీ (2748)ను ప్రజ్ఞానంద (2748.3) స్వల్ప తేడాతో అధిగమించాడు. గతేడాది కూడా ఇదే టోర్నీలో లిరెన్‌పై మన చిన్నోడు గెలిచాడు. కాగా, నెదర్లాండ్స్ జీఎం అనీష్ గిరీ చేతిలో గుకేష్ పరాజయం పాలయ్యాడు. టోర్నీలో మొత్తం 4 రౌండ్‌ల నుంచి ప్రజ్ఞానంద 2.5 పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతుండగా.. గుకేష్ 1.5 పాయింట్లతో 10వ స్థానంలో ఉన్నాడు. అద్వితీయ విజయం సాధించిన ప్రజ్ఞానందపై సచిన్ టెండూల్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు.

స్టార్లకు రష్యన్ల ఝలక్

జెబ్యూర్, సక్కారి, వోజ్నియాకి ఇంటికి
రెండోరౌండ్లోనూ కష్టపడ్డ జొకోవిచ్
ఆస్ట్రేలియన్ ఓపెన్



ఎలీనా అవనెస్యాన్ | మిరా ఆండ్రీవా | మరియా తొమఫీవా

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో నాలుగోరోజు సంచలనాలు నమోదయ్యాయి. బుధవారం జరిగిన సింగిల్స్‌లో టాప్‌టెన్ క్రీడాకారిణులైన ఓన్స్ జెబ్యూర్, మరియా సక్కారితో పాటు మాజీ చాంపియన్ కరోలిన్ వోజ్నియాలకు చుక్కెదురైంది. ఈ ముగ్గురూ రెండోరౌండ్లో రష్యన్ యువ కెరటాల జోరుకు తలొగ్గడం విశేషం. మూడు గ్రాండ్‌స్లామ్‌ల రన్నరప్, ఆరోసీడ్ జెబ్యూర్‌ను రెండోరౌండ్లో 16 ఏళ్ల టీనేజర్ మిరా ఆండ్రీవా 6-0, 6-2తో చిత్తుచేసింది. నిరుడు ఇదే టోర్నీ జూనియర్ విభాగంలో రన్నరప్‌గా నిలిచిన ఆండ్రీవా.. ఈ వేదికపై సీనియర్ కేటగిరిలో ఆడుతున్న రెండోమ్యాచ్‌లోనే టాప్‌టెన్ ప్లేయర్‌పై విజయాన్నందుకొని సత్తాచాటింది. మరో రెండోరౌండ్ పోరులో గ్రీస్ క్రీడాకారిణి, 8వ సీడ్ మరియా సక్కారికి 6-4, 6-4తో 21 ఏళ్ల ఎలీనా అవనెస్యాన్ షాకిచ్చింది. ఇద్దరు పిల్లలకు తల్లి అయ్యాక గతేడాదే టెన్నిస్‌లో పునరాగమనం చేసిన 2018 విజేత కరోలిన్ వోజ్నియాకి రెండోరౌండ్లో పోరాడి ఓడింది. 33 ఏళ్ల ఈ డెన్మార్క్ స్టార్‌ను 20 ఏళ్ల మరియా తొమఫీవా 1-6, 6-4, 6-1తో కంగు తినిపించింది. మిగతా స్టార్లలో డిఫెండింగ్ చాంప్ సబలెంక, అమెరికా యువ సంచలనం కొకొ గాఫ్, క్రెజికోవా ప్రత్యర్థులపై గెలిచి మూడోరౌండ్లో ప్రవేశించారు. మార్తా కొస్ట్యుక్ 5-7, 6-1, 7-6(6)తో 25వ సీడ్ మెర్టెన్స్‌కు, మాగ్థలీనా 6-4, 7-6(2)తో 16వ సీడ్ గార్సియాకు, అలీసియా7-5, 6-4తో 32వ సీడ్ లైలా ఫెర్నాండెజ్‌కు ఝలకిచ్చారు.

మళ్లీ సెట్ కోల్పోయిన జొకో: పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంప్ జొకోవిచ్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ కష్టపడ్డాడు. రెండోరౌండ్లోనూ ఓ సెట్ కోల్పోయి గట్టెక్కాడు. మూడు గంటలా 11 నిమిషాల పాటు సాగిన పోరులో 36 ఏళ్ల జొకోవిచ్ 6-3, 4-6, 7-6(4), 6-3తో స్థానిక ఆటగాడు అలెక్సీ పాపిరిన్‌పై గెలిచాడు. సీడెడ్ ఆటగాళ్లలో సిన్నర్, రుబ్లెవ్, సిట్సిపాస్, కచనోవ్ మూడోరౌండ్లో అడుగుపెట్టారు.

శ్రీకాంత్ అవుట్
ఇండియా ఓపెన్

న్యూఢిల్లీ: స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ సొంతగడ్డపై జరుగుతున్న ఇండియా ఓపెన్‌లోనూ విఫలమయ్యాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల జరిగిన పురుషుల సింగిల్స్ తొలిరౌండ్లో శ్రీకాంత్ 22-24, 13-21తో లీ చిక్ యూ (హాంకాంగ్) చేతిలో ఓటమిపాలయ్యాడు. పురుషుల డబుల్స్‌లో ఏస్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి 21-15, 19-21, 21-16తో చైనీస్ తైపీ జంట ఫాంగ్ చిన్ లీ-ఫాంగ్ జెన్ లీపై గెలిచి రెండోరౌండ్ చేరింది. మహిళల డబుల్స్‌లో తనీషా/అశ్వినీ పొన్నప్ప జంట, అశ్విని భట్/శిఖా గౌతమ్ ద్వయం, పురుషుల డబుల్స్‌లో కృష్ణప్రసాద్/ప్రతీక్ జంటలు ప్రత్యర్థుల చేతిలో ఓడారు.

అలెన్ తుఫాన్

16 సిక్సర్లతో రికార్డు సెంచరీ
కివీస్‌దే మూడో టీ20
పాక్‌పై సిరీస్ కైవసం



డ్యునెడిన్: పాకిస్థాన్‌పై న్యూజిలాండ్ వరుసగా మూడో టీ20లోనూ గెలిచి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకుంది. బుధవారం జరిగిన మూడో టీ20లో ఫిన్ అలెన్ రికార్డుల మోత మోగించడంతో కివీస్ 45 పరుగులతో పాక్‌ను చిత్తుచేసింది. తొలుత ఓపెనర్ ఫిన్ అలెన్ (62 బంతుల్లో 5 ఫోర్లు, 16 సిక్సర్లతో 137) మెరుపు సెంచరీ చేయడంతో కివీస్ 20 ఓవర్లలో 224/7తో భారీస్కోరు సాధించింది. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అలెన్ దెబ్బకు రౌఫ్ 4 ఓవర్లలో 60 పరుగులు సమర్పించుకోవడం గమనార్హం. ఛేదనలో పాక్ 20 ఓవర్లలో 179/7 స్కోరుకే పరిమితమైంది. బాబర్ ఆజమ్ (58) అర్ధసెంచరీతో రాణించాడు. దీంతో జట్టు ఓటమిపాలైన వరుస మూడు మ్యాచ్‌ల్లోనూ అర్ధ సెంచరీలు చేసిన తొలి ఆసియా బ్యాటర్‌గా బాబర్ నిలిచాడు.

రికార్డుల కింగ్

1అలెన్ ఒకే ఇన్నింగ్స్‌లో 16 సిక్సర్లు కొట్టి అజ్రతుల్లా జజాయ్ (అఫ్ఘానిస్థాన్) పేరిట నున్న ప్రపంచ రికార్డును సమం చేశాడు. జజాయ్ 2019లో ఐర్లాండ్‌పై 16 సిక్సర్లు బాదాడు. 1టీ20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన న్యూజిలాండ్ ఆటగాడిగా మెకల్లమ్ (123)ను అలెన్ అధిగమించాడు.

టాప్-10లోకి అక్షర్, యశస్వి

దుబాయ్: అఫ్ఘానిస్థాన్‌తో సిరీస్‌లో మెరుగైన ప్రదర్శన కనబరచడంతో టీమిండియా స్పిన్నర్ అక్షర్ పటేల్, ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో టాప్ టెన్‌లో చోటు దక్కించుకున్నారు. బౌలర్ల జాబితాలో అక్షర్ ఐదో ర్యాంకు, బ్యాటర్లలో జైస్వాల్ ఆరో స్థానాన్ని కైవసం చేసుకున్నారు.

స్పోర్ట్స్

సూపరో.. సూపర్

తొలుత టై.. ఆపై రెండు సూపర్ ఓవర్లు
భారత్ థ్రిల్లింగ్ విన్



రోహిత్ (121 నాటౌట్) | రింకూ సింగ్ (69 నాటౌట్)

మూడో టీ20లో పోరాడి ఓడిన అఫ్ఘానిస్థాన్
రోహిత్ సెంచరీ
సిరీస్ క్లీన్‌స్వీప్

బెంగళూరు : ఆహా..ఏమి మ్యాచ్..భారత్-అఫ్ఘానిస్థాన్ జట్ల మధ్య బుధవారం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఆఖరి టీ20 ఫ్యాన్స్‌కు నాలుగు గంటలపాటు మస్త్ మజాను పంచింది..పరుగుల వరద పారిన పోరులో విజేతను తేల్చేందుకు ఏకంగా రెండు సూపర్ ఓవర్లు అనివార్యమయ్యాయి..అయితే రెండో సూపర్ ఓవర్లో యువ స్పిన్నర్ రవి బిష్ణోయ్ అద్భుత బౌలింగ్‌తో రెండు వికెట్లు పడగొట్టి టీమిండియాకు ఉత్కంఠ విజయం అందించాడు. సూపర్ ఓవర్లో 2 వికెట్లు పతనమైతే ఆలౌట్ అయినట్టు లెక్క. బుధవారం జరిగిన మూడో టీ20లో కెప్టెన్ రోహిత్ శర్మ (69 బంతుల్లో 11 ఫోర్లు, 8 సిక్సులతో 121 నాటౌట్) సెంచరీతో, డాషింగ్ బ్యాటర్ రింకూ సింగ్ (39 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్సులతో 69 నాటౌట్) అర్ధ శతకంతో అదరగొట్టగా, తొలుత టీమిండియా 20 ఓవర్లలో 212/4 స్కోరు చేసింది. రోహిత్, రింకూ ఐదో వికెట్‌కు 190 పరుగుల (95 బంతుల్లో) అభేద్య భాగస్వామ్యం నెలకొల్పడం విశేషం. టీ20ల్లో భారత్‌కు ఏ వికెట్‌కైనా ఇది రికార్డు. భారీ ఛేదనలో గుల్బదిన్ నైబ్ (23 బంతుల్లో 55 నాటౌట్), రహ్మనుల్లా గుర్బాజ్ (32 బంతుల్లో 50), ఇబ్రహీం జద్రాన్ (41 బంతుల్లో 50) అర్ధ శతకాలతో అఫ్ఘాన్ కూడా 20 ఓవర్లలో 212/6 స్కోరు చేసింది. నబీ (16 బంతుల్లో 34) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. ఈ విజయంతో 3 మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. రోహిత్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా, దూబే 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచారు.

వణికించిన అఫ్ఘానిస్థాన్: భారీ ఛేదనలో అఫ్ఘానిస్థాన్ ఓపెనర్లు గుర్బాజ్, ఇబ్రహీం భారత బౌలర్లను బెంబేలెత్తిస్తూ, తొలి వికెట్‌కు ఏకంగా 93 పరుగులు జోడించారు. అయితే స్పిన్నర్ కుల్దీప్ బౌలింగ్‌లో సుందర్ పట్టిన సూపర్ క్యాచ్‌తో రహ్మనుల్లా గుర్బాజ్ అవుట్ కావడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది. ఆపై రెండు వికెట్లను వెంటవెంటనే చేజార్చుకున్నా..నబీ తుఫాన్ ఇన్నింగ్స్‌తో మరోసారి ఆతిథ్య జట్టులో గుబులు రేపాడు. నబీ ఇన్నింగ్స్‌కు సుందర్ ముగింపు పలికినా..చివరి బ్యాటర్లు జతగా గుల్బదిన్ నైబ్ అఫ్ఘానిస్థాన్‌ను గెలుపు అంచులదాకా తీసుకొచ్చాడు. ఆఖరి ఓవర్లో అఫ్ఘాన్ విజయానికి 19 పరుగులు చేయాల్సి వచ్చింది. ముకేశ్ వేసిన ఆ ఓవర్లో గుల్బదిన్ 4,6 కొట్టడంతో ఆఖరి బంతికి మూడు పరుగులుగా సమీకరణం మారింది. కానీ గుల్బదిన్ రెండు పరుగులే తీయడంతో మ్యాచ్ టై అయింది. కాగా, ఈ మ్యాచ్‌లో బ్యాట్‌తో విఫలమైన విరాట్ కోహ్లీ ఫీల్డింగ్‌లో మాత్రం అదరగొట్టాడు. అవేశ్ బౌలింగ్‌లో భారీ షాట్ కొట్టేందుకు ప్రయత్నించిన నజీబుల్లా జద్రాన్‌ను అద్భుతమైన క్యాచ్‌తో పెవిలియన్ చేర్చాడు. అంతకుముందు వాషింగ్టన్ వేసిన 17వ ఓవర్లో కరీం కొట్టిన భారీ షాట్‌ను కోహ్లీ బౌండరీ లైన్ వద్ద గాల్లోకి ఎగిరి ఆపి, సిక్సర్ ఖాయమనుకున్నదాన్ని ఒక్క పరుగుకే పరిమితం చేశాడు.

రోహిత్, రింకూ విన్యాసం: టాస్ కోల్పోయి బ్యాటింగ్ చేపట్టిన భారత్‌ను..ఫరీద్ అహ్మద్, ఒమర్‌జాయ్ కట్టుదిట్టమైన బంతులతో పరుగులు చేయకుండా నిరోధించారు. ఫరీద్ వేసిన మూడో ఓవర్లో రోహిత్ బౌండరీ కొట్టినా..తర్వాత రెండు వరుస వికెట్లతో అఫ్ఘాన్ పేసర్ ఝలకిచ్చాడు. ఫరీద్ బంతిని క్రీజునుంచి బయటకు వచ్చి జైస్వాల్ (4) భారీ షాట్‌గా మలచబోయి నబీకి చిక్కాడు. ఇక..ఎదుర్కొన్న తొలి బంతినే షాట్‌గా కొట్టబోయి విరాట్ కూడా క్యాచవుట్ అయ్యాడు. ఇక అజ్మతుల్లా ఒమర్ జాయ్..దూబే (1)ను కీపర్ గుర్బాజ్ క్యాచ్ ద్వారా పెవిలియన్ చేర్చాడు. దీని నుంచి కోలుకొనేలోపే..ఫరీద్ బౌలింగ్‌లో చెత్త షాట్‌కు యత్నించి శాంసన్ డకౌటయ్యాడు. దాంతో పవర్ ప్లేలోపే 22/4తో టీమిండియా తీవ్ర కష్టాల్లో పడింది. కానీ ఎనిమిదో ఓవర్లో..అరంగేట్ర పేసర్ సలీమ్‌కు రింకూ సింగ్, రోహిత్ భారీ సిక్సర్లతో స్వాగతం పలికారు. అజ్మతుల్లా వేసిన 19వ ఓవర్లో 6,4,4తో దుమ్ము రేపిన రోహిత్ 2018 అనంతరం టీ20లలో తొలి సెంచరీ అందుకున్నాడు. ఇదే ఓవర్లో సిక్సర్ బాదిన రింకూ హాఫ్ సెంచరీ మార్క్ చేరాడు. రింకూ 6,6,6 దంచడంతో..ఆఖరి ఓవర్లో భారత్ ఏకంగా 36 రన్స్ సాధించింది. మొత్తంగా చివరి ఐదు ఓవర్లలో భారత్ 103 కొల్లగొట్టింది.

1

టీ20ల్లో అత్యధిక సెంచరీ (5)లు చేసిన తొలి బ్యాటర్ రోహిత్ శర్మ. అలాగే ఈ ఫార్మాట్‌లో అతడికి అత్యధికం కూడా. 2017లో ఇండోర్‌లో శ్రీలంకపై 118 రోహిత్ గత అత్యుత్తమం.

అంతర్జాతీయ క్రికెట్‌లో కోహ్లీకిది 35వ డకౌట్. ఈ క్రమంలో సచిన్ (34)ను అధిగవించాడు.

మొదటి సూపర్ ఓవర్ సాగిందిలా..
(భారత్ లక్ష్యం 16 రన్స్)

అఫ్ఘానిస్థాన్	బంతి	భారత్
1 రన్, వికెట్	తొలి బంతి	1 రన్ (లెగ్‌బై)
1 రన్	రెండో బంతి	1 రన్
4 రన్స్	మూడో బంతి	6 రన్స్
1 రన్	నాలుగో బంతి	6 రన్స్
6 రన్స్	ఐదో బంతి	1 రన్, వికెట్
3 రన్స్ (బైస్)	ఆరో బంతి	1 రన్
16/1	మొత్తం రన్స్	16/1

రెండో సూపర్ ఓవర్ సాగిందిలా...
(అఫ్ఘాన్ లక్ష్యం 12 రన్స్)

భారత్	బంతి	అఫ్ఘానిస్థాన్
6 రన్స్	తొలి బంతి	వికెట్
4 రన్స్	రెండో బంతి	1 రన్
1 రన్	మూడో బంతి	వికెట్
వికెట్	నాలుగో బంతి	.....
వికెట్	ఐదో బంతి	......
11/2	మొత్తం రన్స్	1/2

స్కోరుబోర్డు

భారత్: జైస్వాల్ (సి) నబీ (బి) ఫరీద్ 4, రోహిత్ (నాటౌట్) 121, కోహ్లీ (సి) ఇబ్రహీం (బి) ఫరీద్ 0, దూబే (సి) గుర్బాజ్ (బి) అజ్మతుల్లా 1, శాంసన్ (సి) నబీ (బి) ఫరీద్ 0, రింకూ (నాటౌట్) 69; **ఎక్స్‌ట్రాలు: 17; మొత్తం: 20 ఓవర్లలో 212/4; వికెట్ల పతనం:** 1-18, 2-18, 3-21, 4-22; **బౌలింగ్:** ఫరీద్ 4-0-20-3, అజ్మతుల్లా 4-0-33-1, క్రైస్ 4-0-28-0, సలీమ్ 3-0-43-0, అష్రఫ్ 2-0-25-0, కరీమ్ 3-0-54-0.

అఫ్ఘానిస్థాన్: గుర్బాజ్ (సి) సుందర్ (బి) కుల్దీప్ 50, ఇబ్రహీం (స్టంప్డ్) శాంసన్ (బి) సుందర్ 50, గుల్బదిన్ (నాటౌట్) 55, అజ్మతుల్లా (సి) బిష్ణోయ్ (బి) సుందర్ 0, నబీ (సి) అవేశ్ (బి) సుందర్ 34, జనత్ (రనౌట్/శాంసన్) 2, నజీబుల్లా (సి) కోహ్లీ (బి) అవేశ్ 5, అష్రఫ్ (నాటౌట్) 5; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 212/6; వికెట్ల పతనం:** 1-93, 2-107, 3-107, 4-163, 5-167, 6-182; **బౌలింగ్:** ముకేష్ 4-0-44-0, అవేశ్ 4-0-55-1, బిష్ణోయ్ 4-0-38-0, సుందర్ 3-0-18-3, దూబే 2-0-25-0, కుల్దీప్ 3-0-31-1.

దిద్దుబాటు చర్యలకు శ్రీకారం!

▸ ఔటర్ భూముల ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి' కథనాలకు స్పందన

ఘట్‌కేసర్, జనవరి 17: ఘట్‌కేసర్ మండలంలో ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్‌ఆర్) నిర్మాణం కోసం సేకరించిన భూముల ఆక్రమణలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఈ భూ ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన 'దోస్తీకు సర్వీస్, ఔటర్‌లో చీటర్స్, మృతుడి పేర పట్టాదారు పాసుపుస్తకాలు' వంటి వరుస ప్రత్యేక కథనాలకు స్పందించి దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ బుధవారం పలు మండలాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓఆర్ఆర్ కోసం సేకరించిన భూమి ఎంత ? ఆ భూమి వివరాలు ధరణిలో నమోదయ్యాయా? అనే అంశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. హెచ్ఎండీఏ సేకరించిన భూమి వివరాలను పరిశీలించి ఎక్కడైనా ధరణిలో నమోదు కాకపోతే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. భూములు కోల్పోయిన వారు పరిహారం తీసుకోకుండా కోర్టులో డిపాజిట్ అయిన వారి వివరాలను కూడా ధరణిలో పొందుపర్చాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి సమగ్ర వివరాలు రికార్డుల్లో ఉండాలని స్పష్టం చేశారు. కాగా, ఘట్‌కేసర్ మండలం పడమటిసాయిగూడలో 7.30ఎకరాల భూమిని ఔటర్ కోసం సేకరించగా పరిహారం కూడా చెల్లించారు. అయినా అందులో 5.08ఎకరాలకు మృతి చెందిన వ్యక్తి పేర పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించినన అధికారులు మృతుడి పేర జారీ అయిన పట్టాదారు పేరున ఉన్న భూమిని ధరణి పోర్టల్‌లో ఔటర్ భూమి అని రికార్డులు సవరించారు.

ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి పెట్టండి

▸ అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి దిశానిర్దేశం



హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అదనపు ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. సచివాలయంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి బుధవారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పరిశ్రమలు, గనులు, గృహ నిర్మాణం, హెచ్ఎండీఏ, టీఎస్ఐఐసీ విభాగాల ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల వారీగా పెండింగ్ బకాయిలపై చర్చించారు. హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటి వరకు విక్రయించిన భూములు, వచ్చిన ఆదాయం, పెండింగ్ బకాయిల మీద సమగ్ర సమీక్ష చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన ప్రతిపైసా వదలొద్దని అధికారులకు సూచించారు. పారిశ్రామిక పార్కులను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. తూప్రాన్‌లో పరిశ్రమల కోసం 325 ఎకరాలు ప్రభుత్వం కేటాయించగా ఇప్పటి వరకు 139 ఎకరాలే సేకరించారని, మిగిలిన భూమిని సత్వరమే సేకరించాలని ఆయన ఆదేశించారు. పరిశ్రమల శాఖ పరిధిలో జాయింట్ వెంచర్ల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయ వనరులపై ఆరా తీశారు. హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో 12 జాయింట్ వెంచర్ ప్రాజెక్టులల్లో ఆరు ప్రాజెక్టులు పూర్తయ్యాయని, వాటి నుంచి రూ.955 కోట్లు ప్రభుత్వానికి రావాల్సి ఉండగా రూ.430 కోట్లు వచ్చాయని అధికారులు తెలిపారు. రూ.525 కోట్ల బకాయిలు రాబట్టుకునేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే మైనింగ్ శాఖలో రావాల్సిన ఆదాయంపై భట్టి, అధికారులను అడిగి తెలుసుకున్నారు.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్

పంజాగుట్ట, జనవరి17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. డిసెంబరు 23న ప్రజాభవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో పంజాగుట్ట పోలీసులు షకీల్ పేరును ఎఫ్ఐఆర్, నిందితుల రిమాండ్ రిపోర్టులో చేర్చారు. ప్రమాదానికి కారణమైన షకీల్ కుమారుడు సాహిల్ అలియాస్ రాహిల్ దుబాయ్ పారిపోయేందుకు షకీల్ సహకరించారని పోలీసుల అభియోగం. సాహిల్ దుబాయ్ పారిపోయేందుకు మొత్తం పది మంది సాయపడ్డారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో షకీల్ ఇంట్లో పని చేసే అర్బాజ్(25), కారు డ్రైవర్ సోహైల్(26) ఉన్నారు. ఇక, మాజీ ఎమ్మెల్యే షకీల్, జకీయా, షాహిద్‌పై ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ చేసిన పోలీసులు ఖలీల్, షర్ఫుద్దీన్, అస్లాం అనే వ్యక్తుల కోసం గాలిస్తున్నారు.

పారదర్శకంగా మెడికల్ బోర్డు ఫిట్‌నెస్ పరీక్ష

▸ మోసగాళ్లను నమ్మకండి: సింగరేణి సీఎండీ

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో డ్యూటీలు చేయలేని సింగరేణి ఉద్యోగుల కోసం మెడికల్ బోర్డు చేపట్టే ఫిట్‌నెస్ పరీక్ష అత్యంత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా, అక్రమాలకు తావు లేకుండా నిర్వహిస్తున్నామని ఆ సంస్థ సీఎండీ ఎస్.బలరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ బోర్డులో నిపుణులైన వైద్యులు పరీక్షించి, నిబంధనల ప్రకారం అనారోగ్యులైన ఉద్యోగులను అన్ ఫిట్ చేస్తారని అన్నారు. వారి స్థానంలో కారుణ్య నియామకాలను వెంటనే చేపడుతున్నామని తెలిపారు. అన్ ఫిట్ చేయిస్తామనే మోసగాళ్ల మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని.. అలాంటి వారి పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని కార్మికులకు సూచించారు.

బీజేపీ సర్కార్ వైఫల్యాలపై 'యంగ్ ఇండియా కీ బోల్'

▸ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీ విధానాలపై ప్రజలకు అవగాహన పెంచేందుకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'యంగ్ ఇండియా కీ బోల్ సీజన్-4'ను ప్రారంభిస్తున్నట్టు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో బుధవారం శివసేన రెడ్డి యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి 'యంగ్ ఇండియా కీ బోల్-సీజన్-4' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా యంగ్ ఇండియా కీ బోల్ కార్యక్రమాన్ని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

రాష్ట్రానికి ఆరుగురు ఐపీఎస్‌ల కేటాయింపు

▸ ఇందులో ఇద్దరు తెలంగాణవారే

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఆరుగురు కొత్త ఐపీఎస్(ఇండియన్ పోలీస్ సర్వీస్) అధికారులను కేటాయించింది. 2022 బ్యాచ్‌కు చెందిన ఈ అధికారులను తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ అండర్ సెక్రటరీ అంజన్ సర్కార్.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 200 మంది ఐపీఎస్ అధికారులను వివిధ రాష్ట్రాలకు కేటాయించారు. ఇందులో తెలంగాణకు కేటాయించిన ఆరుగురు ఐపీఎస్‌లలో ఇద్దరు తెలంగాణ రాష్ట్రానికి చెందినవారు కాగా.. మిగతా నలుగురు ఇతర రాష్ట్రాలకు చెందినవారున్నారు. జనరల్ కేటగిరీ కింద అయేషా ఫాతిమా(సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్), మంధారె సోహమ్ సునీల్(మహారాష్ట్ర), మనన్ భట్(జమ్మూకశ్మీర్), ఓబీసీ కేటగిరీ కింద పత్తిపాక సాయికిరణ్(తెలంగాణ), రాహుల్ కాంత్(జార్ఖండ్), రిత్విక్ సాయి కొట్టె(తెలంగాణ)లను రాష్ట్రానికి కేటాయించారు. కాగా.. తెలంగాణకు చెందిన అనుగు శివ మారుతిరెడ్డిని ఒడిసాకు, రావుల జయసింహారెడ్డిని వెస్ట్ బెంగాల్‌కు, ఎస్. దీప్తి చౌహాన్‌ను ఉత్తరప్రదేశ్‌కు కేటాయించారు.

7 టీఎంసీలతో మల్లన్న సాగర్ కడితే సరిపోయేది

▸ టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

సిద్దిపేట అర్బన్, జనవరి 17: మల్లన్నసాగర్ ప్రాజెక్టుపై పూర్తి విచారణ జరిపించాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం రంగాధాంపల్లి అమరవీరుల స్థూపం సమీపంలో ఆయన మాట్లాడారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు అక్కడ అవసరం లేదని చెప్పినా గత ప్రభుత్వం వినలేదని పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో అన్ని టీఎంసీల నీళ్లు ఉండే అవకాశం లేనందున 7 నుంచి 8 టీఎంసీలు ఉంటే బాగుంటుందదని కూడా సూచించామన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు రావాల్సిన పూర్తి ప్యాకేజీ ఇంకా రాలేదని, దానిని వెంటనే చెల్లించే ప్రయత్నం చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని అన్నారు. తనకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఇస్తానని హామీ కూడా ఇచ్చిందని తెలిపారు.

భూకబ్జాదారులు 3 నెలల్లో జైలుకే

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టీకరణ

నల్లగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భూ కబ్జాలు చేసిన వారిని రెండు మూడు నెలల్లో జైలుకు పంపుతామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ఆక్రమణపై 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంపై మంత్రి స్పందించారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని చూపించి, అభినందించారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ప్రభుత్వ భూముల్లో కొండలను తవ్వి విల్లాలకు రోడ్డు నిర్మిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు ఆపించాలని, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్‌కు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. బుధవారం సాయంత్రంలోగా నిర్మాణాలు ఆపి అది ప్రభుత్వ స్థలమని సూచించే బోర్డు, ప్రహరీ ఏర్పాటు చేయిస్తామన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కీలక మంత్రి బావమరిది ప్రభుత్వ భూమిని పట్టపగలు కబ్జా చేశారని, పదేళ్లుగా గత ప్రభుత్వంలో లక్షల కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. 'ధరణి' పేరిట కబ్జా చేసి దోచుకున్న వారి వివరాలు త్వరలో బయటపెడతామని, భూకబ్జా చేసినవారు ఎంతటివారైనా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కబ్జాకు గురైన భూములు కాపాడేలా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోపే చర్యలు తీసుకుంటామన్నారు.



ఖాజాగూడ కబ్జాపై చర్యలు తీసుకోవాలని నవీన్ మిత్తల్‌ను ఫోన్‌లో ఆదేశిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

120 మాసాలు అధికారంలో ఉండి నెల రోజులకే కొంపమునిగినట్టు మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో వెయ్యి కోట్ల విలువైన 400 ఎకరాల కాందిశీకుల భూమిని గత మంత్రి, ఎమ్మెల్యేలు కబ్జా చేయకుండా అడ్డుకున్నానని తెలిపారు.

కబ్జాపై కదిలారు

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఉదయం 10 గంటలకల్లా ప్రాథమిక నివేదిక అందజేయాలని ఆదేశించారు. నల్లగొండలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి.. హైదరాబాద్‌లోని రెవెన్యూ ఉన్నతాధికారుల నుంచి ప్రాథమిక నివేదిక అందిన అనంతరం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కబ్జా బాగోతాన్ని వెలుగులోకి తీసుకొచ్చినట్లు రూఢీ చేసుకున్నారు. నిర్మాణదారులు, అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ నుంచే ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ యంత్రాంగం పరిశీలన

'ఆంధ్రజ్యోతి' కథనంపై మంత్రి ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. ఖాజాగూడ పెద్ద చెరువును అనుకొని నిర్మాణం జరుగుతున్న రోడ్డు పనులను, ఆ ప్రాంతాన్ని బుధవారం రాజేంద్రనగర్ ఆర్డీఓ మల్లయ్యతో పాటు ఇరిగేషన్ ఏఈ నాగరాజు, జీహెచ్ఎంసీ సర్కిల్-20 డిప్యూటీ కమిషనర్ రంజీత్, హైదరాబాద్ మెట్రో అధికారులు సందర్శించారు. దర్జాగా ఘాట్ రోడ్డు తరహాలో సాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. మంగళవారం రాత్రి వరకు బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లతో పనులు జరగ్గా, బుధవారం ఉదయానికి పనులు ఆగిపోయాయి. అక్కడ బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లు ఏవీ లేవు. చెరువు నుంచి కొండపైకి వేసే రోడ్డులో ముందు భాగంలో ఔట్‌పోస్టు వద్ద సెక్యూరిటీ సిబ్బంది కూడా లేరు. అక్కడి కొండలు, గుట్టలను తవ్విన తీరును పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మల్లయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని రాయదుర్గం పాయ్‌గా సర్వే నెంబర్ 66/1లో 7 ఎకరాలు, 66/2లో 1.20 ఎకరాలు మొత్తం 8.20 ఎకరాల భూమిని ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు గతేడాది సెప్టెంబరులో పంచనామా చేసి అప్పగించినట్లు తెలిపారు. చెరువు నుంచి గుట్టపైకి రోడ్డు నిర్మాణం ఏ ప్రభుత్వ విభాగం చేపట్టడం లేదని, అక్రమంగా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అయితే 'ఆంధ్రజ్యోతి'కి కూడా రంగారెడ్డి డీపీఆర్ఓ ద్వారా ఆర్డీఓ లేఖను అందజేశారు. అందులోని వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తాలో సర్వే నెంబర్ 66లో 2009-10 పహాణీ ప్రకారం 109.32 ఎకరాల భూమి 'పోరంబోకు' కింద ఉండగా వివిధ సంస్థలకు ప్రభుత్వం కేటాయింపులు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు పంచనామా చేసి అప్పగించిన 8.2 ఎకరాల స్థలంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు నిర్మించడాన్ని గుర్తించినట్లు వివరించారు. అక్రమంగా రోడ్డేసిన వారిపై క్రిమినల్ కేసుల నమోదుకు ఫిర్యాదు చేశామని, మెట్రో, ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు.





రోడ్డు వేస్తున్న చోట ప్రభుత్వ భూమి అంటూ ఏర్పాటు చేసిన బోర్డు; నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కబ్జా బాధ్యులను కప్పిపుచ్చేందుకు తిప్పలు

శేరిలింగంపల్లి మండలంలో కొన్నాళ్లుగా యథేచ్ఛగా సాగుతున్న కబ్జాలపై అధికార యంత్రాంగం తీరు ఆది నుంచి విస్మయానికి గురి చేస్తోంది. తాజాగా ఓ వైపు 'ఆంధ్రజ్యోతి'లో కథనం.. ఆ వెంటనే మంత్రి ఆదేశాలతోనే ప్రభుత్వ యంత్రాంగం కదిలిందే తప్ప అంతకు ముందు విషయం తెలిసినా రెవెన్యూ, జీహెచ్ఎంసీ యంత్రాంగం ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ప్రభుత్వ భూమిలో కొండలను తొలుస్తూ రోడ్డేస్తున్న వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' వారం రోజుల ముందే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, హెచ్ఆర్‌డీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళి వివరణ కోరింది. ఆ సందర్భంలో తమకు తెలియదని, తాము ఎలాంటి అనుమతివ్వలేదంటూ అధికారులు చెప్పుకొచ్చారు తప్ప ఎలాంటి చర్యలకూ ఉపక్రమించలేదు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన తర్వాతే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులు హడావుడి చేశారు. కబ్జా ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. కబ్జా బాధ్యులను అధికారులెవ్వరూ గుర్తించలేదు. ఆ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు తవ్వకాలు జరిపారనే దాన్ని పరిశీలించారు. తవ్వకాల ఆధారంగా ఏ నిర్మాణ సంస్థ పనులు చేపట్టిందో గుర్తించడం సులువు. కానీ అదేమీ చేయలేదు. పరిసర ప్రాంతాల వారిని అధికారులు కనీసం ఆరా తీయలేదు. కబ్జా బాధ్యులను కప్పిపుచ్చే విధంగా అధికారుల తీరు ఉందని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోడ్డేసేది 'గుర్తు తెలియని' వ్యక్తులట!

ఖాజాగూడ పెద్దచెరువును అనుకొని కొండలు గుట్టలను తొలుస్తూ రోడ్డేయ్యడంపై శేరిలింగంపల్లి ఆర్ఐ బుధవారం సాయంత్రం రాయదుర్గం ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు కాపీని అందజేయడానికి రెవెన్యూ అధికారులు ఆసక్తి చూపలేదు. రాయదుర్గం ఎస్ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తా సర్వే నెంబర్ 66/1లో ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ శేరిలింగంపల్లి మండల అదనపు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంబాబు ఫిర్యాదు చేశారని, దాంతో కబ్జా చేయడం, పబ్లిక్ ఆస్తులను ధ్వంసం చేయడం లాంటి అంశాల ఆధారంగా 447, 427 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. రెవెన్యూ అధికారులు చేసిన ఫిర్యాదులో ప్రభుత్వ భూమిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ పేర్కొనడం గమనార్హం. చెరువు పక్కనే ఔట్‌పోస్టు ఏర్పాటు చేసి మరీ యథేచ్ఛగా ఘాట్ రోడ్డు తరహాలో పనులు సాగించగా.. కూలీలు గుర్తు తెలియనివారు అయినా.. పనులు చేయించిన సంస్థ గుర్తు తెలియనిది ఎలా అవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొండలు, గుట్టలను తొలిచేసి అక్రమంగా రోడ్డేస్తున్నవారు స్థానికంగా అధికార యంత్రాంగానికి తెలిసినప్పటికీ తెలియదన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వెనుక మాజీ మంత్రి బామ్మర్ది ప్రమేయం ఉండడంతో వారి పేర్లను చేరిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు పడతామని జంకుతున్నట్లు తెలిసింది. అందుకే నిర్మాణ సంస్థ పేరు కానీ, కీలక వ్యక్తుల పేర్లు చేర్చలేదని తెలుస్తోంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే విచారణలో వారే బయటపెడతారని భావించినట్లు సమాచారం. ఆది నుంచి రెవెన్యూ అధికారుల తీరు తమ చేతులకు మట్టి అంటకుండా తప్పించుకుంటున్నట్లు ఉండడం గమనార్హం.

చడీచప్పుడు లేని మెట్రో అధికారులు

బయో డైవర్సిటీ సర్కిల్ పక్కనే దాదాపుగా రూ.1,200 కోట్లకు పైగా విలువైన 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని మెట్రో అధికారులకు అప్పగిస్తే వారు కనీసం ఆ వైపు తొంగి చూడలేదు. తమ భూమి అంటూ ఇప్పటి వరకు ఎలాంటి బోర్డు కూడా అక్కడ పాతలేదు. 'కూల్‌గా కబ్జా' కథనం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారి మంత్రితో పాటు ఉన్నతాధికారులు స్పందించారు. కానీ సరిగ్గా నాలుగు నెలల క్రితం ఐటీ కారిడార్‌లో గజం రూ.3 లక్షలకు పైగా ధర పలికే ప్రాంతంలో 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని పొందిన హెచ్ఎంఆర్ఎల్ ఉన్నతాధికారులు చడీచప్పుడు లేకుండా ఉన్నారు. ఒకరిద్దరు అధికారులను రెవెన్యూ అధికారులకు తోడుగా పంపి చేతులు దులుపుకున్నారు. పంచనామా చేసి హెచ్ఎంఆర్ఎల్ అధికారులకు అప్పగించామని రెవెన్యూ అధికారులు చెబుతున్నా నాటి రంగారెడ్డి కలెక్టర్ నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదని అధికారుల్లోనే చర్చ నడుస్తోంది. తమకు సంబంధం లేదని రెవెన్యూ, తమకు ఆదేశాలు అందలేదని హెచ్ఎంఆర్ఎల్ దోబుచులాడుతుండగా మధ్యలో నందట్లో సడేమియాలా ప్రముఖ నిర్మాణ సంస్థ దర్జాగా రోడ్డేసుకోవడం విశేషం.

నామినేటెడ్ పదవుల్లో ఆదివాసీలకు ప్రాధాన్యం కల్పించాలి

▸ ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్

▸ సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, బెల్లయ్యనాయక్, జగ్గారెడ్డి


హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ నాయకులకు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల నియామకంలో ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలని సమావేశం తీర్మానం చేసింది. బుధవారం గాంధీభవన్‌లో ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తదితరులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ మండల, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులను, కార్యకర్తలను అభినందించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గిరిజన విభాగం కాంగ్రెస్ గెలుపు కోసం గ్రామస్థాయిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకునేలా పాటుపడాలని నాయకులకు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర లక్ష్యాలను ప్రతి గిరిజన కుటుంబానికి చేరవేయాలని ఆమె సూచించారు.



ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, రోహిత్, బెల్లయ్య నాయక్, జగ్గారెడ్డి తదితరులు

అభివృద్ధికోసం తండ్లాడి.. ఎన్నికల్లో తడబడ్డాం!

(మొదటిపేజీ తరువాయి)



స్థానం అధికారం నుంచి ప్రతిపక్షానికి మారింది. దీనికి అధైర్య పడాల్సిన అవసరం లేదు. ఓటమి నుంచి తేరుకుని నెలరోజులకే సమీక్ష సమావేశాలను ప్రారంభించాం. ఇది పదకొండో పార్లమెంటరీ స్థాయి సమావేశం. కార్యకర్తల నుంచి విలువైన సూచనలు వచ్చాయి. కార్యకర్తలు కోరుకుంటున్న ప్రకారమే ఇకపై పార్టీ పనిచేస్తుంది. మోసపూరిత హామీలతో గెలిచిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. వాటిని అమలు చేయమని అడిగితే.. కాకమ్మ కథలు చెబుతోంది" అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వరుసగా పదేళ్ల పాలన సాగించడం అరుదని, ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుని ఐదేళ్లలోపే ఇంటికి పోయిన కాంగ్రెస్ ప్రభుత్వాలే ఈ దేశంలో ఎక్కువగా ఉన్నాయన్నారు. అరచేతిలో వైకుంఠం చూపేలా కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తెచ్చిందని, హామీల అమలు గడువు ప్రకారం వంద రోజులు కాలేదని ఆగామని, లేకుంటే.. కాంగ్రెస్ సర్కారును చీల్చి, చెండాడే వారిమన్నారు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలకు నిధుల్లేవని ఆ రాష్ట్ర సలహాదారు చెబుతున్నారని, ఇక్కడ కూడా కాంగ్రెస్ నేతలు చావుకబురు చల్లగా చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని జోస్యం చెప్పారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దావోస్‌కు వెళ్లడమంటే ఖర్చు దండగ అన్నారు. ఇప్పుడేమంటారు? సీఎం బృందం దావోస్‌కు వెళ్లింది. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హత్యారాజకీయాలు మొదలు పెడుతోంది" అని హరీశ్ మండిపడ్డారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్‌పైనా హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. "కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ కొంటారని బండి సంజయ్ చెబుతున్నారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలను కూల్చిన, పలు ప్రాంతీయ పార్టీలను చీల్చిన చరిత్ర బీజేపీదే. ఆ విషయాన్ని ఆయన తెలుసుకోవాలి" అని సూచించారు.

కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్లే..

అధికారంలో ఉన్నన్ని రోజులు పార్టీ కార్యకర్తలను, ముఖ్య నాయకులు పట్టించుకోనేలేదని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసు కునేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదని నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం పరిధిలోని పలు అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారని తెలిసింది. పక్క పార్టీల వల్ల కాకుండా.. సొంత పార్టీ నేతలే ముంచారని ఆరోపించినట్లు సమాచారం. పార్టీ ఓటమికి కారణాలు చెబుతూ.. అధిష్ఠానం తీరుపైనా పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. "అసంతృప్తి మొదలైనప్పుడే బుజ్జగించి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది. జూపల్లి కృష్ణారావు లాంటి వారు పార్టీని వీడడం వల్ల నష్టం వాటిల్లింది" అని వారు అభిప్రాయపడ్డట్లు తెలిసింది.

రాష్ట్రం పరువు తీసేలా రేవంత్ వ్యాఖ్యలు

దావోస్ పర్యటనలో ఉన్న సీఎం రేవంతర్ తెలంగాణ గురించి చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్రం పరువు తీసేలా ఉన్నాయని బీఆర్ఎస్ నేతలు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, విజయుడు, జైపాల్‌యాదవ్ ఆరోపించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. విదేశీ పర్యటనల్లో సీఎం అసంబద్ధ వ్యాఖ్యలు చేయడం తగదని, ఇటువంటి పరిస్థితులు ఇకపై రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు.

కేసీఆర్ నడుస్తున్నారు...!

'ఎక్స్'లో వీడియో పోస్టు చేసిన ఎంపీ సంతోష్

హైదరాబాద్, జనవరి17(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో బీఆర్ఎస్ శ్రేణులకు ఎంపీ సంతోష్ కుమార్ శుభవార్త చెప్పారు. శస్త్ర చికిత్స అనంతరం మాజీ సీఎం కేసీఆర్ క్రమంగా కోలుకుంటున్నారని, చేతికర్ర సాయంతో నెమ్మదిగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. స్వగృహంలో కేసీఆర్ నడుస్తున్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన ఆయన, ప్రతి అడుగు దృఢ సంకల్పంతో వేస్తున్నారని తన ఎక్స్ వేదికలో పేర్కొన్నారు.

డీఎస్సీకి అనుబంధ నోటిఫికేషన్!

(మొదటిపేజీ తరువాయి)

డీఎస్సీ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. కాగా, గత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌తో టీచర్ పోస్టుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ పోస్టులకు సంబంధించి గత ఏడాది నవంబరు 20 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో పరీక్షలను వాయిదా వేశారు. వాటిని మళ్లీ ఎప్పుడు నిర్వహించే అంశాన్ని ప్రకటించలేదు. ఆ తరువాత ప్రభుత్వం మారిపోగా.. కొత్త ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించింది. అయితే పాత నోటిఫికేషన్‌ను రద్దు చేస్తే... సాంకేతికంగా సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్న అంచనాకు వచ్చింది. ముఖ్యంగా 1.77 లక్షల మంది అభ్యర్థులు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నందున.. వారి నుంచి ఆందోళన ఎదురవుతుందని భావిస్తున్నారు. ఈ సమస్య రాకుండా గత నోటిఫికేషన్‌కు అనుబంధంగా మరో నోటిఫికేషన్ జారీ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఇందులో కొత్తగా చేర్చిన పోస్టుల వివరాలను పొందుపరిచి, అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి మరో అవకాశం ఇవ్వనున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం ఉండదు.

విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేకపోయినా..

మెగా డీఎస్సీలో సుమారు 12 వేల ఉపాధ్యాయ పోస్టుల వరకు ఉండవచ్చని భావిస్తున్నారు. కొత్తగా చేర్చే వాటిలో స్పెషల్ టీచర్ పోస్టులు 1,523 వరకు ఉంటాయి. అదనంగా మరో 4,281 ఖాళీ పోస్టులను గుర్తించారు. వీటితోపాటు మోడల్ స్కూళ్లలో మరో 1,000 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. గతంలో పదోన్నతులు కల్పించడం ద్వారా మరికొన్ని పోస్టులు ఖాళీ అయ్యాయి. వాటిని కూడా మెగా డీఎస్సీలో చేర్చనున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేదు. అయినప్పటికీ ఇలాంటి పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులను ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేషనలైజేషన్ ద్వారా ఇలాంటి పాఠశాలల్లోని పోస్టులను రద్దు చేయాలనే ప్రతిపాదన గతంలో ఉండేది. తాజాగా దీనిని ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 26 వేల పాఠశాలలు ఉండగా.. వీటిలో సుమారు 6వేల స్కూళ్లలో ఏకోపాధ్యాయుడే ఉన్నారు. మరో 1,290 పాఠశాలల్లో 'జీరో' అడ్మిషన్లు నమోదయ్యాయి. వీటన్నింటిలో ఖాళీల భర్తీ కోసం నిర్వహించే డీఎస్సీ పరీక్షలను రాష్ట్రం యూనిట్‌గా నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా జిల్లాల వారీగా మెరిట్ జాబితాను రూపొందించి.. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఉపాధ్యాయ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనుంది. ఎలాంటి ఇంటర్వ్యూలు లేకుండా పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగానే పోస్టుల భర్తీ జరగనుంది.

ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తాం: కోమటిరెడ్డి

నల్లగొండ: ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. గ్రూప్స్ పరీక్షలు కూడా నిర్వహిస్తామని, గత ప్రభుత్వంలో పేపర్ లీకులు జరిగినట్లుగా కాకుండా యూపీఎస్సీ తరహాలో వీటిని నిర్వహిస్తామని చెప్పారు. బుధవారం నల్లగొండలో ఆయన విలేకరులతో మాట్లాడు ఈ విషయం చెప్పారు. నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు.

రైతు డిక్లరేషన్ అమలు చేసి తీరుతాం

» నెలాఖరులోగా ఖాతాల్లో రైతు బంధు డబ్బు: తుమ్మల

నందిపేట, జనవరి 17: రైతు డిక్లరేషన్‌ను అమలు చేసి తీరుతామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టంచేశారు. ఈనెలాఖరులోగా రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బు జమ చేస్తామని తెలిపారు. బుధవారం ఆయన నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం ఆంధ్రనగర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలు కాపాడే అంశంలో తమ ప్రభుత్వం రాజీపడదని స్పష్టం చేశారు.

వ్యవసాయ శాఖలో పెండింగ్ సమస్యలపై దృష్టి

వ్యవసాయ శాఖలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి తుమ్మల హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని విశ్వేశ్వరాయ భవన్‌లో బుధవారం తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్(టాడా) డైరీ, క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. టాడా సభ్యులు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ సందర్భంగా మంత్రికి విన్నవించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి.. సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపిని ఆదేశించారు.

అప్పులకు వడ్డీలే ఏడాదికి 40 వేల కోట్లు: జూపల్లి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జనవరి 17: గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఏడాదికి సుమారు రూ.40వేల కోట్ల వడ్డీ కట్టాల్సి ఉంటుందని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. బుధవారం వనపర్తి జిల్లా అధికారులతో ప్రభుత్వ శాఖలపై ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఇటీవలి అసెంబ్లీ సమావేశంలో చర్చ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి రూ.7లక్షల కోట్లు అప్పు ఉన్నట్లు తేలిందని చెప్పారు. గత పాలకులు మాత్రం బుకాయిస్తున్నారని విమర్శించారు.

బీఆర్ఎస్ పాలనలోనే మేడారంపై నిర్లక్ష్యం

» జాతరను రాజకీయం చేయొద్దు : మంత్రులు సురేఖ, సీతక్క

ములుగు/మేడారం, జనవరి 17: బీఆర్ఎస్ పాలనలోనే మేడారం జాతర నిర్లక్ష్యానికి గురైందని మంత్రులు కొండా సురేఖ, సీతక్క విమర్శించారు. రూ.200 కోట్లతో 200 ఎకరాలలో జాతరను అభివృద్ధి చేస్తామనే హామీని విస్మరించిన వారిని ప్రశ్నించకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై కొందరు పనిగట్టుకొని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. జాతరను రాజకీయం చేయకుండా విజయవంతంగా జరిపించేందుకు సహకరించాలని హితవు పలికారు. బుధవారం వారు మేడారంలో పర్యటించి, సమ్మక్క, సారలమ్మ గద్దెలను దర్శించుకున్నారు. అనంతరం పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జనవరి చివరికల్లా పనులన్నీ పూర్తికావాలని అధికారులను ఆదేశించారు. జాతరను రాజకీయం చేస్తున్న వారు యాదాద్రి పునఃనిర్మాణంలో జరిగిన లోపాలను గుర్తు చేసుకోవాలని సూచించారు.

కేజీబీవీలకు వార్డెన్లను నియమించాలి !

» ఉప ముఖ్యమంత్రి భట్టిని కోరిన ప్రధానోపాధ్యాయులు

హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు(కేజీబీవీ), మోడల్ స్కూళ్ల హాస్టళ్ల నిర్వహణకు పూర్తిస్థాయి వార్డెన్లను నియమించాలని తెలంగాణ గెజిటెడ్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భానుచంద్రప్రకాశ్ బుధవారం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కను కోరారు. కేజీబీవీ, మోడల్ స్కూళ్లల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక అధికారిణిలకు కనీసం రూ.10 వేల అలవెన్సును చెల్లించాలని కోరారు.

ఖమ్మం మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి

ఖమ్మం మార్కెట్, జనవరి 17: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ బుధవారం ఎరుపు ఎక్కింది. బుధవారం సుమారు 23వేల మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. ఈ సీజన్‌లో ఇంత పంట ఒకేసారి మార్కెట్‌కు రావడం ఇదే మొదటిసారి. నెల రోజులుగా రోజుకు 5వేల నుంచి 10వేల బస్తాలు మార్కెట్‌కు వస్తున్నాయి. మార్కెట్‌లో తేజారకం ఎండు మిర్చి క్వింటాకు రూ.21,300 జెండాపాట ధర నిర్ణయించగా వ్యాపారులు నాణ్యతను బట్టి క్వింటాలు రూ.6,300 నుంచి రూ.18,000 వరకు కొనుగోలు చేశారు. తాలు మిర్చి రకాన్ని బట్టి క్వింటాలు రూ.7,000 నుంచి రూ.12,000 వరకు కొనుగోలు చేశారు. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచిన ఏసీ మిర్చి క్వింటాలు రూ.23వేలు పలికింది. ఇక కొత్త పత్తి క్వింటాలుకు రూ.6,700, పాత పత్తి క్వింటాలు రూ.6,600 పలికింది.

మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం వద్దు

» అది పురుషుల పట్ల వివక్షే: హైకోర్టులో దావా

హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ఉద్దేశించిన జీవో 47ను కొట్టేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. హైదరాబాద్ నాగోల్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి ఎ.హరిందర్‌కుమార్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. రోడ్ ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్-1950 ప్రకారం ఆర్టీసీ ఏర్పడిందని, ఆర్టీసీకి సంబంధించి విధాన నిర్ణయాలు తీసుకునే అధికారం కేంద్ర ప్రభుత్వానికే తప్ప రాష్ట్ర ప్రభుత్వానికి ఉండదని పేర్కొన్నారు. మహిళలకు మాత్రమే ఉచితం అని ప్రకటించడం పురుషుల పట్ల వివక్ష చూపించడం కిందకే వస్తుందని తెలిపారు. ఇది రాజ్యాంగం నిర్దేశిస్తున్న సమానత్వపు హక్కుకు వ్యతిరేకమని పేర్కొన్నారు. పురుషులు డబ్బులు పెట్టి టికెట్లు తీసుకున్నా వారికి హక్కుగా ఉండాల్సిన సీట్లను కేటాయించడం లేదని పేర్కొన్నారు. ఉచిత ప్రయాణం అధిక రద్దీకి, అవసరంలేని ప్రయాణానికి దారితీస్తుందని, నిజమైన ప్రయాణికులు ఇబ్బంది పడతారని వివరించారు. రిజిస్ట్రీ ఈ పిటిషన్‌కు రెగ్యులర్ నంబర్ కేటాయించిన తర్వాత హైకోర్టు ఎదుట విచారణకు రానుంది.

ప్రభుత్వ ప్రకటనలపై.. మార్గదర్శకాలను పాటించాలి: హైకోర్టు

రాష్ట్ర ప్రభుత్వం జారీచేసే ప్రకటనల విషయంలో సుప్రీంకోర్టు జారీచేసిన మార్గదర్శకాలను అమలు చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వ ఖర్చుతో జారీచేసే ప్రకటనల్లో అధికారంలో ఉన్న పార్టీ నాయకుల ఫొటోలను వినియోగిస్తూ వారి వ్యక్తిగత ప్రాభవాన్ని పెంచుకునేలా వ్యవహరిస్తున్నారని, అందువల్ల నిబంధనలు పాటించేలా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం.. ఇదే అంశానికి సంబంధించి 'కామన్ కాజ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు ఓ కమిటీని నియమించిందని పేర్కొంది. ఆ కమిటీ జారీచేసిన మార్గదర్శకాలను అమలు చేయాలని అన్ని రాష్ట్రాలకు నిర్దేశించిందని గుర్తుచేస్తూ.. వాటిని పాటించాల్సిందేనని ఆదేశించింది.

21న షర్మిల బాధ్యతల స్వీకరణ

» ఇడుపులపాయలో తండ్రి సమాధి వద్ద ఏపీసీసీ సారథిగా బాధ్యతలు



తన కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను పవన్‌కు అందజేస్తున్న వైఎస్ షర్మిల

అమరావతి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల ఈ నెల 21న బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది. ఇడుపులపాయలో తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమాధి చెంత ఆమె పీసీసీ పగ్గాలు చేపడతారని సమాచారం. వైఎస్ అనుచరులు, అభిమానులు పెద్దఎత్తున అక్కడకు చేరుకుని ఆమెకు మద్దతు పలుకనున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ ప్రత్యేక అతిథిగా హాజరవుతారు. రాష్ట్ర విభజనతో ఆంధ్రలో నామరూపాల్లేకుండా పోయిన కాంగ్రెస్‌లో జవసత్వాలు నింపేందుకు ఆ పార్టీ అగ్ర నాయకత్వం ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే. కర్ణాటకలో ట్రబుల్ షూటర్‌గా పేరుగాంచిన డీకే శివకుమార్‌ను కేపీసీసీ అధ్యక్షుడిగా నియమించిన ఏఐసీసీ.. కన్నడ నేలలో బలంగా ఉన్న బీజేపీని గద్దె దించింది. తెలంగాణ సెంటిమెంట్‌తో గెలిచి గద్దెనెక్కి, రాజకీయంగా బలంగా ఉన్న బీఆర్ఎస్‌ను దించేందుకు రేవంత్‌రెడ్డిని ప్రయోగించి అనూహ్యంగా అధికారమే కైవసం చేసుకుంది. ఇప్పుడు ఆంధ్రలో పుంజుకోవడానికి వైఎస్ కుమార్తెను బరిలోకి దించుతోంది.

ఇడుపులపాయ నుంచే అడుగులు

అన్న జైలుకు వెళ్లినప్పుడు వేల కిలోమీటర్ల పాదయాత్ర చేసి.. 'జగనన్న వదిలిన బాణాన్ని' అంటూ ప్రజల్లోకి చొచ్చుకెళ్లిన షర్మిల.. ఇప్పుడు రాజన్న పార్టీ బాణమై జగనన్నపైకి దూసుకెళ్లిందని కాంగ్రెస్ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. జగన్ తన పాదయాత్ర ప్రారంభించిన ఇడుపులపాయ నుంచే ఆమె ముందడుగు వేయనున్నారు. కుమారుడు రాజారెడ్డి వివాహ పత్రికను తండ్రి సమాధిపై ఉంచిన తర్వాతే తాడేపల్లి వచ్చి అన్నను ఆహ్వానించిన ఆమె.. అక్కడి నుంచి ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 17న ఆమె కుమారుడి పెళ్లి. గురువారం హైదరాబాద్‌లో నిశ్చితార్థ వేడుక జరుపనున్నారు. మర్నాడు శుక్రవారం రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు, తన తండ్రి అనుచరులతో సమావేశమవుతారు. 21న ఇడుపులపాయలో బాధ్యతలు స్వీకరిస్తారని పీసీసీ వర్గాలు తెలిపాయి.

నేడు హైదరాబాద్‌కు జగన్

ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం సాయంత్రం 6.15 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి హైదరాబాద్‌కు వెళతారు. గండిపేటలోని గోల్కొండ రిసార్ట్స్‌లో సోదరి వైఎస్ షర్మిల కుమారుడి వివాహ నిశ్చితార్థ వేడుకలో పాల్గొంటారు. నూతన దంపతులను ఆశీర్వదిస్తారు.

సాగర్, శ్రీశైలం చేజారినట్లే!

(మొదటి పేజీ తరువాయి)

తెలిసింది. ఈ సందర్భంగా.. మళ్లీ రిజర్వాయర్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఆర్ఎంసీ)ని పునరుద్ధరించాలని నిర్ణయించారు. సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల అప్పగింతకు సాంకేతికంగా ఉన్న ఇబ్బందులపై వారం రోజుల్లో ఆర్ఎంసీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఆర్ఎంసీ నివేదిక అనంతరం నెల రోజుల్లోగా ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించేందుకు అవసరమైన లాంఛనాలు ప్రారంభించాలని తెలుగు రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం కోరింది. సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించాకే ఆపరేషన్ ప్రొటోకాల్, రూల్‌కర్వ్‌లను ఫైనలైజ్ చేయాలని సీడబ్ల్యూసీకి కేంద్రం ఆదేశించింది. గతేడాది నవంబరు 29న తెలంగాణ శాసనసభ ఎన్నికల కోసం రాష్ట్ర పోలీసులంతా బందోబస్తులో ఉండగా.. నాగార్జునసాగర్ డ్యామ్ ఏపీ వైపు భాగాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో స్వాధీనం చేసుకోవడం, గేట్లను ఎత్తి నీటిని విడుదల చేసుకోవడం తెలిసిందే. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం పలు దఫాలుగా సమావేశాలు పెట్టిన తర్వాత నీటి విడుదల ఆగిపోయింది. అయితే ఇప్పటికీ డ్యామ్‌పై ఏపీ పోలీసులు మోహరించే ఉన్నారు. దాంతో నవంబరు 29కి ముందున్న స్థితిని పునరుద్ధరించాలని తెలంగాణ కోరుతుండగా.. ఏపీ వైపు గేట్ల నిర్వహణ తామే చూసుకుంటామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాదిస్తోంది.

ఇక అంతా కేంద్రం చేతుల్లోనే!

తాజాగా తాగునీటి అవసరాలకు ఏపీకి 5 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కృష్ణా బోర్డు నిర్ణయం తీసుకోగా.. ఆ నీటిని ఎవరు విడుదల చేయాలనే అంశంపై సందిగ్ధం నెలకొంది. తెలంగాణ అభ్యంతరాల నేపథ్యంలో సాగర్ ప్రాజెక్టు కృష్ణా బోర్డు తాత్కాలిక నిర్వహణలోకి వెళ్లింది. బోర్డు అధికారులే ఇటీవల ఏపీకి తాగునీటిని విడుదల చేశారు. ఇకపై జలవిద్యుత్తు ఉత్పత్తి చేయాలన్నా, రివర్సబుల్ పంపింగ్ చేయాలన్నా, పంటలకు నీరు విడుదల చేయాలన్నా, తాగునీటి అవసరాలు తీర్చాలన్నా కేంద్ర అధికారుల అధీనంలోని కృష్ణా బోర్డు



యంత్రాంగమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల నిర్ణయాలేవీ చెల్లుబాటు కావు. నీళ్లు కావాలంటే ఇండెంట్ సమర్పిస్తే.. ఆ ఇండెంట్ ఆధారంగా బోర్డు తుది నిర్ణయం తీసుకుంటుంది. అయితే కృష్ణా జలాల్లో రెండు రాష్ట్రాల వాటాకు సంబంధించిన వివాదమే ఇంకా పరిష్కారం కాలేదు. తాత్కాలిక ఏర్పాట్ల కింద 2015లో తీసుకున్న 66(ఏపీ):34(తెలంగాణ) నిష్పత్తితో నీటి పంపిణీకి అంగీకరించబోమని, కృష్ణా జలాలను చెరిసగం పంచాల్సిందేనని తెలంగాణ ఇదివరకే స్పష్టం చేసింది. కానీ, తెలంగాణ ప్రతిపాదనలను అంగీకరించే ప్రసక్తే లేదని ఏపీ అంటోంది. దీంతో నీటి కేటాయింపులు తేలకుండా ఏ ప్రాతిపదికన నీటిని కృష్ణా బోర్డు విడుదల చేస్తుందన్నది తేలాల్సి ఉంది. పైగా.. ప్రాజెక్టుల అప్పగింతకు సంబంధించి నిర్ణయాలైతే తీసుకుంటున్నారు గానీ.. అప్పగింత సాధ్యమేనా.. అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అప్పగింతపై ఇప్పటికే పలుమార్లు గడువులు విధించినా.. కార్యరూపం దాల్చకపోవడమే ఇందుకు కారణం. ఈ సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్ వోహ్రా, రాష్ట్ర అధికారులు పాల్గొన్నారు.

వచ్చే నెలలో ఎన్‌డీఎస్‌ఏ బృందాల పర్యటన

నాగార్జునసాగర్, శ్రీశైలం డ్యామ్‌ల రక్షణపై జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) దృష్టి సారించింది. రెండు డ్యామ్‌ల రక్షణ కోసం కమిటీలు వేసింది. ఈ బృందాలు ఫిబ్రవరిలో నెలలో క్షేత్ర స్థాయిలో పర్యటించనున్నాయి. ఆ కమిటీ నివేదికల ప్రకారం డ్యామ్‌ల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. వాస్తవానికి ఏడాదిన్నర కిందటే ఈ రెండు డ్యామ్‌లు ఏ మాత్రం సురక్షితం కాదని కృష్ణానది యాజమాన్యబోర్డు(కేఆర్ఎంబీ) తేల్చింది. డ్యామ్ సేఫ్టీ నిపుణుడు, కేఆర్ఎంబీ మెంబర్ రవికుమార్ పిళ్లై నేతృత్వంలోని బృందం ఈ నివేదికను తయారుచేసిన విషయం విదితమే. కృష్ణా నదిపై మూడు ఆనకట్టలు అంత రాష్ట్ర ఖాతాలో ఉన్నాయి. శ్రీశైలంతో పాటు నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులు ఈ జాబితాలో ఉన్నాయి. డ్యామ్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం అంతరాష్ట్ర డ్యామ్‌ల రక్షణపై తుది నిర్ణయం కేంద్రానిదే. తాత్కాలిక పరిశీలన ప్రకారం శ్రీశైలం డ్యామ్ దిగువ భాగంలో అత్యవసర మరమ్మతులకు రూ.800 కోట్లు కావాల్సి ఉందని, ఆ తర్వాత నాగార్జునసాగర్ మరమ్మతులకు రూ.20 కోట్లు అవసరం ఉందని కేఆర్ఎంబీ గుర్తించింది. పులిచింతల మరమ్మతులకు రూ.10 కోట్లు అవసరమని తేల్చారు.

కమిటీల సభ్యులు వీరే..

నాగార్జునసాగర్ డ్యామ్ పరిశీలన కమిటీకి జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి చెందిన సాంకేతిక సభ్యుడు రాకేశ్ కశ్యప్ నేతృత్వం వహించనుండగా.. ఎన్‌డీఎస్ఏ డైరెక్టర్(రెగ్యులేషన్) ఎంఎస్ వర్మ, డిప్యూటీ డైరెక్టర్ మహ్మద్ జీషన్, కన్సల్టెంట్ రాకేష్ గౌరానా, సీడబ్ల్యూసీ చైర్మన్ నామినేషన్ చేసే డైరెక్టర్ స్థాయి అధికారి, కేఆర్ఎంబీ సభ్యుడు, ఏపీ, తెలంగాణ నుంచి చీఫ్ ఇంజనీర్ స్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారు. ఎన్‌డీఎస్ఏ సభ్యుడు వివేక్ త్రిపాఠి నేతృత్వంలో డిప్యూటీ డైరెక్టర్ అమిత్ మిత్తల్, కన్సల్టెంట్ కమలేష్ జైన్ ఎన్‌డీఎస్ఏ నుంచి ఉండగా.. సీడబ్ల్యూసీ చైర్మన్ నామినేట్ చేసే అధికారి, సీఎస్ఎంఆర్ఎస్ డైరెక్టర్ నామినేట్ చేసే సైంటిస్ట్‌తో పాటు తెలుగు రాష్ట్రాల నుంచి చీఫ్ ఇంజనీర్ స్థాయి అధికారులు కమిటీలో ఉంటారు.

కాళేశ్వరంపై మళ్లీ విజిలెన్స్ విచారణ

» మేడిగడ్డకు 20 మంది అధికారులు

» డీజీ రాజీవ్ రతన్ నేతృత్వంలో తనిఖీలు

మహదేవపూర్ రూరల్, జనవరి 17: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మరోసారి విచారణ ప్రారంభించారు. డీజీ రాజీవ్ రతన్ నేతృత్వంలో 20 మంది అధికారుల బృందం బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం చేరుకుంది. మధ్యాహ్నం 2 గంటలకు కాళేశ్వరం హరిత హోటల్ చేరుకున్న డీజీ, ఇతర అధికారులు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. పలు అంశాలను సమీక్షించిన అనంతరం మేడిగడ్డ బ్యారేజీ వంతెన దెబ్బతిన్న ప్రాంతానికి చేరుకున్నారు. వంతెన కుంగుపాటుపై అక్కడున్న ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తొలుత బ్యారేజీ వంతెనపై నుంచే కుంగుబాటుకు గురైన పిల్లర్లను పరిశీలించారు. బ్యారేజీలో నీటి నిల్వలు లేకపోవడంతో మహారాష్ట్ర వైపు నుంచి గోదావరి నదిలోకి వెళ్లారు. దెబ్బతిన్న 20వ పిల్లరును విజిలెన్స్ అధికారులు స్వయంగా పరిశీలించినట్టు తెలిసింది. బ్యారేజీ పరిశీలన అనంతరం మేడిగడ్డ బ్యారేజీ కంట్రోల్ కార్యాలయంలో అక్కడి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సుమారు 10 నిమిషాలపాటు ఈ సమావేశం జరిగింది. అనంతరం తిరిగి కాళేశ్వరం హరితహోటల్‌కు తిరిగి వెళ్లిపోయారు. రాత్రి మరోమారు ఇరిగేషన్ అధికారులతో సమీక్షించినట్టు తెలిసింది. ఈ సమీక్షలకు మీడియాతో పాటు స్థానిక పోలీసులను సైతం దూరంగా ఉంచారు.

వారం రోజుల్లోనే..

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎస్పీ రమేష్ నేతృత్వంలో ఈనెల 9న మేడిగడ్డను సందర్శించారు. మూడు రోజుల పాటు తనిఖీలు నిర్వహించి కీలక ఫైళ్లు, హార్డ్‌డిస్కులను స్వాధీనం చేసుకున్నారు. వారం రోజులు కూడా గడవక ముందే మరోమారు డీజీ స్థాయి అధికారితో విచారణ ప్రారంభించడం చర్చనీయాంశంగా మారింది. కాళేశ్వరం కేంద్రంగా ఈ బృందం మరో రెండు రోజులపాటు విచారణ చేపట్టనున్నట్లు తెలిసింది.

బతుకమ్మ చీరల బకాయిలు 220కోట్లను వెంటనే చెల్లించాలి

» తీవ్ర సంక్షోభంలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ

» సీఎం రేవంత్‌కు బండి సంజయ్ లేఖ

సిరిసిల్ల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని, పరిశ్రమపై ఆధారపడిన 20 వేల మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఏడేళ్లుగా ప్రభుత్వ ఆర్డర్లపైనే మనుగడ సాగిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని పరిశ్రమకు భారీగా ప్రభుత్వ ఆర్డర్లు ఇచ్చి కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి బుధవారం బండి సంజయ్ బహిరంగ లేఖ రాశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి గత బీఆర్ఎస్ సర్కారుతో పాటు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు. ప్రధానంగా బతుకమ్మ చీరలకు సంబంధించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.220 కోట్ల బకాయిలను చెల్లించలేదని, అవి చెల్లించకపోవడమే ఈ దుస్థితికి కారణమని విమర్శించారు. బకాయిలను చెల్లిస్తామని అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ పలు మార్లు హామీ ఇచ్చి మాట తప్పారని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే ఈ బకాయిలను విడుదల చేయాలని సంజయ్ డిమాండ్ చేశారు.

ప్రాణహితకు భూములు ఎలా?

» మందమర్రిలో 71 ఎకరాలు ఆయిల్‌పామ్ కంపెనీకి అప్పగించిన గత ప్రభుత్వం

» రూ.10.66 కోట్లకు ఒప్పందమైనా నగదు చెల్లించని 'మ్యాట్రిక్స్' కంపెనీ

» కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహితపై దృష్టిసారించడంతో గందరగోళం



మందమర్రిలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి కేటాయించిన భూమి

మంచిర్యాల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రాణహిత ప్రాజెక్టుకు సంబంధించిన మంచిర్యాల జిల్లాలోని 71 ఎకరాల భూములను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఓ ఆయిల్‌పామ్ కంపెనీకి అప్పనంగా కట్టబెట్టింది. ఒప్పందం ప్రకారం ఆ పరిశ్రమ ఇప్పటికీ భూములకు నగదును చెల్లించలేదు. పరిశ్రమనూ ఏర్పాటు చేయాలేదు. 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని తూర్పు ప్రాంతంలో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత ప్రాజెక్టును కాదని, కాళేశ్వరం వైపు మొగ్గు చూపింది. దీంతో ప్రాణహిత ప్రాజెక్టు కాల్వలు, పైపులైన్లు, పంప్‌హౌస్‌ల నిర్మాణం కోసం సేకరించిన భూములు నిరుపయోగంగా మారాయి. వాటిలో కొన్ని భూములను తిరిగి రైతులు సాగు చేసుకుంటుండగా, మరికొన్నింటిని గత ప్రభుత్వం ఇతర పనులకు కేటాయించింది. మంచిర్యాల, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించిన బీఆర్ఎస్ సర్కారు.. మందమర్రి మండలం శంకర్‌పల్లి వద్ద పామాయిల్ పరిశ్రమ నెలకొల్పేందుకు సన్నాహాలు చేసింది. పరిశ్రమ బాధ్యతను హైదరాబాద్‌కు చెందిన మ్యాట్రిక్స్ కంపెనీకి అప్పగించింది. సారంగపల్లి శివారులోని సర్వే నెంబర్లు 95, 97, 112, 113, 119లో మొత్తం 71.05 ఎకరాలను కేటాయించింది. ఆ భూములకు మార్కెట్ విలువ రూ.10.66 కోట్ల మేర ధరను నిర్ణయిస్తూ గత ఏడాది జనవరి 2న సీసీఎల్ఏ ప్రొసీడింగ్స్ జారీ చేశారు. ప్రాణహిత ప్రాజెక్టుకు చెందిన ఆ భూములను ఇరిగేషన్‌శాఖ నుంచి రెవెన్యూశాఖకు బదిలీ చేసి మరీ బీఆర్ఎస్ ప్రభుత్వం మాట్రిక్స్ కంపెనీకి అప్పగించింది. ప్రభుత్వంతో చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం నగదు చెల్లించకుండానే మ్యాట్రిక్స్ కంపెనీ ఆ భూములను చేజిక్కించుకుంది. అవే భూముల్లో పామాయిల్ కంపెనీ ఏర్పాటుకు అప్పటి పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. భూముల నగదు చెల్లించాలంటూ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఫిబ్రవరి 27న మ్యాట్రిక్స్ సీఈవోకు లేఖ రాసినప్పటికీ గత ప్రభుత్వ పెద్దల అండదండలతో కంపెనీ ప్రతినిధులు డబ్బులు చెల్లించలేదు.

శంకుస్థాపనకే పరిమితం..

మందమర్రి మండలంలో రూ.500 కోట్లతో పామాయిల్ మినీ రిఫైనరీ పూర్తిచేసి, ఉత్పత్తిని ప్రారంభిస్తామని ప్రకటించిన కంపెనీ ఆ హామీని నిలబెట్టుకోలేదు. ఫ్యాక్టరీ వల్ల ప్రత్యక్షంగా 250 మందికి, పరోక్షంగా మరో 500 మందికి ఉపాధి దొరుకుతుందని శంకుస్థాపన సమయంలో అప్పటి మంత్రి కేటీఆర్ చేసిన ప్రకటన కూడా అమలు కాలేదు. జిల్లాలో 2020లో ప్రయోగాత్మకంగా ఆయిల్‌పామ్ సాగును ప్రారంభించిన ప్రభుత్వం మొత్తం 2,800 పైచిలుకు ఎకరాలకు విస్తరించింది. గత ఏడాది నుంచి దిగుబడి ప్రారంభమైనప్పటికీ మినీ రిఫైనరీ పనులు మొదలు పెట్టకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టడం, ప్రాణహిత ప్రాజెక్టుపై దృష్టి సారించడంతో భూముల అంశం తిరిగి తెరపైకి వచ్చింది. ప్రాజెక్టు నిర్మాణం కోసం ఆయిల్‌పామ్ రిఫైనరీకి అక్రమంగా అప్పగించిన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ధరణి సమస్యలపై 15 రోజుల్లో తొలి నివేదిక

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టు డైరెక్టర్ వి.లచ్చిరెడ్డి పాల్గొన్నారు. ధరణి పోర్టల్‌లో, భూ సమస్యల పరిష్కారంలో ఉన్న 35 రకాల సమస్యలను గుర్తించిన కమిటీ.. వాటి పరిష్కారం కోసం, అత్యంత యూజర్ ఫ్రెండ్లీగా వ్యవస్థ ఉండేందుకోసం ఏం చేయాలన్న దానిపై మేధావులు, విద్యావంతులు, రైతులు, వివిధ రంగాల వారితో మాట్లాడాలని, ఈ మేరకు 22న (వచ్చే సోమవారం) మరోసారి సమావేశం కావాలని నిర్ణయించింది. సీసీఎల్ఏ కార్యాలయంలో ధరణి పోర్టల్‌కు సంబంధించి చేయాల్సిన మార్పులు, చేర్పులు.. ఫిర్యాదుల పరిష్కారానికి అనుసరించాల్సిన పద్ధతులపై సలహాలు, సూచనలను అదే రోజు నుంచి స్వీకరిస్తారు. కేవలం ధరణి పోర్టల్ గురించి మాత్రమే కాక.. భూచట్టాలకు, వాటి మెరుగుదలకు, భూరికార్డుల నిర్వహణకు సంబంధించి కూడా సలహాలు, సూచనలు అందించవచ్చని కమిటీ సభ్యులు తెలిపారు. నేరుగా సలహాలు, సూచనలు ఇవ్వలేనివారికి వీలుగా ఒక టోల్‌ఫ్రీ నంబరు ఉండాలని నిర్ణయించారు. వచ్చే సమావేశం రోజునే ఈ టోల్‌ఫ్రీ నంబరును కూడా ప్రకటించి అందుబాటులోకి తీసుకొస్తారు. సులువుగా, సరళంగా భూసమస్యల పరిష్కారం ప్రజలకు అత్యంత సులువుగా, సరళంగా ఉండే విధంగా మార్పులు చేసే అంశంపైన.. తక్కువ సమయంలో ఎక్కువ సేవలు అందించేలా ధరణిని ప్రక్షాళన చేయడంపైన.. ఈ భేటీలో కమిటీ చర్చించింది. ప్రస్తుతం ధరణిలో దరఖాస్తులు చేసుకునే తీరు, వాటి పరిష్కార ప్రక్రియ వివిధ స్థాయుల్లో ఉండటం ఇబ్బందిగా మారింది. ఉదాహరణకు ఓ రైతు సర్వే నంబర్ మిస్సింగ్ అయితే దానిని పరిష్కరించుకునేందుకు ధరణిలోని టీఎం-33లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తు కలెక్టర్ లాగిన్‌కు వెళ్తుంది. కలెక్టర్ ఆ దరఖాస్తును ఓపెన్ చేసి సంబంధిత తహశీల్దారుకు పంపిస్తారు. తహశీల్దారు ఆ సమస్య పరిష్కారానికి సంబంధించిన నివేదికలు అప్‌లోడ్ చేసి ఆర్డీవో లాగిన్‌కు పంపిస్తారు. అక్కడి నుంచి అడిషనల్ కలెక్టర్‌కు వెళ్తోంది. అదనపు కలెక్టర్ ఓకే చేసిన తరువాత ఆ దరఖాస్తు కలెక్టర్ లాగిన్‌కు చేరుతుంది. అప్పుడు కలెక్టర్ ఆ నివేదికలన్నీ పరిశీలించి.. తన పేరుతో ప్రొసీడింగ్ ఆర్డర్ తయారు చేసి ఆ నివేదికను సీసీఎల్ఏ లాగిన్‌లోకి సబ్‌మిట్ చేస్తారు. సీసీఎల్ఏ తన లాగిన్‌లోకి వచ్చిన ఆ దరఖాస్తులను ఓపెన్ చేసి అందుకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లూ డౌన్‌లోడ్ చేసి కమిటీకి పరిశీలనకు పంపిస్తారు. కమిటీ పరిశీలించి ఓకే చేసిన తరువాత సీసీఎల్ఏ ఫైనల్‌గా అప్రూవ్ చేస్తారు. అప్పుడు టీఎం-33లో బాధితుడు చేసుకున్న దరఖాస్తుకు మోక్షం లభిస్తుంది. ఇంత ప్రాసెస్ కాకుండా తక్కువ సమయంలో, తక్కువ దశల్లో సమస్యను పరిష్కరించాలని.. బాధితులు అనేకమార్లు కార్యాలయాల చుట్టూ తిరుగకుండా చాలా సమస్యలు మండల స్థాయిలోనే పరిష్కరించే విధంగా ధరణి పోర్టల్‌ను పునర్ నిర్మాణం చేయాలని ధరణి కమిటీ భావిస్తోంది.

తప్పులున్నా సరిచేసి..

ప్రస్తుత విధానం ప్రకారం.. అర్జీదారు తెలియకగానీ, పొరపాటునగానీ దరఖాస్తు చేయాల్సిన మాడ్యూల్స్‌లో కాకుండా మరో మాడ్యూల్‌లో దరఖాస్తు చేస్తే సంబంధిత అధికారి దాన్ని తిరస్కరిస్తున్నారు. అలా కాకుండా సమస్య పరిష్కారానికి అనుకూలమైన మాడ్యూల్‌లోకి దరఖాస్తును మార్చుకోవడం, లేదా ఆటోమేటిక్‌గా సిస్టమే దాన్ని మార్చే సులభతరమైన వ్యవస్థను అందుబాటులోకి తేవాలని ధరణి కమిటీ సభ్యులు భావిస్తున్నారు. దరఖాస్తుల ఫీజులను తగ్గించాలా లేక రద్దుచేయాలా.. 2020 రెవెన్యూ చట్టానికి మార్పులేమైనా చేయాలా? అనే దిశగా కూడా కమిటీ ఆలోచిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం ఉన్న రెవెన్యూ చట్టం 2020, అందులోని ధరణి పోర్టల్ ప్రకారం ఏ మాడ్యుల్ కింద చేసిన దరఖాస్తు అయినా జిల్లా కలెక్టర్, ఆ తర్వాత సీసీఎల్ఏ స్థాయిలోనే పరిష్కారం అవుతున్నాయి. అలాకాకుండా సమస్యలను తహసీల్దార్ల స్థాయిలోనే పరిష్కరించేలా వ్యవస్థలో మార్పులను కమిటీ సూచించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. టీఎం-33 మాడ్యూల్‌లోని ఫిర్యాదులను ప్రస్తుతం సీసీఎల్ఏ స్థాయిలో మాత్రమే పరిష్కరించే వీలుంది. అలా కాకుండా కలెక్టర్ స్థాయిలోనే వాటిని పరిష్కరించే వీలుంటే బాగుంటుందని సిఫారసు చేయనుంది. అలాగే.. తహసీల్దార్ల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలకు అప్పిలేట్ అథారిటీగా కలెక్టర్‌ను.. కలెక్టర్ స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలకు అప్పిలేట్ అథారిటీగా సీసీఎల్ఏను పెట్టాలనే యోచన ఉంది. దానివల్ల ప్రతి దరఖాస్తూ కలెక్టర్, సీసీఎల్ఏ వద్దకు రావాల్సిన అవసరం ఉండదని, ప్రజలకు క్షేత్రస్థాయిలోనే సులభంగా పనులు జరిగిపోతాయనే భావన కమిటీ సభ్యుల్లో వ్యక్తమైందని సమాచారం. క్షేత్రస్థాయిలో అర్జీలు, దరఖాస్తుల పరిష్కారంలో ఏవైనా అవకతవకలుంటే.. అప్పిలేట్ అథారిటీగా కలెక్టర్లు, సీసీఎల్ఏ ఉంటారని, ఇది అక్రమాలు జరగకుండా ఉండేందుకు ఉపయోగపడుతుందనే అభిప్రాయంతో ఉన్నారు.

అధ్యయనం, విశ్లేషణ పూర్తి..

ధరణి పోర్టల్ పనితీరు, స్పీడ్, వర్క్‌లోడ్‌పై కమిటీ అధ్యయనం పూర్తయ్యింది. ఇప్పటి దాకా దాఖలైన దరఖాస్తుల సంఖ్య, వాటిలో ఆమోదించినవి? తిరస్కరించినవి ఎన్ని? వాటికి కారణాలేమిటి అనే అంశాలపై కమిటీ లోతైన విశ్లేషణ చేసింది. కమిటీ సభ్యులు కోరిన సమాచారాన్ని సీసీఎల్ఏ నవీన్‌మిత్తల్ అందించారు. పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ధరణి పనితీరును ఆయన సభ్యులకు వివరించారు. ధరణి పోర్టల్ టెక్నికల్ టీమ్.. దాని పనితీరు గురించి సభ్యులకు వెల్లడించారు. అప్లికేషన్ పెట్టుకోవడం మొదలు ఎక్కడెక్కడి నుంచి ఎవరెవరికి ఫైల్ ఎలా సర్క్యులేట్ అవుతుంది.. ఆ తర్వాత తహశీల్దార్ల రిపోర్ట్, కలెక్టర్ల అప్రూవల్స్, సీసీఎల్ఏ క్లియరెన్స్ వరకు ఎలా సాగుతుందో ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఈ స్టడీ ద్వారా సభ్యులు పలు లోపాలను గుర్తించారు. వాటిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకోనున్నారు. మూడో సమావేశం అనంతరం కమిటీ జాబ్ చార్ట్ సిద్ధం చేసుకోనున్నారు.మేధావులు, నిపుణులు, ప్రజా సంఘాల ప్రతినిధుల సూచనలు కూడా తీసుకోనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రస్తుతానికి ధరణి పోర్టల్ ప్రక్షాళన వరకు పరిమితమై.. దాన్ని పూర్తిస్థాయిలో భూమాతగా మార్చేందుకు, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన టెక్నాలజీతో తీసుకురావాలన్న లక్ష్యంతో పని చేస్తున్నారు.

ఈసారి గణతంత్ర ఉత్సవం పబ్లిక్ గార్డెన్‌లో

» జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న గవర్నర్

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఈసారి గణతంత్ర వేడుకలకు వేదిక ఖరారైంది. రెండేళ్లుగా రాజ్‌భవన్‌కే పరిమితమైన ఉత్సవం... ఈసారి మళ్లీ పబ్లిక్ గార్డెన్‌కు మారింది. గతంలో మాదిరిగా కాకుండా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. అయితే... వీటి నిర్వహణకు పరేడ్ గ్రౌండ్ వేదిక అవుతుందా లేదా అన్నది ఇంకా ఖరారు కాలేదు. ఈమేరకు ఏర్పాట్లపై బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నతాధికారులతో సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. 26న గణతంత్ర దినోత్సవాన్ని పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించనున్నామని, గవర్నర్ తమిళిసై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని ఆమె తెలిపారు. ఈ ఉత్సవానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈసారి గణతంత్ర దినోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. గతంలో ఈ జాతీయ పండుగ నిర్వహణపై అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించిందన్న విమర్శలొచ్చాయి. 2023లో గణతంత్ర దినోత్సవాన్ని రాజ్‌భవన్‌లో పరిమితంగా, పరేడ్ లేకుండా నిర్వహించాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం యోచించింది. కానీ... ఉత్సవ నిర్వహణపై హైకోర్టులో పిటిషన్ దాఖలు కావడంతో కోర్టు స్పందించింది. గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, పరేడ్ కూడా ఉండాలని, వేదిక నిర్ణయం మాత్రం ప్రభుత్వానిదేనని కోర్టు స్పష్టం చేసింది. దాంతో ప్రభుత్వం రాజ్‌భవన్‌ను వేదికగా నిర్ణయించి, ఉత్సవ ఏర్పాట్లు చేసింది. కానీ... దానికి అప్పటి సీఎం హోదాలో కేసీఆర్‌గానీ, ఆయన సహచర మంత్రులుగానీ హాజరు కాలేదు. 2022లో రాజ్‌భవన్‌లో జరిగిన గణతంత్ర ఉత్సవానికి కూడా కేసీఆర్ హాజరు కాలేదు. అంతకుముందు 2020, 2021లలో ఈ ఉత్సవాన్ని పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించారు. రెండేళ్ల అనంతరం ఈసారి మళ్లీ పబ్లిక్ గార్డెన్‌లో ఉత్సవాన్ని నిర్వహించబోతున్నారు. దీనికి ప్రస్తుత సీఎం రేవంత్ హాజరు కానున్నారు.

గవర్నర్ తమిళిసై 'ఎక్స్' ఖాతా హ్యాక్

» సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అధికారిక ఎక్స్(ట్విటర్) ఖాతా హ్యాకింగ్‌కు గురైంది. గవర్నర్ 'ఎక్స్' ఖాతాల్లో ఇటీవల వచ్చిన పోస్టింగులపై సందేహం వచ్చిన రాజ్‌భవన్ వర్గాలు ఖాతా హ్యాక్ అయినట్లు గుర్తించారు. రాజ్‌భవన్ వర్గాలు పోస్ట్ చేయని కొన్ని పోస్టింగులు ఖాతాలో కనిపించడం, కొన్ని సందర్భాల్లో పాస్‌వర్డ్ తప్పుగా ఉన్నట్లు వస్తుండటంతో హ్యాకింగ్ జరిగినట్లు గుర్తించిన రాజ్‌భవన్ అధికారులు హైదరాబాద్ సైబర్ క్రైం పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. కొన్ని పోస్టింగులకు రాజ్‌భవన్ వర్గాల ప్రమేయం లేకుండానే రిప్లైలు వెళ్లినట్లు గుర్తించారు.

శంషాబాద్-ఫ్రాంక్‌ఫర్ట్‌కు విమాన సర్వీసు

శంషాబాద్ రూరల్, జనవరి 17: రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌కు ఇకపై నేరుగా విమాన సర్వీసులు నడవనున్నాయి. జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్, లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ సంయుక్తంగా బుధవారం ఈ నూతన విమాన సర్వీస్‌ను ప్రారంభించాయని విమానాశ్రయ అధికారులు తెలిపారు. వారానికి ఐదు సార్లు ఈ విమాన సర్వీసును నడుపనున్నారు. ప్రతి సోమ, మంగళ, బుధ, గురు, శని వారాల్లో ఎల్‌హెచ్ 753 విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి మధ్యాహ్నం 1.55 గంట.కు బయలుదేరి రాత్రి 7.05గంటలకు ఫ్రాంక్‌ఫర్ట్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఎల్‌హెచ్752విమానం ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి రాత్రి10.55 గంటలకు బయలుదేరి రాత్రి11.55గంటలకు శంషాబాద్‌కు చేరుకుంటుంది.

20న పాస్‌పోర్టు అదాలత్

సికింద్రాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): దరఖాస్తు చేసి నెలలు గడిచినా, ఇంకా చేతికి పాస్‌పోర్టు అందని వారికి శుభవార్త. వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్లియర్ చేసేందుకు ఈనెల 20వ తేదీన పాస్‌పోర్టు అదాలత్ నిర్వహించాలని హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారిణి జొన్నలగడ్డ స్నేహజ నిర్ణయించారు. సికింద్రాబాద్‌లోని హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయంలో నిర్వహించే పాస్‌పోర్టు అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్నేహజ ఈ సందర్భంగా దరఖాస్తుదారులకు సూచించారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నేరుగా పాస్‌పోర్టు కార్యాలయానికి రావచ్చని, ఒరిజినల్ డాక్యుమెంట్లు తీసుకురావాలని సూచించారు.

శంషాబాద్-ఫ్రాంక్‌ఫర్ట్‌కు విమాన సర్వీసు

శంషాబాద్ రూరల్, జనవరి 17: రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌కు ఇకపై నేరుగా విమాన సర్వీసులు నడవనున్నాయి. జీఎంఆర్ హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్, లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ సంయుక్తంగా బుధవారం ఈ నూతన విమాన సర్వీస్‌ను ప్రారంభించాయని విమానాశ్రయ అధికారులు తెలిపారు. వారానికి ఐదు సార్లు ఈ విమాన సర్వీసును నడుపనున్నారు. ప్రతి సోమ, మంగళ, బుధ, గురు, శని వారాల్లో ఎల్‌హెచ్ 753 విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి మధ్యాహ్నం 1.55 గంట.కు బయలుదేరి రాత్రి 7.05గంటలకు ఫ్రాంక్‌ఫర్ట్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఎల్‌హెచ్752విమానం ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి రాత్రి10.55 గంటలకు బయలుదేరి రాత్రి11.55గంటలకు శంషాబాద్‌కు చేరుకుంటుంది.

సర్పంచులపై కేటీఆర్‌ది కపట ప్రేమ

» తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సర్పంచులు తాము చేసిన పనులకు బిల్లులు రాక బాధపడుతున్నారని, వారికి తాను గొంతుకై పోరాడతానని కేటీఆర్ చెప్పడం హాస్యాస్పదమని తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి విమర్శించారు. సర్పంచుల పెండింగ్ బిల్లులపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను బుధవారం ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. పదేళ్ల అధికారంలో ఉండి బీఆర్ఎస్ పాలకులు సర్పంచులకు చేసింది ఏమిటని ఆయన ప్రశ్నించారు. కేటీఆర్‌కు నిజంగా సర్పంచుల సమస్యలపై ప్రేమ ఉంటే 10 సంవత్సరాల్లో 60 మందికిపైగా సర్పంచ్‌లు ఆర్థిక ఇబ్బందులతో ఎందుకు ఆత్మహత్య చేసుకుంటారని ప్రశ్నించారు. కాగా, పంచాయతీ రాజ్ వ్యవస్థను నాశనం చేసిన కేటీఆర్ సర్పంచుల బాధల గురించి మాట్లాడడం విడ్డూరమని టీపీసీసీ రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ చైర్మన్ సిద్దేశ్వర్ విమర్శించారు. సర్పంచుల సమస్యలపై పోరాట చేస్తానని కేటీఆర్ చెప్పడం సిగ్గుచేటని ఎద్దేవాచేశారు.



యాదాద్రిభువనగిరి జిల్లా పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు

పట్నం పోదాం చలో చలో

» సంక్రాంతి ముగియడంతో ప్రజలు తిరిగి రాజధానికి..

చౌటుప్పల్ రూరల్, బీబీనగర్, చిట్యాల రూరల్, కేతేపల్లి, జనవరి 17: మూడు రోజుల సంక్రాంతి సంబరాలు ముగియడంతో.. పండుగ కోసం పల్లె బాట పట్టినవారంతా తిరుగుప్రయాణమయ్యారు. బంధుమిత్రులతో ఆనందంగా గడిపి.. ఆ మధురానుభూతులను మూటగట్టుకుని మళ్లీ రాజధాని బాట పట్టారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి.. ఏపీకి వెళ్లినవారు.. ఇలా అందరి దారులూ బుధవారం హైదరాబాద్‌వైపే! పిల్లాపాపలతో కార్లు, బస్సులు, ద్విచక్రవాహనాల్లో వెళుతున్న ప్రజలతో జాతీయ రహదారులు రద్దీగా మారాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదాద్రి భువనగిరి జిల్లా మీదుగా హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి నెం.163, నల్లగొండ జిల్లా మీదుగా హైదరాబాద్-విజయవాడ 65వ నెంబరు జాతీయ రహదారిపై ఉన్న టోల్‌గేట్ల వద్ద వాహనాల రద్దీగా విపరీతంగా కన్పించింది. ఫాస్టాగ్‌లు ఉన్నా కూడా వాహనాలు ముందుకు సాగడానికి కొంత సమయం పట్టింది. అదే విధంగా జాతీయ రహదారిపై ఉండే హోటళ్లు సైతం వాహనదారుల సందడితో కిటకిటలాడాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లామీదుగా హైదరాబాద్ వైపు దాదాపుగా 87 వేల వాహనాలు బయలుదేరి వెళ్లినట్లు జీఎంఆర్ అధికారులు వెల్లడించారు. బుధవారం ఉదయం రద్దీ సాధారణంగానే కన్పించినా.. సమయం గడిచేకొద్దీ వాహనాల సంఖ్య పెరుగుతూ వచ్చింది. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద 16 గేట్లకు గాను 10 గేట్ల ద్వారా హైదరాబాద్ వైపు వాహనాలను పంపించారు. ఫాస్టాగ్ ఉండి స్కానింగ్ కాని వాహనాలను అదనపు సిబ్బందితో స్కానింగ్ చేసి పంపించారు. బుధవారం పంతంగి టోల్‌గేట్ నుంచి 65వేల వాహనాలు, బీబీనగర్ మండలం గూడూరు టోల్ ప్లాజా నుంచి 22 వేల వాహనాలు వెళ్లినట్లు జీఎంఆర్ సిబ్బంది తెలిపారు.

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో.. భీకర యుద్ధం!

(మొదటిపేజీ తరువాయి)

తెగబడ్డారు. మంగళవారం రాత్రి 6 గంటల సమయంలో మొదలైన ఈ దాడులు.. బుధవారం తెల్లవారుజాము వరకు.. సుమారు 10 గంటల పాటు కొనసాగాయి. పక్కా వ్యూహంతో ఈ శిబిరాలను చుట్టుముట్టిన మావోయిస్టులు.. బ్యాకప్ ఫోర్స్ రావడానికి అవకాశమే లేకుండా చర్ల-పామేడు, పామేడు-ధర్మా పురం రోడ్లను దిగ్బంధించారు. ఎక్కడికక్కడ కల్వర్టుల వద్ద మందుపాతరలతో రోడ్లను ధ్వంసం చేశారు. సీఆర్పీఎఫ్ బలగాలకు అండగా బ్యాకప్ ఫోర్స్ రాకుండా ఉండేందుకు అటవీ ప్రాంతాల్లో చెట్లను నరికి రోడ్డుపై అడ్డంగా వేశారు. ఈ ఘటనలో 9 మంది జవాన్లు తీవ్ర గాయాలపాలైనట్లు తెలిసింది. ఏపీకి చెందిన 40 మంది కూలీలు త్రుటిలో మావోయిస్టుల రాకెట్, తుపాకీ దాడుల నుంచి తప్పించుకున్నారు. బుధవారం రాత్రి పొద్దుపోయేదాకా మావోయిస్టుల కోసం ఆపరేషన్ కొనసాగుతోందని చెబుతున్న సీఆర్పీఎఫ్ వర్గాలు.. ఘటన వివరాలను వెల్లడించడానికి నిరాకరించాయి. అటు మావోయిస్టుల వైపు నుంచి కూడా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

300కు పైగా రాకెట్ దాడులు

ఘటన జరిగిన స్థలం సమీపం వరకు 'ఆంధ్రజ్యోతి' వెళ్లగలిగింది. అయితే.. మావోయిస్టులు ఎక్కడికక్కడ మందుపాతరలు పెట్టారని, ముందుకు వెళ్లడం కుదరదని పోలీసులు హెచ్చరికలు జారీచేశారు. పామేడ్ పోలీస్‌స్టేషన్ సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వరకే అనుమతించారు. అసలు ఏం జరిగిందో చెప్పడానికి నిరాకరించారు. అయితే.. స్థానిక గ్రామస్థులు, ప్రత్యక్ష సాక్షులు, ఏపీకి చెందిన పలువురు కూలీలు మాత్రం రాత్రంతా బాంబుల మోతతో అటవీ ప్రాంతం దద్దరిల్లిందని చెప్పారు. క్యాంపుల చుట్టూ దాదాపు 3 వేల మంది వరకు మావోయిస్టులు తెరిపినివ్వకుండా కాల్పులు జరుపుతుండడం.. నిప్పురవ్వలు సీఆర్పీఎఫ్ 151వ బెటాలియన్‌కు చెందిన శిబిరాల వైపు దూసుకురావడం చూశామన్నారు. "రాత్రి 6 గంటల సమయంలో ఈ మార్గం మీదుగా వెళ్తున్న వాహనదారులను మావోయిస్టులు నిలిపివేశారు. వేరే మార్గంలో వెళ్లాలని సూచించారు"అని స్థానికులు పేర్కొన్నారు. ఈ దాడుల్లో మావోయిస్టులు పెద్దవి, చిన్నవి కలిపి 300కు పైగా రాకెట్లను ప్రయోగించినట్లు తెలిసింది. ఏకే-47, ఇతర అధునాతన రైఫిళ్లతోపాటు.. తూటాలు బాంబులను వాడారని సమాచారం. బుధవారం ఉదయం



తనిఖీకి వెళ్తున్న మైన్‌ప్రూఫ్ వాహనం

ఈ మూడు క్యాంపుల సమీపంలో ఎక్కడ చూసినా.. తూటాలు, రాకెట్లు, పేలకుండా మిగిలిన రాకెట్లు కనిపించాయని సీఆర్పీఎఫ్ వర్గాలు తెలిపాయి. ప్రతిదాడుల్లో భాగంగా సీఆర్పీఎఫ్ పోలీసులు కూడా ప్యారాబాంబు(ఆకాశంలోకి వెళ్లి.. పరిసరాలు కనిపించేలా వెలుగుతూనే.. నేలపై పడ్డాక పేలిపోయే మందుపాతరలు)లను ప్రయోగించినట్లు తెలుస్తోంది. మావోయిస్టుల వ్యూహాత్మక దాడి తర్వాత.. సీఆర్పీఎఫ్ భారీ కూంబింగ్ ఆపరేషన్‌ను చేపట్టింది. పామేడు ప్రధాన రహదారిలోనూ మావోయిస్టులు అక్కడక్కడా మందుపాతరలను పెట్టడంతో.. వాటిని నిర్వీర్యం చేస్తూ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నారు. అక్కడక్కడా పేలకుండా మిగిలిన మావోయిస్టుల రాకెట్లను నిర్వీర్యం చేస్తున్నారు. మావోయిస్టులు మందుపాతరలు పెట్టడం, చెట్లను అడ్డంగా నరికి వేయడం వల్ల పోలీసులు రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. దీంతో ధర్మారం, రాచపల్లి, పరిసర గూడేలకు చెందిన ఆదివాసీలకు ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. బుధవారం రాత్రి కడపటి వార్తలందేసరికి కూడా ఆపరేషన్ కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

హిడ్మా పనేనా?

సుమారు మూడువేల మంది మావోయిస్టులతో సీఆర్పీఎఫ్ క్యాంపులను లక్ష్యంగా చేసుకుని దాడిచేయడాన్ని బట్టి.. కొన్ని రోజులుగా రెక్కీలు జరిపి, భారీ వ్యూహాన్ని అమలు చేసినట్లు తెలుస్తోంది. సాధారణంగా ఈ తరహా దాడులకు మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మాడ్వీ హిడ్మా సిద్ధహస్తుడు. 2021 ఏప్రిల్ 3న బీజాపూర్ అడవుల్లోని తెర్రాం గ్రామం వద్ద త్రిశూల వ్యూహంతో 23 మంది సీఆర్పీఎఫ్/కోబ్రా జవాన్లను పొట్టనబెట్టుకున్న విషయం తెలిసిందే. దొరికిన వారిని దొరికినట్లు పాశవికంగా హతమార్చారు. కోబ్రా దళానికి చెందిన ఓ ఇన్‌స్పెక్టర్ తన తుపాకీ మేగజీన్‌ను లోడ్ చేసుకునేలోపే.. మూకుమ్మడి దాడి చేసి, అతని రెండు చేతులను నరికేశారు. హిడ్మా అక్కడున్న విషయాన్ని పోలీసులకు లీక్ చేసి, చిలిగేరు, జొన్నగూడ గ్రామాల్లో కాపుకాచి, తెర్రాం వద్ద తన వ్యూహాన్ని అమలు చేశాడు. బీజాపూర్ జిల్లా పూవర్తి గ్రామానికి చెందిన హిడ్మాకు ఈ అడువులపై గట్టి పట్టుంది. కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న హిడ్మా.. ఇప్పుడు పామేడు ఘటనతో మళ్లీ తన ఉనికిని చాటుకున్నట్లు తెలుస్తోంది. నిజానికి 2021 ఘటనను కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. హిడ్మాను వేటాడడమే లక్ష్యంగా 'ఆపరేషన్ ప్రహార్-3'ను చేపట్టింది. కానీ, హిడ్మా జాడను గుర్తించలేకపోయింది. గత ఏడాది హిడ్మాను సీఆర్పీఎఫ్ జవాన్లు చుట్టుముట్టారని, డ్రోన్లతో అతని కదలికలను గుర్తించారనే వార్తలు వెలువడ్డా.. త్రుటిలో తప్పించుకున్నాడు.

త్రుటిలో తప్పించుకున్న ఏపీ వాసులు

పామేడు శివార్లలో చింతవాగు వద్ద నూతనంగా నిర్మిస్తున్న ధర్మారం బేస్‌క్యాంపు వద్ద ఏపీలోని ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన 40 మంది కూలీలు పనిచేస్తున్నారు. సుమారు 10 గంటల పాటు కొనసాగిన మావోయిస్టుల కాల్పులు.. పోలీసుల ఎదురుకాల్పులతో వారంతా గజగజ వణికిపోయారు. రాకెట్‌లు, తూటాలు తమ తాత్కాలిక ఆవాసాలకు అత్యంత సమీపం నుంచి దూసుకువెళ్లాయని వారు వివరించారు. "మంగళవారం రాత్రి బాంబుల మోతతో మేము ఉంటున్న ప్రాంతం దద్దరిల్లిపోయింది. ఏం జరుగుతుందా అని బయటకు వచ్చి చూస్తే.. పక్క నుంచి తూటాలు దూసుకుపోయాయి. మేం ఉంటున్న తాత్కాలిక ఆవాసానికి పక్కనే చెట్లు ఉండడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నాం. ఉదయం చూస్తే.. ఆ చెట్లకు అవతలి వైపు తూటాలు కనిపించాయి" అని వారు పరిస్థితిని 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. తాము నిర్మిస్తున్న ధర్మారం బేస్‌క్యాంపు పనులను పలుమార్లు మావోయిస్టులు వ్యతిరేకించినట్లు తెలిపారు.

రాజాసింగ్ సభల్లో విద్వేష ప్రసంగాల్లేకుండా చూడండి

» మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ అధికారులకు సుప్రీంకోర్టు ఆదేశం

» ముందస్తు చర్యలకు నిరాకరణ

న్యూఢిల్లీ, జనవరి 17: హైదరాబాద్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ల్లో పాల్గొనే బహిరంగ సభల్లో విద్వేష ప్రసంగాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బుధవారం సుప్రీంకోర్టు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అదే సమయంలో రాజాసింగ్‌పై ముందస్తుగా చర్యలు తీసుకోవడానికి నిరాకరించింది. హిందూ జనజాగృతి ఆధ్వర్యంలో గురువారం మహారాష్ట్రలోని యావత్‌మల్, ఈ నెల 19 నుంచి 25 వరకు ఛత్తీస్‌గఢ్‌ల్లో పలు చోట్ల బహిరంగ సభలు నిర్వహణకు అనుమతి ఇవ్వకూడదని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలయింది. దీనిపై జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆధ్వర్యంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఇరు వర్గాల వాదనల అనంతరం ధర్మాసనం స్పందిస్తూ విద్వేష ప్రసంగాలు జరగకుండా చూడాలని యావత్‌మల్, రాయ్‌పూర్ జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులను ఆదేశించారు. అవసరమైతే సీసీ కెమేరాలు ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని రికార్డు చేయాలని స్పష్టం చేశారు.

నేటి నుంచి కోడికత్తి శ్రీను దీక్ష

విజయవాడ, విశాఖపట్నం, జనవరి 17: కోడికత్తి కేసులో జనపల్లి శ్రీనివాస్ ఐదేళ్ల నుంచి రిమాండ్ ఖైదీగా జైల్లోనే మగ్గుతున్నాడు. ఈ కేసులో సీఎం జగన్మోహన్‌రెడ్డి కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పడం లేదు. దీంతో శ్రీనుకి బెయిల్ కూడా రావడం లేదు. ప్రస్తుతం విశాఖ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న తన కుమారుడు ఎప్పుడు బయటకు వస్తాడా అని ఎదురుచూస్తున్న శ్రీనివాస్ తల్లి మరియమ్మ.. న్యాయం కోసం గురువారం నుంచి నిరాహార దీక్ష చేస్తామని తెలిపారు. విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శ్రీను తల్లి మరియమ్మ, సోదరుడు సుబ్బరాజు మాట్లాడారు. విశాఖ కేంద్ర కారాగారంలో ఉన్న శ్రీనివాస్ తమకు ఫోన్ చేసి గురువారం నుంచి దీక్షకు కూర్చుంటున్నానని చెప్పాడని, తన కుమారుడికి న్యాయం జరిగేంత వరకు దళిత, మైనార్టీ, ప్రజా సంఘాల మద్దతుతో తాము కూడా విజయవాడలో నిరహారదీక్ష చేపడతామని చెప్పారు.

మహేశ్, బల్మూరికి ఎమ్మెల్సీ సీట్లు

న్యూఢిల్లీ/హైదరాబాద్/నిజామాబాద్ అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఉప ఎన్నికల అభ్యర్థులను కాంగ్రెస్ ఖరారు చేసింది. రెండు సీట్లకుగాను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకటనర్సింగ రావును అభ్యర్థులుగా ప్రకటించింది. ఈ ఇద్దరి పేర్లనూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదించినట్లు పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం ప్రకటన విడుదల చేశారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలకు జరగనున్న ఉప ఎన్నికలకు నామినేషన్ గడువు గురువారం (18వతేదీ)తో ముగియనున్నది. ఈనెల 29న పోలింగ్ జరుగనున్నది. కాగా, ఎమ్మెల్సీ సీటు విషయంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్‌కు నిరాశే ఎదురైంది. నిజానికి ఎమ్మెల్సీ సీటు దయాకర్‌కు కేటాయించాలని తొలుత నిర్ణయించిన అధిష్ఠానం నల్లగొండకు చెందిన కొందరు సీనియర్ కాంగ్రెస్ నేతల ఒత్తిడితో తన నిర్ణయాన్ని చివరి నిమిషంలో మార్చుకున్నదని, ఈ విషయమై దావో‌స్‌లో ఉన్న సీఎం రేవంత్ రెడ్డితోనూ మాట్లాడినట్లు సమాచారం. కాగా, నిజామాబాద్‌కు చెందిన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంతో.. జిల్లాలోని కాంగ్రెస్ శ్రేణులు, అనుచరులు సంబురాలు జరుపుకొన్నారు. కాగా, ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనకు అవకాశం దక్కనంత మాత్రాన నిరాశపడాల్సిన అవసరం లేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అన్నారు. తాను పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తానని ఆయన ఓ వీడియో సందేశంలో పేర్కొన్నారు. తనకు మరింత మంచి స్థానం ఇవ్వాలని పార్టీ ఆలోచన చేస్తోందని, అందుకోసం తాను సహనంగా ఉంటానని చెప్పారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీపై పీటముడి!

(మొదటిపేజీ తరువాయి)

సిఫార్సు చేసింది. అయితే, ఆయా రంగాల్లో ప్రత్యేకతలు, నైపుణ్యాలు, గుర్తించదగిన కృషి చేసినట్లు ఆధారాలు లేవంటూ గత ఏడాది సెప్టెంబరు 9న ఇద్దరి అభ్యర్థిత్వాలను గవర్నర్ తిరస్కరించారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఇవి ఈనెల 24న మరోసారి చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని డివిజన్ బెంచ్ ఎదుట విచారణకు రానున్నాయి. కాగా, ఈ కేసుల్లో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు లేకపోయినా అవి పెండింగ్‌లో ఉండగా నిర్ణయం తీసుకోవడం అంత గౌరవప్రదం కాదని గవర్నర్ భావించారు. తుది తీర్పు వచ్చే వరకు ఎమ్మెల్సీల భర్తీకి గత ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలపై ఎలాంటి నిర్ణయం ఉండదని స్పష్టం చేశారు. వివాదం లేకుండా చూసుకోవడంతో పాటు హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో నిర్ణయాన్ని వాయిదా వేశారు.

హైకోర్టులో ఏం జరిగింది?

గవర్నర్ తమ నామినేషన్‌లను తిరస్కరిస్తూ దాసోజు, కుర్ర సత్యనారాయణ దాఖలు చేసిన పిటిషన్లపై ఈ నెల 5న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ సూరేపల్లి నందా ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల అభ్యర్థిత్వాలను తిరస్కరిస్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 171(5) అధికారాలను ఉపయోగించి గవర్నర్ తీసుకున్న నిర్ణయంపై న్యాయ సమీక్షకు అవకాశం ఉంటుందా? అని పిటిషనర్లను హైకోర్టు ప్రశ్నించింది. ఈ విషయం ముందుగా తేలాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది. పిటిషన్లలో తమ తమ అభ్యంతరాలను లిఖితపూర్వకంగా దాఖలు చేయాలని గవర్నర్ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. మరోవైపు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు, ఆదిత్య సోంధి, మయూర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ గత ప్రభుత్వంలోని మంత్రివర్గం పేర్లను సిఫార్సు చేసిందని, వాటికి వ్యతిరేకంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లోని విధాన మండళ్లలో సైతం ఆయా పార్టీలకు సంబంధించిన సభ్యులే గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఉన్నారని, ప్రజాజీవితంలో ఉన్నవారిని మంత్రివర్గాలు సిఫార్సు చేస్తాయని అన్నారు. ఆయా రంగాల్లో అభ్యర్థులు ప్రత్యేక కృషి చేయలేదనే కారణంతో తిరస్కరించడం సరికాదన్నారు. గవర్నర్‌కు ఉన్న అధికారాలపై న్యాయ సమీక్షకు అవకాశం ఉందని.. నబంరేబియా అండ్ బమంగ్, వీవీరావు వంటి అనేక సుప్రీం కోర్టు, ఉమ్మడి ఏపీ హైకోర్టు తీర్పుల్లో ఇదే విషయం స్పష్టంగా ఉందని తెలిపారు. పిటిషనర్లను సిఫార్సు చేసిన స్థానాలపై గవర్నర్ తదుపరి ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. గవర్నర్ కార్యదర్శి తరఫున సీనియర్ న్యాయవాది అశోక్ ఆనంద్‌కుమార్ వాదిస్తూ.. ఈ పిటిషన్లకు విచారణార్హత లేదని.. ముందు విచారణార్హతను తేల్చాలని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 361 ప్రకారం గవర్నర్ అధికారాలపై న్యాయ సమీక్షకు అవకాశం లేదన్నారు. విచారణార్హతపై తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ.. ప్రభుత్వం తరఫున సైతం అభ్యంతరాలను సమర్పిస్తామని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. లిఖితపూర్వకంగా అభ్యంతరాలను సమర్పించాలని గవర్నర్ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్‌లు ఈనెల 24న మరోసారి విచారణకు రానున్నాయి. కాగా, గవర్నర్ తీసుకున్న తిరస్కరణ నిర్ణయం విషయంలో హైకోర్టు జోక్యం చేసుకోవడానికి అవకాశాలు చాలా పరిమితంగానే ఉంటాయని.. అయినా తుది తీర్పు ఇచ్చే వరకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీ కోసం వేచిచూడక తప్పదని నిపుణులు పేర్కొంటున్నారు. ఇక రెండు ఎమ్మెల్సీలను కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ కసరత్తు ముమ్మరం చేసింది. గవర్నర్ పేర్కొన్న అర్హతలకు అనుగుణంగా రెండు పేర్లను ప్రతిపాదించాలని భావిస్తోంది. ప్రొఫెసర్ కోదండరాం వంటి మేధావులను ఎమ్మెల్సీలుగా నామినేట్‌చేయాలని యోచిస్తోంది.

రూ.37,870 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణానికి అంగీకరించగా, రూ.8 వేల కోట్లతో గోదీ ఇండియా సంస్థ లిథియం గిగా ఫ్యాక్టరీ, రూ.5200 కోట్లతో వెబ్‌వెర్క్స్ డేటా సెంటర్ నిర్మించేందుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. తాజాగా ఒప్పందం కుదుర్చుకున్న మొత్తం పెట్టుబడులతో రాష్ట్రంలో 30 వేల మందికి పైగా యువతకు ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

అదానీ గ్రూప్ భారీ పెట్టుబడులు..

తెలంగాణలో భారీ పెట్టుబడులకు అదానీ గ్రూప్ ముందుకొచ్చింది. దావోస్‌లోని ప్రపంచ ఆర్థిక సదస్సులో మొత్తం రూ.12,400 కోట్ల పెట్టుబడులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, ఏరోస్పేస్, డిఫెన్స్ సీఈవో ఆశిష్ రాజ్‌వంశీ ఈ ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఇందులో భాగంగా తెలంగాణలో అదానీ గ్రీన్ ఎనర్జీ 1350 మెగావాట్ల సామర్థ్యంతో రెండు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనుంది. దీనికి రూ.5 వేల కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఇక చందనవెల్లిలో అదానీ కొనెక్స్ డేటా సెంటర్లను ఏర్పాటు చేయనుంది. 100 మెగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటుకు రూ.5వేల కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. కాగా, అంబుజా సిమెంట్స్ లిమిటెడ్ రాష్ట్రంలో రూ.1400 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకుంది. ఏడాదికి 6 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు చేయనుంది. అదానీ ఏరోస్పేస్, డిఫెన్స్ పార్క్‌లో కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, క్షిపణి అభివృద్ధి, తయారీ కేంద్రాలకు అదానీ గ్రూప్ రూ.1000 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. అదానీ గ్రూప్ ప్రాజెక్టులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సహాయ సహకారాలను తెలంగాణ ప్రభుత్వం అందిస్తుందని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి.. గౌతమ్ అదానీకి హామీ ఇచ్చారు. కాగా, తెలంగాణలో పెట్టుబడిదారులకు కొత్త ప్రభుత్వం స్నేహపూర్వక వాతావరణం కల్పించిందని గౌతమ్ అదానీ అన్నారు. కొత్త పారిశ్రామిక విధానం మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేలా ఉందని, తమకు అందించిన ప్రోత్సాహంతో తెలంగాణలో వేగంగా వృద్ధి చెందుతామని చెప్పారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుపైనా గౌతమ్ అదానీతో సీఎం చర్చించారు. తెలంగాణలో తమ పెట్టుబడులతోపాటు స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటుకు అదానీ తన సంసిద్ధత వ్యక్తం చేశారు. త్వరలోనే ఇంటిగ్రేటెడ్ స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ స్కిల్లింగ్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామన్నారు. పూర్తి వివరాలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. అదానీ నిర్ణయాన్ని ముఖ్యమంత్రి స్వాగతిస్తూ సంతోషం వ్యక్తం చేశారు.

8 వేల కోట్లతో బ్యాటరీ సెల్ తయారీ కేంద్రం

గోదీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తెలంగాణలో గిగాస్కేల్ బ్యాటరీ సెల్ తయారీ కేంద్రాన్ని నెలకొల్పనుంది. ఇందుకు సంబంధించి రూ.8 వేల కోట్ల భారీ పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఈ యూనిట్‌లో గంటకు 12.5 గిగావాట్ల సామర్థ్యముండే బ్యాటరీ సెల్ తయారు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు గోదీ ఇండియా కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈవో మహేష్ గోదీ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమై అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ప్రాజెక్టు మొదటి దశలో 6వేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ముందుగా 2.5గిగావాట్ల కెపాసిటీ సెల్ అసెంబ్లింగ్ లైన్ తయారు చేసి, రెండో దశలో 10గిగావాట్లకు విస్తరిస్తారు.

తెలంగాణలో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు..

జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ అనుబంధ సంస్థ జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ.. తెలంగాణలో రూ.9 వేల కోట్ల పెట్టుబడితో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, నియో ఎనర్జీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దావోస్‌లో జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమై చర్చలు జరిపారు. ఈ కొత్త ప్రాజెక్టు 1,500 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీలో భాగంగా ఈ ఒప్పందం కుదుర్చుకున్నామని, భవిష్యత్తు ప్రాజెక్టులపై జిందాల్ గ్రూప్‌నకు సహకరించడానికి ప్రభుత్వం ఆసక్తిగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. సజ్జన్ జిందాల్‌తో చెప్పారు. ప్రభుత్వం అందించిన సహకారానికి జిందాల్ కృతజ్ఞతలు తెలిపారు.



జిందాల్ సంస్థ ప్రతినిధులతో సీఎం రేవంత్, శ్రీధర్‌బాబు

ఖమ్మంలో అతిపెద్ద ఆయిల్‌పామ్ సీడ్ గార్డెన్..

గోద్రెజ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నాదిర్ గోద్రెజ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. చర్చల సందర్భంగా వ్యూహాత్మక పెట్టుబడుల ద్వారా తెలంగాణలో గోద్రెజ్ గ్రూప్ అడుగుజాడలను బలోపేతం చేసేందుకు నాదిర్ గోద్రెజ్ ఆసక్తి వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాలో మొదటి దశలో రూ.270 కోట్లతో భారతదేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేస్తామన్నారు. గోద్రెజ్ గ్రూప్ ఇటీవలే మలేసియా ఆయిల్ పామ్ దిగ్గజం సిమ్ డార్బీతో జాయింట్ వెంచర్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంలో భాగంగా గోద్రెజ్.. భారతదేశంలోని మొట్టమొదటి వాణిజ్య ఆయిల్ పామ్ సీడ్ గార్డెన్‌ను ఖమ్మంలో ఏర్పాటు చేయనుంది. ఏటా 7మిలియన్ పామాయిల్ మొక్కలను ఉత్పత్తి చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఇది మిలియన్ ఎకరాలకు పైగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌కు మద్దతు ఇస్తుందని కంపెనీ తెలిపింది. అలాగే 1000 కోట్ల కెమికల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని గోద్రెజ్ చైర్మన్ ప్రకటించారు.

ఆరాజెన్ లైఫ్ సైన్సెస్ ఒప్పందం..

ఆసియాలో డ్రగ్ డిస్కవరీ, డెవలప్‌మెంట్ సేవలకు కేంద్రంగా హైదరాబాద్ స్థానాన్ని సుస్థిరం చేస్తూ ఆరాజెన్ లైఫ్ సైన్సెస్ రూ.2 వేల కోట్ల కొత్త పెట్టుబడితో విస్తరణ చేపట్టనున్నట్లు తెలిపింది. ఈ మేరకు కంపెనీ డైరెక్టర్ మన్ని కంటిపూడి.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైన తర్వాత ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలోని మల్లాపూర్‌లో ప్రస్తుతం ఉన్న సదుపాయాన్ని మరింత పెంచుకోవడానికి విస్తరణ చేస్తామని కంపెనీ తెలిపింది. కాగా, ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి బుధవారం టాటా సన్స్ గ్రూప్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్, విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రిషద్ ప్రేమ్‌జీలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న పారిశ్రామిక అనుకూల విధానాలను వివరించారు. సీఎం విజ్ఞప్తిపై వారు సానుకూలంగా స్పందించారని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. త్వరలో పెట్టుబడుల ప్రకటన వస్తుందని ఆశిస్తున్నామన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

'బిట్స్' ఇంజనీరింగ్ అడ్మిషన్ టెస్ట్

పిలానీలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్)- 'బిట్స్‌ఎట్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. హైదరాబాద్ క్యాంపస్, పిలానీ క్యాంపస్, కేకే బిర్లా గోవా క్యాంపస్‌లలో ఈ టెస్ట్‌లో సాధించిన ర్యాంకుతో అడ్మిషన్ పొందవచ్చు. బీఈ, బీఫార్మసీ, ఎమ్మెస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొందిన అభ్యర్థులు మొదటి సంవత్సరం పూర్తయిన తరవాత ఇంజనీరింగ్ డ్యూయెల్ డిగ్రీలో చేరే వీలుంది.

కోర్సులు-స్పెషలైజేషన్‌లు

బీఈ స్పెషలైజేషన్‌లు: కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్, మెకానికల్, మాన్యుఫాక్చరింగ్

బీఫార్మసీ

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: బయలాజికల్ సైన్సెస్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్ మేథమెటిక్స్, ఫిజిక్స్, జనరల్ స్టడీస్

అర్హత

గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. బీఫార్మసీ ప్రోగ్రామ్‌కు బయాలజీ అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గ్రూప్ సబ్జెక్టులకు సంబంధించి ఒక్కోదానిలో కనీసం 60 శాతం మార్కులు, మొత్తమ్మీద 75 శాతం మార్కులు ఉండాలి. ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం తప్పనిసరి. గత ఏడాది ఇంటర్ స్థాయి కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు, ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. 2022లోకానీ అంతకన్నా ముందుకానీ ఇంటర్/తత్సమాన కోర్సు పూర్తిచేసినవారు, ప్రస్తుతం బిట్స్ క్యాంపస్‌లలో చదువుతున్న వారు దరఖాస్తుకు అనర్హులు. ఇంటర్/తత్సమాన కోర్సుల్లో టాప్ ర్యాంక్‌లు సాధించిన అభ్యర్థులకు సంస్థ నిబంధనల ప్రకారం నేరుగా అడ్మిషన్స్ ఇస్తారు. వీరు బిట్స్‌ఎట్ రాయనవసరం లేదు.

దీనికి సంబంధించిన వివరాలను జూన్ 1 నుంచి వెబ్‌సైట్‌లో చూడవచ్చు.



బిట్స్‌ఎట్ 2024 వివరాలు

- ఇందులో నాలుగు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో ఫిజిక్స్ నుంచి 30; రెండో పార్ట్‌లో కెమిస్ట్రీ నుంచి 30; మూడో పార్ట్‌లో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ నుంచి 10, లాజికల్ రీజనింగ్ నుంచి 20; నాలుగో పార్ట్‌లో మేథమెటిక్స్/బయాలజీ నుంచి 40 చొప్పున మొత్తం 130 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. పదకొండు, పన్నెండు తరగతులకు నిర్దేశించిన ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు ఉంటాయి. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు.
- అన్ని ప్రశ్నలకూ సమాధానాలు గుర్తించిన తరవాత ఇంకా సమయం మిగిలి ఉంటే అభ్యర్థులు అదనపు ప్రశ్నలకు సమాధానాలు గుర్తించవచ్చు. ఇందులో ఫిజిక్స్ కెమిస్ట్రీ, మేథమెటిక్స్/బయాలజీ, లాజికల్ రీజనింగ్ అంశాల నుంచి ఒక్కోదానిలో మూడు చొప్పున మొత్తం పన్నెండు ప్రశ్నలు ఇస్తారు. వీటికి సమాధానాలు గుర్తించి అధిక స్కోర్ పొందవచ్చు. ఒకసారి ఈ ఆప్షన్ ఎంచుకొన్న తరవాత బ్యాక్‌కి వెళ్లి మొదటి 130 ప్రశ్నలకు సంబంధించి కరెక్షన్స్ చేయడం సాధ్యం కాదు.
- బిట్స్‌ఎట్‌ను రెండు విడతల్లో నిర్వహిస్తారు. అభ్యర్థులు రెండుసార్లూ పరీక్ష రాయవచ్చు. రెంటిలో బెస్ట్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటారు. అభ్యర్థులు రెండో విడత ఎగ్జామ్ రాయదలచుకొంటే దరఖాస్తులో తెలపాల్సి ఉంటుంది. లేని పక్షంలో రెండో విడత అప్లికేషన్ విండో ఓపెన్ కాదు. పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

ముఖ్య సమాచారం

దరఖాస్తు ఫీజు: పురుషులకు రూ.3,400; మహిళలకు రూ.2,900; రెండో విడత ఎగ్జామ్ రాయాలంటే పురుషులు రూ.2,000; మహిళలు రూ.1500 అదనంగా చెల్లించాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 11

అప్లికేషన్ కరక్షన్ విండో ఓపెన్: ఏప్రిల్ 15 నుంచి 19 వరకు

టెస్ట్ తేదీ, స్లాట్ రిజర్వ్: మే 6 నుంచి 10 వరకు

హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్: మే 15 నుంచి

బిట్స్‌ఎట్ 2024 మొదటి విడత తేదీలు: మే 21 నుంచి 26 వరకు

రెండో విడత అప్లికేషన్ విండో ఓపెన్: మే 22 నుంచి జూన్ 10 వరకు

రెండో విడత అప్లికేషన్ కరక్షన్ విండో ఓపెన్: జూన్ 11 నుంచి 12 వరకు

రెండో విడత టెస్ట్ తేదీ, స్లాట్ రిజర్వ్: జూన్ 15 నుంచి 17 వరకు

రెండో విడత హాల్ టికెట్ డౌన్‌లోడింగ్: జూన్ 19 నుంచి

బిట్స్‌ఎట్ 2024 రెండో విడత తేదీలు: జూన్ 22 నుంచి 26 వరకు

పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి

ఇంటర్/ పన్నెండోతరగతి మార్కులతో అడ్మిషన్ కోసం దరఖాస్తు తేదీలు: జూన్ 1 నుంచి 28 వరకు



వెబ్‌సైట్: bitsadmission.com

ఐఐటీ ఢిల్లీలో ఎంబీఏ

ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీడీ) ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(డీఎంఎస్)- ఎంబీఏ ఫుల్ టైం ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తానికి 72 క్రెడిట్స్ నిర్దేశించారు. క్యాట్ 2023 స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు

- టెలీకమ్యూనికేషన్ సిస్టమ్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఫైనాన్స్, మార్కెటింగ్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్

అర్హత

- టెలీకమ్యూనికేషన్ సిస్టమ్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు ఇంజనీరింగ్/ టెక్నాలజీ/ఆర్కిటెక్చర్/ఫార్మసీ డిగ్రీలు పూర్తిచేసినవారు; బీఎస్సీ(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు; ఫిజిక్స్ కెమిస్ట్రీ, మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ అప్లికేషన్, ఎలక్ట్రానిక్ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఆపరేషన్స్ రీసెర్చ్, కంప్యూటేషనల్/ఇన్ఫర్మేషన్ సైన్స్, అగ్రికల్చర్, ఎకనామిక్స్, కామర్స్ ప్రధాన సబ్జెక్టులుగా డిగ్రీ పూర్తిచేసినవారు; సీఏ/ఐసీడబ్ల్యుఏఐ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. మిగిలిన స్పెషలైజేషన్‌లకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. క్యాట్ 2023 అర్హత తప్పనిసరి.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 31
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** మార్చి 11 నుంచి 14 వరకు
- ఇంటర్వ్యూ కేంద్రం: ఐఐటీ ఢిల్లీ క్యాంపస్
- **వెబ్‌సైట్:** dms.iitd.ac.in



అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో అకడమిక్ కోర్సులు

హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ఏఓయూ)- గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల్లో పలు స్టడీసెంటర్లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు తమకు అనువైనదాన్ని ఎంచుకోవచ్చు.

డిగ్రీ

బీఏ, బీకాం, బీఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో కోర్సు వ్యవధి మూడేళ్లు. బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) గ్రూపు అభ్యర్థులు అర్హులు. ఏపీ/తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ లేదా నేషనల్ ఓపెన్ స్కూల్ నుంచి ఇంటర్ ఉత్తీర్ణులు; పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ మాధ్యమాల్లో ఒకటి ఎంచుకోవాలి.

బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. దీనిని తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుకునే వీలుంది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రికార్డు అసిస్టెంట్‌గా ఏడాది అనుభవం లేదా డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు(లైబ్రరీ సైన్స్) పూర్తిచేసినవారు; ప్రొఫెషనల్ డిగ్రీ(లా/ఇంజనీరింగ్/ఫార్మసీ) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి.

పీజీ

ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఏ(జర్నలిజం) ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లు మినహా అన్నింటినీ తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ.

అర్హత: ద్వితీయశ్రేణి మార్కులతో సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లాంగ్వేజెస్‌లో ఎంఏ కోర్సుకు డిగ్రీలో సంబంధిత లాంగ్వేజ్‌ని సెకండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలి. ఎంకాం కోర్సుకు బీబీఏ/బీబీఎం/బీఏ(కామర్స్) అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ(మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్) కోర్సుకు బీఈ/బీటెక్ అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ సైకాలజీకి ఏదేని డిగ్రీ పాసైతే చాలు.

మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఈ కోర్సు ఉంది. కనీసం 40 శాతం మార్కులతో బీఎల్ఐఎస్సీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.



- కోర్సు వ్యవధి ఆర్నెల్లు. విభాగాన్ని అనుసరించి పదోతరగతి/ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు.

సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు

- **విభాగాలు:** ఫుడ్ అండ్ న్యూట్రిషన్, లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఎన్‌జీఓస్ మేనేజ్‌మెంట్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్.
- ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ కోర్సును ఇంగ్లీష్ మాధ్యమంలో, మిగిలినవాటిని తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

పీజీ డిప్లొమా

కోర్సు వ్యవధి ఏడాది. ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. చార్టర్డ్ అకౌంటెన్సీ/కాస్ట్ అకౌంటెన్సీ/కంపెనీ సెక్రటరీ కోర్సులు పూర్తిచేసినవారు కూడా అర్హులే.

డిప్లొమా

కోర్సు వ్యవధి ఏడాది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: సైకలాజికల్ కౌన్సెలింగ్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, రైటింగ్ ఫర్ మాస్ మీడియా ఇన్ తెలుగు, హ్యూమన్ రైట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం, ఉమన్ స్టడీస్.

రైటింగ్ ఫర్ మాస్ మీడియా ఇన్ తెలుగు విభాగానికి మాత్రం ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు మాస్ మీడియాలో కనీసం మూడేళ్ల అనుభవం ఉన్న అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సైకలాజికల్ కౌన్సెలింగ్ విభాగానికి(డిగ్రీ/ఎంఏ/ఎమ్మెస్సీ)(సైకాలజీ) పూర్తిచేసినవారు మాత్రమే అప్లయ్ చేసుకోవాలి.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 31
- **వెబ్‌సైట్:** www.braouonline.in

ఎఫ్‌డీడీఐలో వివిధ ఖాళీలు

ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ)...కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 16

పోస్టుల వివరాలు:

1. సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీర్/సైంటిస్ట్(ఎర్గోనామిక్స్ అండ్ బయోమెకానిక్స్): 3
2. అసోసియేట్ ప్రాజెక్ట్ ఇంజనీర్/సైంటిస్ట్(పాలిమర్ అండ్ నిట్టింగ్): 2
3. అసోసియేట్ ఫుట్‌వేర్ డిజైనర్(డిజైన్): 1
4. జూనియర్ టెక్నాలజిస్ట్(టెస్టింగ్ ల్యాబ్): 2
5. అసోసియేట్ ప్రాజెక్ట్ సైంటిస్ట్(ఎర్గోనామిక్స్ అండ్ బయోమెకానిక్స్ టెస్టింగ్ ల్యాబ్(హ్యూమన్ ఫిజియాలజీ): 1
6. టెక్నీషియన్: 1
7. ప్రాజెక్ట్ టెక్నీషియన్(అడ్వాన్స్‌డ్ ప్రింటింగ్- డిజిటల్ ఫ్యాబ్రిక్ ప్రింట్ అండ్ పోస్ట్ ప్రాసెస్): 1
8. స్ట్రాటజీ డెవలపర్/మేనేజర్(హెచ్‌ఓ)(క్వాలిటీ): 1
9. సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీర్(ఇంఛార్జ్/హెడ్): 1
10. సింపుల్ మేకర్(షూ మేకింగ్)(డిజైన్ స్టుడియో అండ్ ప్రొడక్ట్ డెవలప్ ల్యాబ్): 1
11. అసోసియేట్ ప్రాజెక్ట్ ఇంజనీర్/సైంటిస్ట్(అడ్వాన్స్‌డ్ ప్రింటింగ్): 1





అర్హత: టెక్స్‌టైల్ ఇంజనీరింగ్‌లో ఎమ్మెస్సీ, ఎంటెక్ బయోమెడికల్ ఇంజనీరింగ్/సైన్స్‌లో పీహెచ్‌డీ, ప్లాస్టిక్/పాలిమర్ కెమికల్ ఇంజనీరింగ్‌లో బీఈ, బీటెక్, ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్‌లో ఎండీఈఎస్, ఇంటర్‌తో పాటు ఆరు నెలల ఫుట్‌వేర్ టెక్నాలజీలో 50 శాతం మార్కులతో సర్టిఫికెట్ కోర్సు కలిగి మూడేళ్ల పని అనుభవం ఉండాలి.

జీతం: సంబంధిత పోస్టును అనుసరించి రూ.30,000 నుంచి రూ.1,30,000 వరకు చెల్లిస్తారు.

వయోపరిమితి: 38-40 ఏళ్లు మించరాదు

ఎంపిక విధానం: షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా

దరఖాస్తు చివరి తేదీ: జనవరి 29

వెబ్‌సైట్: https://fddiindia.com/

జాబ్ కార్నర్

ఎన్‌ఎల్‌సీలో అప్రెంటిస్‌లు

నైవేలి(తమిళనాడు)లోని నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌ఎల్‌సీ ఇండియా లిమిటెడ్)...కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 632

1. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: 314 పోస్టులు
2. టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్: 318 పోస్టులు

విభాగాలు: మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఫార్మసీ.

శిక్షణ వ్యవధి: ఒక సంవత్సరం

స్టయిపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.15028; టెక్నీషియన్ అప్రెంటిస్‌కు రూ.12524.

అర్హతలు: సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ లేదా టెక్నాలజీలో డిప్లొమా/డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: డిప్లొమా/డిగ్రీలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: జనవరి 18

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 31

అభ్యర్థుల ఎంపిక జాబితా వెల్లడి: ఫిబ్రవరి 19

అప్రెంటిస్‌షిప్ ప్రవేశ తేదీలు: 2024 ఫిబ్రవరి 23 నుంచి 29 వరకు

వెబ్‌సైట్: https://www.nlcindia.in/new_website/index.htm

ఆర్‌పీఎన్‌ఎల్‌యూలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ప్రయాగ్‌రాజ్(ఉత్తరప్రదేశ్)లోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ నేషనల్ లా యూనివర్సిటీ... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అసిస్టెంట్ ప్రొఫెసర్ **ఖాళీలు: 6**

సబ్జెక్టులు: హిస్టరీ, ఇంగ్లిష్, పొలిటికల్ సైన్స్ లా, సోషియాలజీ

అర్హత: 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ, నెట్/స్లెట్/సెట్ లేదా పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వేతనం: నెలకు రూ.15,600 - రూ.39,100

దరఖాస్తు ఫీజు: రూ.2,500. ఎస్సీ అభ్యర్థులకు రూ.2,000

ఎంపిక విధానం: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ప్రెజెంటేషన్, మాక్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 20

వెబ్‌సైట్: https://www.rpnlup.ac.in/

లిటిల్స్



కుందేలు తెలివి

పెద్ద తుఫాను. భీకరమైన వర్షానికి నది పారుతోంది. ఓ కుందేలు పిల్ల నీటిలో కొట్టుకుని పోయి బ్రతికిపోయింది. బతికినందుకు సంతోషపడింది. ఆ రాత్రివేళ దాటిన తర్వాత చూస్తే తనో లంకలో విసిరివేయబడ్డది. అక్కడ ఉండే పచ్చగడ్డి, దొరికిన ఆహారం తిని రోజూ ఏడ్చేది. దేవుడు ఎంత దొంగవాడు అనుకుంటూ తిట్టుకునేది.


ఒక రోజు లంకలో ఏడుస్తూ కూర్చుంది కుందేలు. ఓ దుంగ తేలుతూ వస్తోంది. అది మొసలి అని అర్థం చేసుకుంది. మొసలి బావా నీ గురించి తెలుసులే.. తల పైకెత్తు అన్నది. మొసలి ఆశ్చర్యపోయింది. కుందేలు ఇలా అన్నది.. 'ఈ గడ్డిమీదకు రా. ఎప్పుడూ నీళ్లలోనే ఉంటావు. మాలా ఆడుకోలేవు. గంపెడు పిల్లలు మీకు ఉండరు కదా?' అన్నది కుందేలు. 'అదేంటీ.. అలా అంటున్నావు. మాకేమీ కాదు. నీళ్లలోనే ఉంటాం' అన్నది. 'అయినా మీ గుడ్లుమీరే తింటారట కదా. మీకు పిల్లలు ఎక్కడివిలే' అన్నది వెటకా



రంగా. ఇది అబద్ధం. అయినా నీలా మాట్లాడించేవారు లేరు.. అన్నది భోరున ఏడుస్తూ మొసలి. 'మాలా సంతోషంగా గడపటం మీకు రాదు. ఆకారం పెద్దది. తెలివి తక్కువ' అన్నది. మొసలి కోప్పడింది. 'కోప్పడి ఉపయోగం లేదు. పట్టుమని వంద మంది దండు కూడా మీరు ఉండరు' అన్నది. మొసలి రోషంగా తీసుకుంది. కేకలేసింది. నిముషాల్లో నీళ్లలో మునిగిన మొసళ్లు వచ్చాయి. భయంతో లోలోపల కుందేలు వణికిపోయింది.

ఇపుడు చూశావా? నా తడాఖా అన్నది మొసలి. అయినా మీరు ఈ లంకనుంచి ఆ తీరం వరకు వరుసగా ఉంటే తీరం కూడా తాకదులే అన్నది వెటకారంగా. వెంటనే మొసళ్లను వంతెనలా కట్టమన్నది. అన్నీ వరుసగా వంతెనలా కట్టాయి. 'కనీసం వంద ఉంటే గొప్పనేమో' అన్నది కుందేలు. 'ఎంచుకో' అన్నది మొసలి. 'మీరంతా దగ్గరగా ఉండండి. అప్పుడు లెక్కపెడతా' అన్నది కుందేలు. ఒకదాని మీద ఎగురుతూ అవతలి తీరం మీదకు క్షణాల్లో వెళ్లిపోయింది. తీరం వెళ్లిన తర్వాత పొట్టపట్టుకుని కుందేలు నవ్వింది. ఎందుకంత నవ్వు? అన్నది మొసలి. 'ఏమీ లేదు. ఆ లంకలో ఏడ్చాను ఇన్నాళ్లు. మీరు పేరుగా పెద్ద జీవాలు. మెదడు లేదు. దేవుడు తెలివి ఇవ్వలేదు. నాకు తెలివి ఇచ్చాడు. నేను ఏమి చెబితే అది చేశావు. నీ మూర్ఖత్వానికి జోహార్లు' అంటూ కుందేలు నవ్వింది. కుందేలు మోసం చూసి మొసలి గట్టిగా ఏడ్చింది.


దారి కనుక్కోండి



చుక్కలు కలపండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 206

8	2							
	4	6			2		3	
		3		7				
9			6		5	4		
7			9		1			8
		2	7		8			5
				8		3		
	8		4			1	2	
							8	6

సుడోకు - 205 సమాధానం

7	8	2	9	4	1	5	3	6
9	5	4	3	6	2	7	1	8
3	1	6	5	7	8	2	4	9
4	6	3	2	9	7	1	8	5
8	7	1	6	3	5	9	2	4
2	9	5	1	8	4	3	6	7
5	4	7	8	1	3	6	9	2
1	2	9	4	5	6	8	7	3
6	3	8	7	2	9	4	5	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.